
ఆంధ్రసచిత్రవారపత్రిక

18-2-77
75 పైసలు





కథలు

వుడ్‌హవుస్ రాసిన సమ్మర్ మూన్ షైన్స్ అన్న నవలలో ఒక ముసలి పాత్రను అంతా చీదరించుకుని అవమానపరుస్తుంటారు. చివరిలో అతనే ఒక మిలియనీర్ అని తెలియటం, అతను చేసిన ధన సహాయమే హీరో హీరోయిన్ల ప్రేమ పెళ్ళిగా మారటానికి కారణం అవటం జరుగుతాయి. ఈ పాత్రనే ఆర్థర్ హెయిలీ తన, హోటల్ అన్న నవలలో కొన్ని మార్పులతో ప్రవేశపెట్టాడు. [దాదాపుగా కాపీ కొట్టాడన్నమాట] ఆ హోటల్ లోని పాత్ర ముమ్మూర్తులా కిస్టైర [రచన దేసెట్టి కేశవరావు 28.1.77 సంచిక] కథలో పాకెట్‌మార్ పాత్రను పోలి ఉంటుంది.

కె. వి. ఎల్. ఎస్. ప్రకాశ్, [తీంన రం.]

* *

జయసుధ ముఖచిత్రంతో వెలువడిన 'ఆంధ్ర పత్రిక వారపత్రిక' ఎంతో ఆకర్షణీయంగా ఉంది. ఈ వారం కథలలో కాకాని కమలగారు వ్రాసిన 'ఆకలి' అన్న కథ ఎంతో ఆసక్తిదాయకంగా ఉంది. ఇందులో రచయిత్రిగారు ఒక రచయితకు కావలసిన భావాలు ఎలా వస్తాయో ఈ కథ ద్వారా వివరంగా తెలిపారు.

రాచకొండ గంగాధర్ [జగిత్యాల]

సీరియల్

సీరియల్సులో అన్నీ బాగున్నాయి. 'హో తార కత' సినిమాలలో చేరాలనేవారికి కనువిప్పు కాగలదు. సినిమా విషయాలలో శ్రీనివాస్‌గారు చిత్రాల జాతకముల గురించి చెప్పడం మాత్రం బాగుండదు. కారణం మ. క్షేత్రయ్య రజతోత్సవం తథ్యం అని వ్రాశారు. ఆ చిత్రం కనీసం అర్ధ శతదినోత్సవానికైనా నోచుకోలేకపోయింది. కాబట్టి చిత్ర సమీక్ష వ్రాయడం బాగుంది. కాని 'ఫ్యూచర్'ని గురించి చెప్పడం బాగోదు.

కె. ఓ. సూర్యప్రకాశరావు, [కురబలకోట.]

అట్టమీద బొమ్మ

21.1.1977 ఆంధ్రపత్రికపై హిందీనటి 'రీనారాయ్' ముఖచిత్రం గ్రుడ్డిగా ఉంది. ఎందుకంటే, తెలుగు వారపత్రికపై హిందీనటి ముఖచిత్రం అంతగా రాణించలేదు. ఎంతో మంది క్రొత్త తెలుగు సినిమా తారల్ని విడిచి హిందీ నటిని ఎన్నుకోవడం అంత సమంజసంగా లేదు. ఇక ముందైనా తెలుగు నటీనటుల ముఖచిత్రాలతో మీ [మా] పత్రిక శోభాయమానంగా విలసిల్లాలని నా ఆశయం!

అబ్దుల్ సలాం [ఆల్వాన్‌పల్లి]

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
[1938–1972]
శుక్రవారం : 18-2-'77
నలనామ సం. మాఘ బ. అమావాశ్య
సంపుటము 70 : సంచిక :25

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ
*
పోస్టులో ఏడాది చందా రు. 41–60
" ఆరుమాసాల చందా రు. 20–80
విడి ప్రతి వెల 75 పైసలు
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ–520003.

విషయ సూచిక

కథలు :

పాపులారిటీ ఈజెసిన్ ... 14
రజతోత్సవ సన్మానం ... 18
అంతస్సుకి అటూ ఇటూ... 31
ఏది స్నేహ ధర్మం? ... 40


సీరియల్ కథలు :

ఇన్‌క్రెడిబుల్ గాడెస్ ... 6
మగదిక్కు ... 22

వ్యాసాలు, శీర్షికలు :

ఉత్తరాలు—4, లోకం పోకడ–5, వార ఫలం—10, రాలిన ముత్యాలు —11, హైదరాబాద్ నోట్‌బుక్—12, జైస్కోప్ బాతాఖానీ—26, సినిమా—27, డాక్టర్ సలహాలు—33, ప్రశ్నావళి—35, ధర్మ పథం – 37, ఫాలాక్షుని డైరీ — 39, నకిలీ డాక్టరు—42, యువతరం— 48, స్కోరెంత?, మీకు తెలుసా ?–49.

లోకం పోకడ - జేమెన్



సీరియల్
ఇన్‌క్రెడిబుల్ గాడెస్
డాక్టర్ కేశవరెడ్డి

(గత సంచిక తరువాయి)

సూర్యుడు ఆకాశంమధ్య నిలిచి ప్రకాశిస్తున్నాడు. తారురోడ్డు కళపెళలాడుతున్నది. తారురోడ్డు కరిగి ఎండలో మెరుస్తున్నది.

రామచంద్రుడు కుటుంబ సమేతంగా ఆరోడ్డుమీద ప్రయాణం చేస్తున్నాడు అతడు చిరుగుల తువ్వాలును నెత్తిమీద చుట్టగా చేసుకుని దానిమీద ఒక కొయ్యపెట్టెను ఉంచుకుని నడుస్తున్నాడు. ఆ పెట్టెకు ఉన్న నాలుగు కాళ్ళలో మూడు చెద తినివేసి ఉన్నవి. చేవకొయ్యతో చేయబడిన దవటం వల్లనైతేనేమి, బహుపురాతనమైనది కావటం వల్లనైతేనేమి ఆ పెట్టె నల్లగా ఉన్నది. పండుగ పబ్బాలప్పుడు, మంగళ శుక్రవారాలప్పుడు నట్టింట వెలసిన కులదేవతలతో బాటు ఈ కొయ్యపెట్టెను గూడా పసుపు కుంకుమ పెట్టి నాగ పూజించేది. ఆ కుటుంబానికి సంబంధించిన విలువైన వస్తువులన్నీ ఆ పెట్టెలో దాచబడెవి. ఆ పెట్టెకు ఉండిన కుంకుమ గుర్తులు లీలగా మాత్రం కనిపిస్తున్నవి. లోపల పలురకములైన వస్తువులున్నవి. పందిరూపాయల నోట్లు రెండు ఒక సిగరెట్టు పెట్టెలో జొనపబడి ఒకమూల ఉన్నవి. పదిరూపాయల విలువగల చిల్లరడబ్బులు ఒక చిన్న మూటలో మరొక మూల ఉన్నవి అ ముగ్గురి బట్టలు ఆ పెట్టెలోనే ఉన్నవి. రెండు మూడు చిరుగులు గలిగిన ఒక పంచె, మాసికలతో నిండిన ఒక చీర అలాంటిదే మరొక రవిక, మాసికలలో నిండిన నిక్కరూ ఇవన్నీ ఆ పెట్టెలోనే ఉన్నవి. ఇంకా ఉప్పు, చింతపండు, రెండుపిడికెళ్ళ మిరపకాయలు, చారెడు ధనియాలు, కొంత రాగిపిండి, కంది పప్పు ఆ పెట్టెలో ఉన్నవి.

నాగ గునగున నడుస్తూ భర్తను అనుసరిస్తున్నది. ఎడమచేతితో ఆమె తన తలపైన ఉన్న బరువును పట్టుకుని ఉన్నది. తలమీద ఒకదాని మీదొకటిగ రెండు మూటలున్నాయి. క్రింది మూటలో తవుడు, పై మూటలో గానుగపిండి ఉన్నవి.

వారిద్దరకు ముందుగా కిష్టుడు నడుస్తున్నాడు. వాడి చంక నుండి జనపనార సంచి వేలాడుతున్నది. ఆ సంచి అడుగున ఒకమూల ఎలుక గాబోలు తినివేసింది. ఆ సంచిలో వాడు చదివే ఆరోతరగతి పుస్తకాలున్నాయి. ఇంకా వాడు అభ్యాసం చేసే వీధి నాటకాల పాటల పుస్తకాలున్నాయి. చేపలు పట్టడానికి ఉపయోగించే గేలాల పొట్లం గూడా ఉన్నది.

కిష్టుడి చేతిలో రెండు బారల పొడవున్న సన్నటి వెదురు బెత్తమున్నది వాడు బెత్తాన్ని గాలిలో అటూ ఇటూ ఆడిస్తూన్నప్పుడది చివ్వు చివ్వుమని చప్పుడు చేస్తున్నది. వాడా బెత్తంతో తన ముందు నడుస్తున్న పందులను అదిలిస్తున్నాడు.

వాళ్ళు రోడ్డుమీద పురోగమిస్తునారు. ఫర్లాంగు రాళ్ళు, మైలురాళ్ళు, వంతెనలు, సైన్ బోర్డులు, చింతచెట్లు ఒక్కటొక్కటే వెనకకు పోతున్నాయి. కొండలు, గ్రామాలు, మైదానాలు, నదులు వెనక బడుతున్నాయి.

తన గమ్యమేదో రామచంద్రుడు నిర్ణయించుకోలేదు. తన ఇంటిని కూలద్రోసిన గంగపట్నం హరిజనులను, తన ఇంటిని కూలద్రోయించిన "పెద్దరెడ్డి"ని వదలి వారికి దూరంగా పోవాలన్నదే అతని సంకల్పం. వాళ్ళ పేరు వినబడని సీమకు, వాళ్ళ నీడ పారని చోటుకు, వాళ్ల కబంధ హస్తాలకతీతమైన తావుకు అతను పారిపోతున్నాడు.

> **జరిగినకథ :4** రామచంద్రుడు చేసిన చాకిరీకి ఫలితంగా ఇల్లు కట్టుకోవటానికి పోరంబోకు నేల ఇస్తాడు పెదరెడ్డి. రామచంద్రుడి భార్య నాగ. పెదరెడ్డి కోరినట్లు కోర్టుకెళ్ళి దొంగ సాక్ష్యం చెప్పదు రామచంద్రుడు. పెదరెడ్డి రిపోర్టు చేయటంతో పోరంబోకు ఖాళీచేయమని రామచంద్రుడికి ఉత్తర్వు జారీ చేస్తాడు కలెక్టరు. పెదరెడ్డిని వేడుకోటానికి వచ్చిన రామచంద్రుడిని లోటి హరిజనులే హింసిస్తారు. రామచంద్రుడి ఇల్లు పడగొట్టిస్తారు ప్రభుత్వాధికారులు.

మూట ముల్లె సర్దుకుని గమ్యం తెలియని ప్రయాణాన్ని ప్రారంభిస్తూ కూలిన తన ఇంటిని చివరిసారిగా చూసినప్పుడు రామచంద్రునిలో వేదన తుఫానువలె రేగింది. అతడు తన కొడుకు ముందు మోకరిల్లి, వానిని అక్కున జేర్చుకుని, "మనం యాడ బోదుం రా కొడకా. ఉండూరు ఇడిసిపెట్టి యాడ బోదుం రా నాయనా" అని విలపించాడు. నాగ తన చీర చెరగుతో కళ్ళు తుడుచుకుంటూ, నుదుటిమీద పడివున్న ముంగురులను ఎగద్రోసుకుంటూ, "రాముడుండాడు. రాజ్జిముండది. మన కింత నీడ దొరకదా" అంది.

ప్రయాణాన్ని ఆరంభిస్తూ రోడ్డుమీద అడుగు పెట్టగానే తన వేదన సగానికి తగ్గినట్లు రామచంద్రునికి అనిపించింది. గంభీరంగానూ, గూఢంగానూ వేయేండ్లు జీవించిన వృద్ధునివలె ఆరోడ్డు తనకు కన్పట్టింది. ఎన్నో రహస్యాలను, ఎన్నో నాగరికతలను, ఎన్నోసిద్ధాంతాలను అది తన ఎదలోదాచుకుని ఉన్నట్లు అతనికి అనిపించింది.

రామచంద్రుని పాదాలు రోడ్డుమీద సాగుతున్నాయి.

లోకాన్ని సరికొత్త కోణం నుంచి వీడించాలని సమకట్టిన సూర్యుడు పడమటికి వాలాడు.

వాళ్ళు నడుస్తున్న రోడ్డు విశాలంగానూ, ఎత్తుగానూ ఉన్నది. రోడ్డుకు కుడివైపున ఒక పెద్ద చెరువు ఉన్నది. చెరువు నీటితో నిండి ఉంది. అలలు రోడ్డుయొక్క రాతికట్టు దానికి కొట్టుకుంటున్నాయి. రోడ్డుకు ఎడమవైపున బురద నీటితో నిండిన కుంట ఉన్నది.


బురద నీటిని చూడగానే పందుల గుంపులో సంచలనం కలిగింది. అవి ఒక దానినొకటి నెట్టుకుంటూ రోడ్డువారకు జరగసాగాయి. కిష్టుడు తండ్రివైపు చూశాడు. రామచంద్రుడు ఒకసారి తలెత్తి ఆకాశంవైపు చూసి, "ఎండ పందుల్ని వడగొట్టేస్తాఉంది. వాటిని కుంటలోకి తోలా. కొంచెపు దొరనీ." అన్నాడు

అప్పటికే పందులు రోడ్డును దిగుతూ కుంటవైపు సాగుతున్నవి. అటనున్న చింతమాను కింద రామచంద్రుడు, నాగ తమ నెత్తులమీదున్న బరువులను దించారు. పందులు దబుకు దబుకు మంటూ కుంటలోకి

ప్రవేశించి దొర్లడం మొదలుపెట్టాయి. కిష్టుడు పందులను చూస్తూ, రోడ్డు అంచు మీద కూర్చున్నాడు.

నాగ తన నడుములో దోపుకుని ఉన్న చీర చెంగును విప్పి విదిలించి, "ఏమన్నా ఉడక బెడుదునా?" అనడిగింది.

రామచంద్రుడు "ఉడకబెట్టి వాడికియ్యి. నువ్వింత తిను. నాకేమీ ఆకలి లేదు" అన్నాడు. అతడు కొయ్యపెట్టెను తెరచి అందులో నుంచి ఒక కొడవలిని తీసుకుని దానితో చింత బొబ్బడలను చెక్కడం ప్రారంభించాడు.



నాగ మూడు రాళ్లను ఏరితెచ్చి రోడ్డు వారన చింతమాను మొదట పొయ్యిని అమర్చింది. చింత బొబ్బడలను పొయ్యిలో వేసి రగిల్చింది. నూక బియ్యాన్ని నీటిని పాత్రలో పోసి పొయ్యి మీద పెట్టింది.

లారీ ఒకటి దడదడ మని చప్పుడు చేసుకుంటూ రోడ్డుమీద పరుగెత్తింది. ఎర్రటి దుమ్ము మేఘంవలె దాని వెన్నంటి పోతున్నది.

రామచంద్రుడు నాలుగు దోసిళ్ల చింత బొబ్బడలను తెచ్చి పొయ్యి ముందు పోశాడు. నాగ ఒక పిడికెడు తీసి పొయ్యిలో వేసి, "ఇవి చాల్లే. చారెడు బియ్యం ఉడికేదానికి ఎన్ని బొబ్బళ్ళు కావాల?" అన్నది.

రామచంద్రుడు "కూరేం చేస్తావు?" అనడిగాడు.

"ఉప్పు ఉంది, మిరపకాయలున్నాయి. చింతపండుంది చారు పెట్టేస్తా" అంది నాగ.

రామచంద్రుడు "చింతపండు బయటకు తియ్యకు, ఈడ వోపినన్ని పచ్చిచింతకాయ లున్నాయి, రాల్చుకొస్తా పచ్చడి చెయ్యి" అన్నాడు.

పచ్చిచింతకాయలు కొమ్మల నుండి గుత్తులు గుత్తులుగా వ్రేలాడుతున్నాయి. కాయల భారానికి కొమ్మలు వ్రాలిఉన్నవి. రామచంద్రుడు గులకరాళ్ళతో చింతకాయలను కొట్టసాగాడు. గులకరాళ్లు చివ్వు చివ్వున ఎగిరి, కాయలను నేలగూల్చి, చెరువు నీటిలో బుడుంగు బుడుంగుమని పడుతున్నాయి. అతడు కాయలను ఏరి తువ్వాలులో వేసి తెచ్చాడు.

నీటిమీద సూర్యుడు మిలమిల మెరుస్తున్నాడు. నీటి కోళ్ళు మంద గమనంతో నీటి మీద తిరుగుతున్నవి. అవతలి గట్టుమీద గేలం వేసి చేపలు పట్టుతున్న కొందరు కదలకుండా నల్లరాతితో చెక్కబడిన బొమ్మల వలె కూర్చుని ఉన్నారు. నీటి అంచు వద్ద రెల్లుగడ్డి నిలువెత్తు పెరిగి ఉన్నది. రెల్లు పొదల వెనకనున్న కానుగ చెటలో వడంగి పిట్ట టక్కు టక్కుమని చప్పుడు చేస్తున్నది.

ఉడికిన నూక బియ్యాన్ని చింత పచ్చడితో నంజుకుంటూ వాళ్ళు ముగ్గురూ తిన్నారు. చెరువు నీటిలో చేతులు కడుగుకున్నారు. నాగ రోడ్డు అంచున కొంగు పరచుకుని మేను వాల్చింది. రామచంద్రుడు చింతమాను బోదెకు చేరగిలబడి, నీలాకాశాన్ని చూస్తూ ఆలోచనలలో మునిగిపోయాడు.

రోడ్డు ప్రక్కన బురద కుంటలో పందులు ఇదే స్వర్గ మనుకుంటూ దొర్లు తున్నాయి.

లారీ ఒకటి దడదడ శబ్దం చేసుకుంటూ రోడ్డుమీద వస్తున్నది. అది చేరువుగా వచ్చే కొద్దీ దాని చప్పుడు భరించరానిదిగా ఉన్నది. అది రామచంద్రుడు విడిసి ఉన్న చింత మానును దాటుకుని గబుక్కున ఏదో జ్ఞాప

కొని కొచ్చినట్లు రోడ్డు వారగ ఆగిపోయింది. ఫ్రంట్ సీటు నుండి ఒక వైపున డ్రైవరు, మరొక వైపున క్లీనరు కిందకు దిగారు. ఇద్దరూ చింతమాను కిందకు నడచి వచ్చారు.

డ్రైవరు రామచంద్రుని ఉద్దేశించి, "మీ దగ్గర బొక్కెన ఉందటయ్యా ఉంటే మాకు కొంచెం ఇచ్చి పుణ్యం కట్టుకోండి" అన్నాడు.

రామచంద్రుడు, "ఉంది. చిల్లులు పడిన బొక్కెన ఒకటి ఉంది. బొక్కెనతో ఏం పనో మీకు?" అనడిగాడు.

డ్రైవరు, "ఇంజనుకు నీళ్ళు పోసుకోవాల కొంచెం ఇవ్వు ఇప్పుడే ఇచ్చేస్తాం" అన్నాడు.

కిష్టుడు కొయ్యపెట్టె మీదనుండి దిగి పెట్టెను తెరచి బొక్కెనను తీసి డ్రైవరుకు ఇచ్చాడు. డ్రైవరు దానిని క్లీనరుకిచ్చాడు. క్లీనరు బొక్కెనను ఊపుకుంటూ రోడ్డు దిగాడు.

డ్రైవరు తను తలకు చుట్టుకుని ఉన్న మఫ్లరును తీసి రామచంద్రునకు చేరువగా వేసి దానిమీద కూర్చుంటూ. "యాభై మైళ్ళు కొట్టుకొచ్చేసినా. రేడియేటర్‌లో నీటి చుక్క లేకుండా యాభై మైళ్ళు కొట్టుకొచ్చేశా. ఏ దేవుడో చెయ్యడ్డం పెట్టినాడు. లేకపోతే ఇంజను బూడిదయి యుండాల్సింది" అన్నాడు.

"దోవలో యాడా నీళ్ళు దొరకలేదా నీకు?" అన్నాడు రామచంద్రుడు.

ఇన్‌క్రెడిబుల్ గాడెస్

"నీళ్ళకేం కరువు యాడ జూసినా నీళ్ళే. కాని దేనితో ఎత్తి పోసుకుందుం. నిన్నటి దాక మా దగ్గిర ఒక బొక్కెన ఉండేది. పది లీటర్లు పట్టే బొక్కెన. నీ బోటి పెద్ద మనిషి పుణ్యం కట్టుకున్నాడు" అని నాలుక కరుచుకుని, "ఏమీ అనుకోబోకన్నా నీ బోటి పెద్ద మనిషని ఊరికే మాట వరసకు అన్నానంతే. నిన్నెందుకు వాడితో పోల్చాల. నాచు వెదవ. నత్తగుల్లలు తినే వెదవ" అని తుపుక్కున ఉమిశాడు.

"ఏం దట్టు తిట్టేస్తా ఉండావు?" అన్నాడు రామచంద్రుడు.

"తిట్టడవా? వాడు గనక మళ్ళీ నా కంట బడితే వాని గుండు గొరిగి సున్నం బొట్లు పెట్టి పంపించేద్దును. పెండ్లాన్ని సంతలో పెట్టే యదవ. టౌనులో పెట్రోలు బంకు దగ్గర అలో లచ్చునా అంటూ పడి ఉన్నాడు. బస్సులన్నీ పోయినాయి, రైళ్ళన్నీ పోయినాయి నీ పేరు చెప్పుకుంటా నన్ను మా వూరికి చేర్చు అన్నాడు. పోనీగదా అని బండిలో ఎక్కించుకున్నా. అంతే దిగిపోయేటప్పుడు బొక్కెనను గూడా చేతబట్టుకు పోయాడు. వాని మొకానికి గ్లాస్కోరు పంచె కట్టినాడు చేతికి గడియారం గూడ కట్టినాడు ముండలకు పుట్టినెదవ" అన్నాడు డ్రైవరు.

క్లీనరు రేడియేటరును నీటితో నింపాడు.

ఖాళీ బొక్కెనను తీసుకొచ్చి చింతచెట్టు కింద పెట్టాడు

డ్రైవరు తన చొక్కా జేబులో నుండి బీడీ కట్టను తీసి, మూడు బీడీలను క్లీనరు చేతికిచ్చాడు. క్లీనరు మూడు బీడీలను పొయ్యిలో ముట్టించి రామచంద్రునికొకటి, డ్రైవరుకొకటి ఇచ్చి, ఒకటి తను నోటిలో పెట్టుకుని డ్రైవరు ప్రక్కన నేలమీద కూర్చున్నాడు.

రామచంద్రుడు బీడీని నోటిలో పెట్టుకుని పొగలాగి వదులుతూ, "పుణ్యానికి పోతే మీకు పాప మెదురయింది." అన్నాడు.

"బొక్కెన ఒకటే అనుకున్నావా బాడీలో ఒక స్పేరు ఉండింది దాన్ని గూడా మాయం జేసినాడు లంజికొడుకు" అన్నాడు డ్రైవరు.

"స్పేరు దొంగిలించుకు పోయి ఏం జేసుకుంటాడు" అన్నాడు రామచంద్రుడు.


"ఏం జేసుకుంటాడా? వాని కాష్ఠం మీద పెట్టి కాల్చుకుంటాడు ఆ స్పేరు గూడా చలిమంట వేసుకోవడానికి తప్ప మరెందుకూ పనికి రాదు. అది ఏడేండ్లుగ దేశంలో ఉండే రోడ్లన్నీ చెడ దిరిగి నున్నగా అరిగిపోయింది. స్పేరు పోయిన సంగతి తెలిస్తే మా ఓనరు గంగ జాతర జరిపిస్తాడు. తన బట్టతలలాగే నున్నగా ఉంటాయనో ఏమో అతనికి అరిగిపోయిన స్పేర్లంటే బలే ప్రాణం" అన్నాడు డ్రైవరు.

క్లీనరు బీడీ చివరన ఏర్పడిన బూడిదను రాల్చి, "మా డ్రైవరుకు మాత్రం నున్నగా ఉండే ఆడవాళ్ళంటే బలే ఇష్టం" అంటూ డ్రైవరుకు దూరంగా జరిగి కూర్చున్నాడు.

డ్రైవరు క్లీనరు వైపు చురుగ్గా చూసి, రామచంద్రుని వైపు తిరిగి, "ఇదన్నా వరస. పుడీ యదవ గూబ మాదిరి కూసినాడా; రేపిదే కూత మా వోనరు కూడా కూస్తాడు. నే నొక ముండలకోరని మా వోనరు అనుకోవడం. అతగాడి లెక్క ప్రకారం నాకీ రోడ్డు వెంబడి మైలు కొక లంజ ఉండాలి. బొక్కెన తీసుకుపోయి ఏ లంజ కిస్తివి? స్పేరును ఏ ముండ దగ్గర పెడితివి అంటు పంచాయితీ పెడతాడు" అన్నాడు.

రోడ్డు వారన పడుకుని కునుకు తీస్తుండిన నాగ మేలుకుని తలత్రిప్పి, లారీ మనుషుల వైపొకసారి చూసి మళ్ళీ నిద్ర కుపక్రమించింది.

తను చర్చిస్తున్న ధోరణిని, తన చర్చ



నీయాంశాన్ని మార్చాలన్న స్పృహ డ్రైవరుకు కలిగింది. అతడు మౌనంగా బీడీని ఊదసాగాడు.

క్లీనరు డ్రైవరుతో తన సొంత విషయాలను ఏకరువు పెడుతూ, "నువ్వు రేపు జోసఫ్ గాడిని పిల్చుకొచ్చుకో నేను రాను. నేను కోర్టుకు పోవాల" అన్నాడు.

డ్రైవరు నోటిదాక తీసుకుపోయిన బీడీని కిందకు దించి "మర్చేపోయినా. రేపు కోర్టు వాయిదా అనేమాట మర్చేపోయినా" అన్నాడు.

క్లీనరు "రేపు అఖరు వాయిదా. ఈ జీతంలేని కొలువు ఇకచాలు. రేపు అటో యిటో తేలిపోతుంది" అన్నాడు.

రామచంద్రుడు "కోర్టంటూ ఉండాదు ఏందన్నా కత ?" అన్నాడు.

వారఫలం

18-2-1977 శుక్రవారం మొదలు 24-2-1977 గురువారం వరకు

మేషం :— వ్యాపారంలో ఆదాయం బాగుంటుంది. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. వారం మధ్యలో మీ తాలూకు వస్తువులు పోవచ్చును. శ్రమకలుగు తుంది. వారం ఆఖరులో మీకార్య క్రమాలు బాగుంటాయి స్త్రీలకు — ఆరోగ్యం బాగుండదు సంతానానికి సౌఖ్య సంతోషాలు లబిస్తాయి

వృషభం: — అన్ని వ్యవహారాల్లోను గౌరవం బాగుంటుంది. సజ్జన సాంగత్యం లభిస్తుంది. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. రావలసిన డబ్బు అందుతుంది. వారం ఆఖరులో చేజిక్కిన అవకాశాలు కూడా జారిపోవచ్చును. స్త్రీలకు — దైవకార్యాలునెరవేరతాయి. ప్రయాణాలువాయిదా పడతాయి.

మిధునం: — వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. ప్రయాణాలు ఫలిస్తాయి. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. సాహసిక వ్యవహారాలు లాభించగలవు. స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

కర్కాటకం:— ప్రయోజనంలేని శ్రమ కలుగు తుంది. ఆందోళనకు గురి కాగలరు. వారం మధ్యలో నూతన వ్యవహారాలు లాభిస్తాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. అన్ని వ్యవహారాల్లోను గౌరవం బాగుంటుంది. స్త్రీలకు — కుటుంబ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. విలాసవస్తువులు కొంటారు.

సింహం :— ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. మీ ఆలోచనలు ఫలిస్తాయి. వారం మధ్యలో వృత్తిలో ఎవరినీ విశేషంగా నమ్మడం తగదు. ప్రయాణాల్లో శ్రమకలుగు తుంది. వారం ఆఖరులో అనుకూలమైన మార్పులు వస్తాయి. స్త్రీలకు — ఆరోగ్యం బాగుండదు. బంధు మిత్రులను కల్సుకొంటారు.

కన్య :— రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగు తుంది. ఆడంబరంకోసం వ్యయంచేస్తారు. ప్రయాణాలు ఫలిస్తాయి. ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి. వారం ఆఖరులో వ్యతిరేక పరిస్థితి యేర్పడగలదు. స్త్రీలకు — కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. దైవకార్యాలు నెరవేరతాయి.

తుల :— మీ కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. మిత్రుల సహాయం లభి

డ్రైవరు "దోవనపోయే పీకులాటల్ను ఇంటికి తెచ్చుకోవటంలో మా క్లీనరు గెట్టోడు. బతకలేనమ్మ ఒకటి నీళ్లలోదూకి ప్రాణం తీసుకుంటూ ఉంటే వీడు చూసి అర్రి కూతలు పెట్టి నలుగుర్ని పోగేసి ఆమెను గట్టుకు ఈడ్చి కాపాడినాడు. ఆమెకు తెలివొచ్చి కండ్లు తెరవగానే పోలీసోల్లొచ్చి ఆమెకు బేడీలేసి కోర్టుకు తీసుకుపోయారు: ముందు చూసింది మావాడే గనక వీడిని మొదటి సాక్షిగ వేసుకుని కోర్టుకీడ్చి చంపతా

కాలం

గాలానికి చిక్కిన చేపల్లా
కాలానికి చిక్కిన జ్ఞాపకాలు
కలల అలల్లో తేలిపోతున్న గతం గుర్తులు
కాలపు కర్కశత్వానికి బందీలు;
కాలం ఒక బాధాహేల
కాలం ఒక మృత్యుకేళి; అగ్నిజ్వాల
ఉషస్సో, తమస్సో ఏదైతేనేం?
అన్నీ కాలం వాలానికి ఖైదీలు
కాలం ఒక విలాసశాల
మధురసంలో మత్తెక్కించి
అందని లోతుల్లోకి తోస్తుంది ;
కాలం ఒక కొరడా
చెళ్లున చరచి మరిచిన
జ్ఞాపకాలు గుర్తుచేస్తుంది

— కె. రాంమోహన్‌రాజు.

ఉండారు" అన్నాడు.

క్లీనరు "అరవకుండా విట్లుందునన్నా, ఆడమనిషి నీళ్లలోపడి గిల గిల కొట్టుకుంటా ఉంటే కయిక్కుయిక్కనకుండా ఎట్లోచ్చేద్దును" అన్నాడు.

డ్రైవరు "అది నీ తప్పుగాదు నీ ఖర్మ అంతే లేకపోతే సరిగ్గా ఆ ఊరి దగ్గరే రేడియేటరులో నీళ్ళు అయిపోవడమేమిటి. ఆ బావిదగ్గరే బండిని ఆపడమేమిటి నెన్నీ చేతికి బొక్కెన ఇచ్చిపంపడమేమిటి ?" అన్నాడు.

రామచంద్రుడు "మనిషికి ప్రాణం పోతా ఉంటే కాపాడినారు. మీరు జేసింది మంచిపనే గదన్నా దానికి వాగిసేదేంది ?" అన్నాడు.

డ్రైవరు. "ఏంమంచి. వల్లకాట్లో మంచి ఉన్న మూడెకరాల నేలను, యింటినీ అప్పులోల్లు వేలం వేసుకు పోయిరి. అవమానాలు పడలేక ఆయమ్మమొగుడు నెలనాళ్ళ క్రితమే చెట్టుకు ఉరేసుకుని చచ్చె. ఇంగ ఈమె బతికి ఏంబాపుకోవాల?" అన్నాడు.

రామచంద్రుడు, "అట్టనుకుంటే యట్లా ? బిడ్డాపాపలకు ఒకదోవ అయ్యేదాక కన్నోళ్ళు బతికుండాల గదా?" అన్నాడు

క్లీనరు అందుకుని, "ఆయమ్మగూడ ఇవన్నీ బాగ ఆలోచించింది. ముగ్గురు కూతుళ్ళను ముందుగా బావిలోకితోసి తరవాత తాను దూకింది. కూతుళ్ళు ముగ్గురూ వయసులో పదేళ్ళలోపే. నేనుపోయి చూసేటప్పటికి ముగ్గురూ నీళ్ళుబాగ తాగేసి ప్రాణాలొది

ఇన్‌క్రెడిబుల్ గాడెస్

లేసినారు" అన్నాడు.

ఏదో చెప్పబోయి, గొంతుకులో ఏదో అడ్డు తగిలినట్లు రామచంద్రుడు ఊరుకున్నాడు. ఆతడు మౌనంగా బిలలకేసి చూస్తూ కూర్చున్నాడు. అతనిచేతిలో బీడీ సన్నగా పొగ వదులుతూ కాలుతూవుంది. డ్రైవరు తనకి నచ్చినట్టు దానిని తారురోడ్డుమీదకు విసిరి కొట్టాడు. అది గాలితాకిడికి ఎగిరి రోడ్డు అంచు మీదపడింది. క్లీనరు బీడీ ముక్కను నేలకురాచి. చెవిలో చెక్కుకుని, "చచ్చుంటే ఆ మహాతల్లి పైలోకాననా సుఖంగా ఉండేది. ఇప్పుడు కోర్టులో ఆమెనడిగే కొచ్చిన్లు ఒకటేగాదు, రెండుగాదు. అన్నీ పచ్చికూతలే. నువ్వయితే నాలిక పెరుక్కోని చచ్చుందువు." అన్నాడు.

రామచంద్రుడు. "ఆయుస్సు గెట్టిగా ఉండబట్టి ఆయమ్మ బతికి బయట పడడంతో పోలీసోల్లొచ్చి బేడీలేసి తీసుక పోయినారుగాని, అమె ఆ నీళ్లలోనే సచ్చుంటే ఈల్లు ఏం జేసుందురు?" అనడిగాడు.

డ్రైవరు తన చేతులను ఆకాశం వైపు "అంతా దేవుడికే తెలియాలి" అన్నట్లు చూపించి, "అదంతా మనకేం తెల్సు; మనకు తెలిస్తే మన బతుకు ఇట్లుండునా. నా క్రి లారీ తోలుకునే గాచ్చారమూ, నీకీ చింత చెట్టు కింద పడుండే గాచ్చారమూ ఉండునా?" అని, అకస్మాత్తుగా ఏదో గుర్తు

స్తుంది. అనవసరమైన సందేహాలు కలుగుతాయి. ఎవరితోను వాదప్రతివాదాలు తగవు. భాగస్వాములతో కలిసిచేసే వ్యాపారాలు లాభిస్తాయి. స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

వృశ్చికం :— స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. ఇతరుల నిమిత్తం శ్రమపొందవలసి వస్తుంది. స్త్రీలకు — బంధుమిత్రులను కల్సుకొంటారు. ఆడంబరంకోసం వ్యయం జరుగు తుంది.

ధనుస్సు :— వృత్తిలో పోటీవారిపోటీ తగ్గుతుంది. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. ప్రయాణాలు వాయిదా పడతాయి. మున్ముందు లాభించగల వ్యవహారాల్లో అభివృద్ధిని సాధిస్తారు. స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మకరం :— రావలసినడబ్బు అందుతుంది. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. ప్రయాణాలు ఫలిస్తాయి. మీ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. వారం ఆఖరులో అన్ని వ్యవహారాల్లోను ఫలితం సామాన్యంగా ఉంటుంది. స్త్రీలకు — కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

కుంభం:— ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి. మీ ఆలోచనలు ఫలించగలవు. వృత్తిలో పోటీవారిపోటీ తగ్గుతుంది. స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది. అలంకారవస్తువులు కొంటారు.

మీనం :— చికాకులు కలుగుతాయి. ఉద్యోగంలో యెవరినీ విశేషంగా నమ్మడం తగదు. వారం మధ్యలో మీ కార్యక్రమాలు బాగుంటాయి. మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఇతరులతో కలిసి చేసే వ్యాపారాలు బాగుంటాయి. స్త్రీలకు — కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అధిక వ్యయం జరుగు తుంది.

— మహేష్

రాలిన ముత్యాలు

......శ్రీ సోమసుందర్......

దేనికైనా తంత్రశక్తి ఎంతగొప్పదో
మంత్రశక్తి కూడా అంతే గొప్పదని
ధ్రువపరచడానికి విశ్వ ప్రయత్నం చేసిన
మిహిరకులుడు పాపం కన్ను
మూశాడీ మధ్యనే !

కొచ్చినట్టు రామచంద్రుని కళ్ళల్లోకి గుచ్చి చూస్తూ "మన దేవూరన్నా. అడగడమే మర్చిపోయినా" అన్నాడు.

రామచంద్రుడు, "మా వూరి పేరు గంగపట్నం. నువ్వు విని వుండవులే. ఈ రోడ్డుమీదే తూర్పుగా పది మైళ్ళు పోతే వస్తుంది. అది ఇప్పుడు నా వూరని చెప్పుకుంటే చెల్లుతుందా? చెల్లదు. కొంపా గోడు వదులుకుని వచ్చేసినా" అంటూ ప్రారంభించి తన ఇల్లు నేల మట్టం చేయబడిన ఉదంతాన్ని క్లుప్తంగా చెప్పాడు.

సూర్యుడు పడమటి ఆకాశాన దిగుతున్నాడు. ఎండ తాకిడికి భరించలేక ఒకకాకి చెరువు నీళ్ళలో మునిగి రోడ్డు అంచున కూర్చుని రెక్కలు కొట్టుకుంటూ,ముక్కుతో రెక్కల కింద గీరుకుంటూ ఉన్నది. రోడ్డు మీద లారీలూ, బస్సులు అప్పుడొకటి అప్పుడొకటి పరుగిడు తున్నవి. వేడి సూర్యుడి నుంచే గాక, భూమి నుంచి గూడా వస్తున్నట్లు మాడ బెడుతున్నది. కొందరు బాటసారులు తువాళ్లను తడిపి నెత్తిన వేసుకుని నడుస్తున్నారు.

రామచంద్రుడు తనచేతిలోని బీడీముక్కను కిందకు జారవిడిచాడు. కథనం ముగిసిన పిదప కొంతవడి మౌనంగా ఉండి డ్రైవరు "మన బ్రతుకులే అంత. మన బ్రతుకుల్ని తవ్వే కొద్దీ ఇట్టా కతలే బయట పడతాయి. మంగలోడి డిబ్బను తోడేకొద్దీ బొచ్చు బయట పడినట్లు మన బతుకుల్ని తవ్వే కొద్దీ ఇట్టా కతలే బయట పడతాయి." అంటూ తన మెడలో వ్రేలాడుతున్న శిలువ బొమ్మను తీసి బనీను వెనకు వేసుకున్నాడు.

డ్రైవరు తన చేతులను మోకాళ్ళచుట్టూ వేసుకుని "ఏదిఏమైనా నువ్వు సొంత ఊరును వొదిలేసి రావలసింది కాదు. మీ ఊరి నొదిలేసి నంతమాత్రాన కష్టాలు తీరిపోతాయనుకోవడం పొరబాటు. ఏ వూరికి పోయినా ఇదే మనుషులు ఇవే ఆగడాలు" అన్నాడు.

"అంతేనా" అన్నాడు రామచంద్రుడు. నిరాశ ఒక కొండవలె అతని ఎట్ట ఎదుట నిలుచున్నట్లనిపించింది.

డ్రైవరు మౌనంగా ఉన్న రామచంద్రుడిని చూస్తూ "నువ్వు కడుపులో ఏవో ఆశలు పెట్టుకుని బయల్దేరి ఉంటావు. నిన్ను నిరుత్సాహ పరచడం మా ఉద్దేశం కాదు. కావాలంటే నిన్ను లారీలో తీసుకుపోయి మీరు కోరినచోట దింపుతాం." అన్నాడు.

రామచంద్రుడు "నేను ఫలానా తావుకు పోవాలని అనుకుని బయల్దేరలేదన్నా. ఈ గెడ్డ నొదిలి దూరంగా నూరు, ఇన్నూరు మైళ్లు కవతలకెళ్లిపోవాల అంతే." అన్నాడు.

డ్రైవరు "ఐతే మా బండిలో ఎక్కు. పొద్దుపోయేలోగా నిన్ను ఇన్నూరు మైళ్ల కవతల దింపేస్తా" అన్నాడు.

రామచంద్రుడు పందుల వైపుచూపిస్తూ "మాతోపాటు కొన్ని పందుల్ను తోలుకొచ్చుకున్నాం. వాటి కత ఎట్ల ?" అన్నాడు.

డ్రైవరు తలత్రిప్పి, కుంటలో దొర్లుతున్న పందులను చూసి. "ఆ పందులు నీవేనా? నేనింకా ఎవ్వరివో అనుకున్నా. దగ్గిర దగ్గిర ఇరవైదాకా ఉన్నట్టున్నాయి. ఇంగ నీకేంవన్నా ఏ వూరికి పోయినా, ఏ రాజ్యానికి పోయినా నువ్వా పందుల్ను అడ్డం పెట్టుకుని రాజాలాగా బతక వచ్చునే" అన్నాడు.

రామచంద్రుడు, "వాటిని లారీలో తీసక పోయేదెట్ల?" అన్నాడు.

డ్రైవరు, "అదెంత పని నే నీ లారీలో రకరకాల జీవాలను తిప్పినాను. దున్నపోతుల్ని తిప్పినా, బాతు కోళ్ళను తిప్పినా, కోతుల్ను గూడా తిప్పినా" అని రోడ్డు పరిసరాలను ఒకసారి పరిశీలనగా చూసి, "మీ రొక పని చేయండి. మీరు పందుల్ను రోడ్డు మీదకు తోలుకుని రండి. నే నీలోగా లారీని బాక్ చేసి తీసుకొచ్చి రోడ్డు దించి ప్రక్కన నిలబెడతాను. తోల్ గేట్ తెరిచినానంటే పందులు రోడ్డుమీద నుండి సునాయాసంగా బాడీలోకి నడిచి వెళ్లిపోతాయి" అని లేస్తూ "పొద్దు గూడ వాలిపోయింది. లేవండి. బయలు దేరదాం" అన్నాడు.

రామచంద్రుడు భార్యను లేపి, కొయ్య పెట్టెను సర్దుకో సాగాడు. కిష్టుడు రోడ్డు దిగి పందులను కుంట నుండి బయటకు తోలసాగాడు. డ్రైవరు లారీ వద్దకు నడచి కాబిన్ సీటులో కూర్చుని ఇంజన్ స్టార్ట్ చేశాడు. లారీ మెల్లగా భారంగా వెనకకు నడవ సాగింది.

(ఇంకా వుంది)

హైదరాబాద్ నోట్ బుక్

ఆంధ్రప్రదేశ్ బాలల మహాసభలు :

ఫిబ్రవరి 10, 11, 12, 13 తేదీలలో కేశవ మెమోరియల్ హైస్కూలు ఆవరణలో జరుగనున్న రాష్ట్ర బాలల మహాసభకు సన్నాహాలు చురుకుగా సాగుతున్నాయి. విద్యామంత్రి శ్రీ ఎం. వి. కృష్ణారావు అధ్యక్షులుగా, శిశు, మహిళా సంక్షేమశాఖ మంత్రిణి శ్రీమతి కృష్ణవేణి సంజీవయ్య, ఉపాధ్యక్షురాలుగా, సాంస్కృతిక వ్యవహారాల ప్రత్యేకాధికారిగా, డాక్టర్ అంతటి నరసింహం కోశాధికారిగా, శ్రీ న్యాయపతి రాఘవరావు కార్యదర్శిగా, శ్రీ బుడ్డిగ సుబ్బరాయన్ నిర్వహణ కార్యదర్శిగా ఆహ్వానసంఘం ఏర్పడింది. 12 ఉప సంఘాలు ఏర్పడ్డాయి. ఆర్థిక సంఘం: డి. సీతారామయ్య అధ్యక్షులు, కె. పుల్లయ్య సమావేశకర్త, ఆదరణ సంఘం: కొత్తూరి సీతయ్య గుప్త అధ్యక్షులు, పోలిసెట్టి నరసింహారావు సమావేశకర్త. కార్యక్రమ సంఘం : బి. కృష్ణంరాజు అధ్యక్షులు, వై. గోపాలరావు సమావేశకర్త. ప్రదర్శన సంఘం: పి. టి. రెడ్డి అధ్యక్షులు, వై. ఆంజనేయులు సమావేశకర్త. రవాణా సంఘం— ఎం. పి. వి. అనంత అధ్యక్షులు, ఇ. సీతారామయ్య సమావేశకర్త. ప్రచార సంఘం— సి. వి. నరసింహారెడ్డి అధ్యక్షులు, సిద్దాని నాగభూషణం కన్వీనర్. ప్రత్యేక సంచికా సంఘం— తిరుమల రామచంద్ర అధ్యక్షులు, జి. రామకృష్ణారావు సమావేశకర్త. నాటక, రంగస్థల సంఘం— డాక్టర్ మొదలి నాగభూషణశర్మ అధ్యక్షులు, గరిమెళ్ళ రామమూర్తి సమావేశకర్త. ప్రతిభా పాటవ పోటీల సంఘం [1] పి. శ్రీరామశాస్త్రి అధ్యక్షులు పి. వి. ఆర్. భద్రిరాజు సమావేశకర్త. ప్రతిభాపాటవ పోటీలు. [2]—పోతుకూచి సాంబశివరావు అధ్యక్షులు, ఎస్. వి. రమణారావు సమావేశకర్త. ఆరోగ్య పారిశుద్ధ్య సంఘం— డాక్టర్ పి. తిరుమలరావు, అధ్యక్షుడు, డాక్టర్ హెచ్. పి. సుందర్ సమావేశకర్త. అంతరరాష్ట్ర బాలల సంఘం—డాక్టర్ సి. ఎస్. ఆర్. అప్పారావు అధ్యక్షులు, డాక్టర్ ఎం. వి. శాస్త్రి సమావేశకర్త. సదస్సు సంఘం—శ్రీ ఉత్పల సత్యనారాయణాచార్య అధ్యక్షులు, డి. వి. ఎస్. శర్మ సమావేశకర్త.

తెలుగు బాలల అకాడెమీ ఆధ్వర్యాన 1976 నవంబరు 14న ఎనిమిది రంగాలలో మూడు వయో వర్గాల బాలలకు 22 జిల్లాలలో ప్రతిభాపాటవ పోటీలు జరిగాయి. వాటిలో ప్రథమబహుమతి పొందిన విజేతల సంఖ్య దాదాపు 520. వీరిలో సంగీతం 30 నృత్యం 37, నాటక బృందాలు 32, వ్యాసరచన 51, ఫోటోగ్రఫీ 10, వర్ణచిత్రం 48, గేయరచన 23 వక్తృత్వం 50 ఉన్నారు. ఇప్పుడు వీరంతా ఆయా రంగాలలో రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొనడానికి వచ్చారు. ఈ మహాసభ రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో పనిచేస్తున్న బాల సంఘాల ప్రతినిధులు వచ్చారు.

అన్ని జిల్లాలనుండి దాదాపు వేయి మంది బాలప్రతినిధులు వచ్చారు. వీరికి రైళ్లు, బస్సురేట్ల తగ్గింపులతో ప్రయాణ సౌకర్యాలు కలిగించబడినవి. ప్రతినిధులందరికీ ఉచిత వసతి భోజనసౌకర్యాలుఉన్నాయి.

పద్మావతీ శ్రీనివాసం :

తిరుమల తిరుపతి దేవస్థానం, అన్నమాచార్య సంస్థల ఉమ్మడి యాజమాన్యాన జనవరి 21 వ రవీంద్రభారతిలో ప్రదర్శితమైన, పద్మావతీ శ్రీనివాసం నృత్య నాటిక నాట్యాచార్యుడు వెంపటి చిన సత్యానికి, నర్తకి కుమారి శోభా నాయుడుకు మరొక కీర్తి పతాక. కన్నుల పండువయిన ఈ నృత్య నాటికలో పద్మావతిగా శోభానాయుడు, శ్రీనివాసుడుగా మంజుభార్గవి, ఎరుకసానిగా అనుపమ తమనృత్యనైపుణ్యంతో ప్రేక్షకులను అనిమేషులను చేశారు. నృత్యనాటిక పేరుతోనే పద్మావతీకల్యాణమనడం స్పష్టం. పద్మావతి ఆవును, దూడను చోళరాజుకు అమ్మడం, ఎరుకసాని పద్మావతి శ్రీనివాసుల వివాహానికి ఆకాశరాజును అంగీకరింపజేయడం, వియ్యాలవారిద్దరు పెళ్ళికి తరలిరావడం చాలమనోహరమైన సన్నివేశాలు. వినుడయ్యా, ఎవ్వడే వాడు, ఎన్ని యుగాలకు వంటి గీతాల అభినయంలో చేరడేసి కళ్ళ శోభానాయుడు శఫరీసదృశనేత్రాలు కుమ్మరించిన సాత్త్విక భావపరంపర ప్రేక్షకులకు మరు జన్మలోనూ మరపురాదు. ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యామంత్రి శ్రీ మండలి ప్రత్యేక సంచిక ఆవిష్కరించారు. శ్రీ సి. అన్నారావు అధ్యక్షత వహించారు. శ్రీ బి. కృష్ణంరాజు స్వాగతం చెప్పారు. ఇలాటి అపూర్వ నేత్ర సమారాధనను ఏర్పాటు చేసినదేవస్థానం వారిని, అన్నమాచార్య సంఘాన్ని ప్రశంసిస్తున్నాను. ఒక్కటి మాత్రం చెప్పక తప్పదు ఆలస్యం అమృతం విషం అన్నారు పెద్దలు. దృశ్యాల ఏర్పాటుతో విలంబం ప్రేక్షకులకు విసుగెత్తిస్తుంది. కొంత త్వర, చురుకుదనం అవసరం. ఏమైనా అటు చండాలిక అయినా, ఇటు పద్మావతి అయినా, సత్యభామ అయినా పాత్రలో లీనమై పాత్రకే వన్నె శోభలు కూర్చే శోభానాయుడును, ప్రాచీన వస్తువైనా, నవీన వస్తువైనా ప్రేక్షక రంజకంగా సంఘశ్రేయోదాయకంగా నృత్యాలు మలచే నాట్యాచార్యుడు శ్రీ వెంపటి సత్యంను మనసారా అభినందిస్తున్నాను.


ఎన్నికల సంబరం :

ప్రస్తుతలోకసభను రద్దు చేసినట్లు, వచ్చే మార్చినెలలో ఎన్నికలు జరుగనున్నట్లు ప్రధాని శ్రీమతిగాంధి జనవరి 18 వ తేదీన ప్రకటించడంతోనే నగరంలో ఎన్నికల సంబరం ఆరంభమయింది. రాష్ట్రంలోని 42 లోక్‌సభ స్థానాలూ కాంగ్రెస్ పార్టీ గెలుచుకోగలదని ముఖ్యమంత్రి శ్రీవెంగళరావు జనవరి 19 వ తేదీన పత్రికా ప్రతినిధులతోఅన్నారు. నగర నియోజకవర్గం నుంచి ఉత్తరప్రదేశ్ గవర్నర్ డాక్టర్ చెన్నారెడ్డి పోటీ చేస్తారనే వదంతి బయలుదేరింది. శ్రీ మొరార్జీదేశాయ్ అధ్యక్షుడుగా కమ్యూనిస్టేతర ప్రతిపక్షాల కొన్నిటితో ఏర్పడిన జనతా పార్టీలో శ్రీ నీలం సంజీవరెడ్డి మున్నగు ఆంధ్ర ప్రముఖులున్నారు. శ్రీ సంజీవరెడ్డి జనవరి 25 న పత్రికా ప్రతినిధులతో ముచ్చటిస్తూ, జనతాపార్టీకి ఎన్నికలలో బ్రహ్మాండమైన మెజారిటీ రాగలదని అదే కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలదని అన్నారు. వచ్చే ఎన్నికల ఫలితాలు అందరినీ దిగ్భ్రాంతులను చేయగలవని, రాష్ట్రంలోని 42 స్థానాలకు జనతాపార్టీ పోటీ చేస్తుందని అన్నారు. తమ పార్టీ ఐక్యసంఘటన ఎంతమాత్రమూ కాదని, సంపూర్ణ స్థాయి రాజకీయ పక్షమని— ఆయన అన్నారు. తమ పార్టీకి నిధులు లేవని,న్యాయవర్తనులైన, ప్రజాస్వామ్య పరిరక్షకులైన ప్రజలేతమనిధులని శ్రీ రెడ్డి అంటున్నప్పుడు ఆయనకన్నులలోను గొంతుకలోను దృఢ విశ్వాసం పొంగిపొర్లింది.

ఉపశ్రుతి :

'మా అబ్బాయి క్లాస్ టెస్టులలో ఫస్టులో వస్తాడు. పరీక్షలంటే ఫస్టాయిస్తాడండీ?' అన్నాడు ఒక తండ్రి మరొక తండ్రితో. 'మన వాళ్లంతా అంతే. గేహేశూరులు. చూట్టంతే మన క్రికెట్ క్రీడా నిపుణులను. వాళ్ళ టెస్టుమాచీలలో లాస్టు మామూలు పోటీలలో ఫస్టు' అన్నారు రెండో ఆయన.

— తిరుమల రామచంద్ర



ఖరీదైన హోటల్ కళకళ లాడుతోంది.

కనీవినీ ఎరుగని జనసందోహం కదలిక లేకుండా కదిలితే తమ తమ స్థానాలు ఎక్కడ చెదురుతాయో నన్నంత భయంగా ఊపిరి బిగబట్టి చూస్తున్నారు.

మంచు కురుస్తున్నా చలిగాలి కదిలిస్తున్నా మనసులోవున్న అభిమానం మరింత పెరుగుతోంది. కాలం గడుస్తున్నా బరువైన నిట్టూర్పులే తప్ప విసుగు ఎవరి మొహంలోనూ మూద్దామన్నా కన్పించటంలేదు.

అన్ని తరగతులకూ చెందిన అభిమానులు అరమరిక లేకుండా తమ అభిమాన కథానాయకుడికోసం ఎదురుతెన్నులు చూస్తున్నారు.

ఆ రోజు.

ఎన్నో సంవత్సరాల తరువాత ఆంధ్రుల అభిమాన హీరో తన స్వస్థలానికి అవుట్‌డోర్ పనిమీద రావటం జరిగింది.

క్షణం కూడా తీరిక దొరకని అతనిని నివాసస్థలంలో కలిసే వీలు లేక, అవకాశం దొరకకా, ప్రవేశం అందకా—అవసరంరాకా తాహతు లేకా, అభిమానాన్ని గుప్తంగా గుండెల్లోనే దాచుకున్న అభిమాన ధనులు అభిమానాన్ని విడిచి అభిమానంతో పడిగాపులు పడుతున్నారు ఆరాటపడుతున్నారు.

అదే హోటల్లో—

ఫామిలీ రూములో ఒకమూలగా కూర్చుని వుంది రాధ.

నిరీక్షణలో కొన్ని గంటలు గడిచిపోతున్నాయి—

ఆరాటంలో క్షణాలు దొర్లిపోతున్నాయి—

ఐనా కాలం స్తంభించినట్టుంది. ఆశ ఆస్తంభనను ఆనందగా భరిస్తోంది.

ఊరికే కుర్చుంటే బావుండదు...—

అందుకే చిప్స్‌ముని పంటితో కొరుకుతూ గుమ్మం వంకే చూస్తోంది. అందరూ తమ అభిమాన హీరోకోసం కళ్ళల్లో వొత్తులు పెట్టుకుని చూస్తున్నారు—

అందరి కళ్ళల్లోనూ హీరో వర్షిప్ కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. అభిమాన సంఘాలు నిలువెత్తు పూలమాలలతో గుంపుగా గోలగా కేరింతలు కొడుతున్నారు—

'సార్ ... ఇంటిమేషనేదైనా వచ్చిందా? ప్రతాప్‌శంకర్ ఇవాళ ఇక్కడుంటం ఖాయమేనా?''

''ష్యూర్‌గా నైటుంటారా? ఐతే కొద్ది కాలం స్పెండ్ చెయ్యొచ్చు ...''

''కొంపదీసి అవుట్‌డోర్‌లోనే వుండి పోరు కదా?''

''అక్కడ వాళ్ళకేదైనా స్పెషల్‌గా ఎకామడేషన్ వుందాసార్,''

''.....పోనీ దగ్గర్లో ఫోనేదైనా వుంటే-''

రిసెప్షన్ అతను అన్నిటినీ మొహం చిట్లించి వింటూకూర్చున్నాడు— కొన్ని గంటలుగా ఈ ప్రశ్నలు చెవుల్లో హోరెత్తిస్తున్నాయి—వేడివేడి కాఫీ తెప్పించుకుని తలనెప్పి తగ్గించుకొటానికి వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాడు—

బుద్ధుడ్లా కూర్చున్న రిసెప్షనిస్ట్‌తో విసిగిపోయిన జనం స్వంత వ్యాఖ్యానాలు మొదలు పెట్టారు.

అందర్నీ తదేకంగా చూస్తున్న రాధకళ్ళలో ఆనాటి ప్రతాప్ శంకర్ లీలగా కదిలాడు.

రెండేళ్ళ పసిపాప రాధని భుజాన వేసుకుని మాస్టారింట్లో ఎక్కాలు వల్లెవేసే శంకర్ పదేళ్ళ పసివాడిగా రాధకసలు గుర్తు లేక పోయినా—

"నేను నిన్ను జోకొడుతుంటే నీ చిట్టి చేతులో నువ్వు నన్ను జోకొట్టే దానివి తెలుసా?-అప్పుడెంత ముద్దొచ్చేదానివో నీకేం తెల్సు?"

ఊహ తెల్సిన తనని ముద్దుగా వొళ్ళో కూర్చోపెట్టుకుని చెప్పే అందమైన శంకర్ వంక చక్రాల్లాంటి కళ్ళతో విచిత్రంగా చూసేది రాధ.

అర్ధరాత్రుళ్ళు శంకర్ పరీక్షలకని చదువుతుంటే—నిద్దరాని చిన్నిరాధ—శంకర్ వొళ్ళోనే ఆదమరచి నిద్రపోయేది.

"మాస్టారూ మీకింతమంది పిల్లలున్నారుగా— పోనీ రాధని మా కిచ్చెయ్యండి— ప్రాణంకన్నా ఎక్కువగా చూసుకుంటాము..." పెద్ద చదువులకెళ్ళినా

మమకారం తండ్రిమీద అభిమానం చంపుకో లేని శంకర్ విరిసీ విరియని మొగ్గలా ముడుచుకుపోయిన తనని అనురాగంతో చూసేవాడు.

"నీ అభిమానం నాకు తెలియనిదా నాయనా- రాధని మీకిచ్చెయ్యనంత మాత్రాన అది నీకేమీ కాకుండా పోతుందా? మీ ఇద్దరి గుండెల్లో ఆ దేముడే అనురాగబీజాలు వేశాడు. వాటిని మీరు పసితనంనుంచీ అభిమానంతో పెంచుకున్నారు...నువ్వెంత శ్రీమంతుడివైనా ముందు ముందెంత గొప్పవాడివైనా నీ మనసు గొప్పది బాబూ-అందులో ఈ బీద మాష్టారుకీ, మా రాధతల్లికీ – శాశ్వత స్థానం వుంటుంది..."

మాష్టారి కంటిపొరల్లో మెరిసే వాత్సల్యాన్ని తన్మయతలో చూసేవాడు శంకర్.

"మాష్టారూ- మేం మద్రాస్ వెళ్ళిపోతున్నాం. అక్షరాభ్యాసం చేయించి ఇంతవాణ్ణి చేశారు. నా ఆశయాలకు తగినట్టు...నేను ఎదగాలనీ, ఆత్మవిశ్వాసంతో ముందంజ వేయాలనీ నన్ను ఆశీర్వదించండి-"

వినయంగా వొదిగినిల్చున్న – శంకర్ని చూస్తుంటే మాష్టారికళ్ళు ముత్యాల్ని వర్షించాయి–

మూగగా దీవించాయి–

"మాష్టారూ ఒక్కమాట రాధతెలివైంది అందరి లాంటిది కాదు అందరిలా మీరు పెంచలేదు కూడా అందుకేఇక ముందుకూడా ఆ ప్రత్యేకతను ఏమాత్రం తగ్గించకండి. ... రాధ వ్యక్తిత్వాన్ని పెంచండి –

పాప్యులారిటీ ఈజేసీన్

–రాధా–"

వెళ్ళుబోతున్న శంకర్ని చూసి పసివాడిలా వెక్కివెక్కి పెట్టింది రాధ

"వస్తానమ్మా–"

వాత్సల్యంగా చూపిన ఆనాటి చూపే ఇప్పటికీ గుండెల్లో స్థిరంగా నిల్చిపోయింది–

రాధలో మిగిలిన అభిమానం మాయలేదు–

అంతరంగంలోవున్న ఆప్యాయం చెదరలేదు

కానీ కాలం మారింది. పరిస్థితులు మార్చాయి–

గంపెడు సంసారానికీ, పక్షవాతంతో తీసుకుంటున్న తండ్రికీ, విడరాని బంధాలకీ, విడదీయలేని బాధ్యతలకీ శంకర్ ఆనాడు ఇచ్చిన సలహా ఆధారమైంది.

తనకాళ్ళ మీద నిలబడి వ్యక్తిత్వం అందుకున్న రాధ ఈరోజు తనకుటుంబానికి అండగా నిలవగలిగింది.....

"అమ్మా....అవతల కస్టమర్స్ నిలబడి వున్నారు...."

ఉలిక్కిపడింది రాధ–

ఏమీ ఆర్డరివ్వకుండా ఉరికే కూర్చోటం జేరాలు పోగొట్టటం అపరాధమన్నట్టు చూస్తున్నాడు సర్వర్.

ఎదురుగా నలుగురైదుగురు తనవంక వెకిలిగా చూట్టం గమనించి. సిగ్గుతో తల వంచుకుంది.

"ఏమైనా ఆర్డరిస్తారా అమ్మా–"

సర్వర్ అడగటం పూర్తికాకుండానే కిసుక్కున నవ్వాడొకడు

"అర్థంలేనిమాట...కూర్చున్నదెందుకో.. ఎవరికోసమో అర్థం కావట్లా..హీరోగారి.!"

అంతలో బయట కలకలం రేగటం– పోలీసు విజిల్స్ హడావుడి చుట్టుముట్టడం– ప్రశాంత వాతావరణం అల్లకల్లోల మవటం గమనించిన సర్వర్తో సహా, ఆ నలుగురూ హడావుడిగా బైటికి వెడుతుంటే–

అదిరే గుండెలతో లేచి నిలబడింది రాధ–

"హీరో ప్రతాప్ వర్ధిల్లాలి. హీరో ప్రతాప్ వర్ధిల్లాలి. హీరో..." క్షణంలో అభిమానుల ఆనందం ఆవేశం అంతరిక్షానికి దూసుకు పోయాయి.

కదిలే సందులేక ఇంపాలా నిస్సహాయంగా ఆగిపోయింది. అలసిన మొహంలో అందం కొట్టొచ్చినట్టు కన్పిస్తూంటే- అన్నిరి కళ్ళల్లో చిలిపిదనం ఆప్యాయంగా పలకరిస్తుంటే మహా పండితుడి వేషంలో మేకప్పైనా చెదరకుండా హుందాగా కారో౦చి దిగుతున్న తమ అభిమాన హీరోమీద పూలదండల వర్షం పడింది. కెమేరాల మెరుపులు మెరిశాయి. అభిమానుల నీడలు మబ్బుల్లా కమ్ముకున్నాయి.

క్షణంలో అతన్ని బుజాని కెక్కించేసుకున్న ఆపలేని అభిమానం ఆనందంతో వెర్రి కేకలు పెట్టింది.

ఇటువంటి సన్నివేశాలు సర్వ సామాన్యమైనట్టు. తియ్యగా నవ్వుతూ ఆ ప్రవాహంలో తను నిలబడటానికి మాత్రం తగిన చోటుని సంపాదించుకో గలిగాడు. ఆంధ్రుల అభిమాన అందాల హీరో ప్రతాప్ శంకర్.

"కమాన్ మిస్ నీలా."

కోయ దుస్తుల్లో వున్న నటీమణి శంకర్ పిలుపందుకుంటూనే చిరు నవ్వుతో కారు దిగింది.

మరోసారి కెమేరాలు క్లిక్ మన్నాయి!


మరోసారి అలజడి ఉద్వేగంగా లేచి అణిగిపోయింది.

"మీ అభిమానానికి కృతజ్ఞతలు. పాపం ఇంత చలిలోనూ రాత్రివేళా... ఇలా నా కోసం...!"

ఆనందంతో మాటలు రానట్టు నిలబడి పోయాడు శంకర్.

"సార్. అలా చిక్కిపోయారేమిటి?"

"ఈ పిక్చర్ రిలీజెప్పుడూ?"



"నెక్స్ట్ పిక్చర్ ఏమిటి?"

"ఈ వూళ్లో రేపుంటారా?"

"ఇవాళ మీ అభిమాన సంఘాలం డిన్నర్ అరేంజ్ చే..." ఊపిరాడని అభిమానానికి—. సమాధానంగా ఒక్క నమస్కారం పెట్టాడు శంకర్.

"చిక్కిపోవటమేం..., మీ అభిమానం అలా అన్పిస్తోంది... వాతావరణం అనుకూలంగా వుంటే బహుశా వచ్చే నెల్లో రిలీజ్ కావచ్చు..., డిన్నరా...క్షమించాలి ఇవాళ జర్నలిస్టుల గోష్ఠి, ప్లస్ డిన్నరూ వుంది. ఈ తెల్లవారకట్ల వెళ్ళిపోతున్నాను...మరోసారి కలుస్తాను...

నమస్కారం"

"హీరో ప్రతాప్ వర్ధిల్లాలి ... హీరో ప్రతాప్...హీరో..." అభిమానుల ఆనందాన్ని అభిమానంతో అందుకుంటూ అలసటని కన్పించనియ్యకుండా చక చకా మెట్లెక్కి వెళ్ళిపోతున్న హీరోని వయ్యారంగా అనుసరించింది హీరోయిన్ నీల.

దిగాలుగా నిలడిపోయిన రాధ, చుట్టూ కమ్ముకున్న నిశ్శబ్దాన్ని నిరాశగా చూసింది.

తన పిచ్చితనానికి నవ్వుకుంది.

తను చూట్టానికివచ్చిన తన శంకర్ వేరు.

ఈనాటి ప్రముఖ హీరో ప్రతాప శంకర్ వేరు. ఆనాడు తనని భుజాన్న వేసుకు తిప్పిన చిన్నారి శంకర్ వేరు.

ఈనాడు హిమాలయంలా ఎదిగిపోయిన ఈ అత్యున్నత వ్యక్తిత్వం వేరు.

ఆనాడు వినయంగా తన తండ్రిదగ్గర చేతులు కట్టుకు నిలబడ్డ ఆనాటి శంకర్‌కి.

అతని చిరునవ్వుకోసం తలలు వంచి చేతులు కట్టుకుని నిలబడ్డ అశేష ప్రజావాహినిని చీల్చుకుని నడుస్తున్న ఈనాటి మేరువు లాంటి ప్రతాప్ శంకర్‌కీ పోలికా?

కనీసం తనని గుర్తుపట్టి పలకరిస్తాడనే ఆశ ఇంకా తనలో మిగిలివుందా?

నిస్సహాయంగా ముందుకు అడుగువేసిన రాధ ఏదో బలవత్తర బంధం ఆపినట్టు ఆగిపోయింది.

"పోనీ అతను గుర్తు పట్టలేకపోయినా పలకరించకపోయినా తనొక్కసారి చూడచ్చుగా...—!"

ఏదీనిర్ణయించుకోలేక తడబడుతూ... అందరితో లిఫ్ట్ వైపుకు నడిచింది రాధ.

ఎందరో అభిమానులు ... ఎన్నోరకాల వ్యక్తులు... ఎన్నెన్నో విధాలుగా అభిమానాన్ని వ్యక్తం చేసుకోటానికి థర్డ్‌ఫ్లోర్‌లో వి పి రూమ్ ముందు పడిగాపులు పడివున్నారు

ఆతృతతో వచ్చిన జనం చిరునవ్వుతో బైటకు వెడుతున్నారు తృప్తితీరని అభిమానులు హీరోతో మాట్లాడిన మాటలను ఎదుటివారితో నెమరువేస్తూ ఆనందపడిపోతున్నారు.

ఇంత కోలాహలంలో కూడా అక్కడివాళ్ళ దృష్టి అదేపనిగా రాధమీద పడకుండా పోవటం లేదు.

సిగ్గుతో తల వాల్చిన రాధ కూల్ డ్రింక్స్ తీసుకు వెడుతున్న సర్వీస్ బాయ్‌ని చిన్నగా పిల్చింది...

"...ఇదిగో. హీరోశంకర్... ఆదే పతాప్ శంకర్‌గారితో మాట్లాడాలి...!"

బ్రిటిష్ రాకుమారిపై అభియోగం

బ్రిటిష్ రాకుమారి ఆన్నే ఒక మార్గంలో మోటారుకారు నడుపుతూ, నిర్ణీత వేగాన్ని అధిగమించారన్న ఆరోపణపై జనవరి నెలలో ఆమెపై విచారణ జరగనున్నది.

ఎలిజెబెత్ రాణి కుమార్తె అయిన రాకుమారి ఆన్నే ఒక సభకు తన భర్త కెప్టెన్ ఫిలిప్స్‌తో కారులో వెడుతూండగా ఒక గస్తీ పోలీస్ ఆమెను ఆపాడు. గంటకు 140 కిలోమీటర్ల వేగంతో కారు నడుపుతున్నట్లు ఆమెపై అభియోగించబడింది.

అతను విచిత్రంగా రాధని చూశాడు.

అదంత తేలిక కాదన్నట్టు తలతిప్పుతు పోతున్న అతన్ని నిస్సహాయంగా చూసింది రాధ.

టైమ్ తొమ్మిది దాటు తోంది చాలా ఆలస్యం అయిపోతుంది.

శంకర్‌ని చూసొస్తానని, తమని మర్చిపోలేడనే నమ్మకం వుందికనుక వీలైతే తీసుకు వస్తానని తండ్రితో చెప్పి వచ్చింది

అక్కమీద నమ్మకంతో తమ అభిమాన హీరో కోసం ఇంటిల్లిపాదీ ఆతృతగా ఎదురు చూస్తూ వుంటారు...

అక్కడ వాతావరణం క్షణాలమీద మారుతున్నట్లన్పించింది...

అభిమానుల స్థానాన్ని పెద్ద మనుష్యులు భర్తీ చేస్తున్నారు—

ఖరీదైన అత్తరు వాసనలు గుప్పుమంటున్నాయి—

సెంటెడ్ సిగరెట్ల పొగ వలయాకారంలో తిరుగుతోంది—

కూల్‌డ్రింక్స్ బాటిల్స్ షేప్స్ మారుతున్నట్లన్పిస్తున్నాయి. ప్రక్క రూమ్స్‌లో బసచేసిన చిల్లర ఆర్టిస్ట్స్ తాపీగా బైటకు వచ్చి బాతాఖానీ మొదలు పెట్టారు.

హీరో ప్రతాప్‌గారికి జర్నలిస్ట్‌ల డిన్నరుంది. ఆc... ఓ పది నిముషాల్లో బయలుదేర బోతున్నారు. లోపలంతా ప్రొడ్యూసర్లు డిస్ట్రిబ్యూటర్స్. ఇక విజిటర్స్‌ని చూసే టైమ్ లేదు. ప్లీజ్ డోంట్ ఆలో ఎనీబడీ"

రిసెప్షనిస్టుతో మాట్లాడి హడావుడిగా వెళ్ళబోతున్న పి. ఎ. రాధని చూసి ఆగిపోయాడు.

ఆ నిరీక్షణలో అర్థంకాని కొత్తదనం అర్థం చేసుకోలేని నిర్మలత్వం కన్పించినట్టు అదోలా చూశాడు.

"ఏమ్మా చాలాసేపయినట్టుంది వచ్చి"

రాధ ధైర్యంతో గొంతు సవరించుకుంది.

హీరోగార్ని చూసి... ఒక్క మాట..."

"సారీ అమ్మా, డిన్నర్‌కి వెళ్ళబోతున్నారు ఎవర్నీ విజిటర్స్‌ని ఆలో చెయ్యద్దన్నారు. అందులో లోపల చాలా ఇంపార్టెంట్ విషయాలు మాట్లాడు తున్నారు."

"చూడండీ!..."

వెళ్ళబోతున్న వాడల్లా ఆగి చూశాడు.

"మా కు... అదే... మేము... ఒకేచోట వుండే వాళ్ళం... ఒక్కసారి..." ఏమనుకున్నాడో. పి. ఏ. చరచరా ప్రతాప్ రూమ్ దగ్గరకు వెళ్ళి క్షణం ఆగాడు.

"తెల్సాటున్నారు. ఒక్క నిముషం మాటాడండి పోనీ..."

"సారీసార్. ఎవరో అభిమాని. మీకు తెల్సుట..."

తలుపు పట్టుకుని నిలబడ్డ పి. ఏ. ని కృతజ్ఞతతో చూస్తూ—

మెల్లగా లోపల కడుగు పెట్టింది రాధ..


తడబడుతూ చూసిన కళ్ళు... శంకర్ కళ్ళతో పెనవేసుకుని నిశ్చలంగా ఆగిపోయాయి క్షణం...—

తనిన్నాళ్ళూ మేకప్‌లో చూసిన ఆంధ్రుల అందాల కథానాయకుడు కాడతను—

(36 వ పేజీ చూడండి)

జల్సోత్సవ సన్మానం

డి.వి.నరసరాజు



ఎవరో ప్రొద్దున్నే ఫోన్ చేశారు!– తమది హైదరాబాద్ అనీ, నాతోమాట్లాడాలనీ, యిప్పుడు వీలవుతుందనీ, 'యిప్పుడే వస్తే యింటి దగ్గర వుంటారా?' అనీ అడిగారు.

'వుంటా'నన్నాను. 'వెంటనే బయలుదేరి వస్తా'మన్నారు.

ఎవరో ప్రొడ్యూసర్లయి వుంటారని నిశ్చయించుకున్నాను! లోపలికి వెళ్ళి నలుగురికి కాఫీలు సిద్ధంచెయమన్నాను.

పావుగంటలో – యింటిముందు టాక్సీ ఆగింది. టాక్సీదిగి నలుగురు లోపలికి వచ్చారు. తమని తమేపరిచయంచేసుకున్నారు. ఒకరు శర్మ, రెండోవారు సాంబమూర్తి మూడు కృష్ణమూర్తి. నాలుగు రామన౹ార్తి!

'మాసమాజం పేరు వినేవుంటారు. 'శాశ్వత సన్మాన సమాజం' అన్నాడు శర్మ.

అయితే ప్రొడ్యూసర్లు కాదన్నమాట! నాముఖంలో కాంతి తగ్గింది. కొంపదీసి చందాకి వచ్చివుంటారు.

కేవలం సన్మానాలకోసమే పెట్టబడిన శాశ్వత సమాజమట వారిది.

రాజకీయ, సాంస్కృతిక కళారంగాలలో అమూల్యమైన సేవ చేసిన వారికి సన్మానాలు చేయడమే వారి సకాజం ప్రధానోద్దేశమట! ఆ సమాజానికి వీరు అధ్యక్ష, కార్యదర్శులట!

వారి లెటర్‌హెడ్ చేతికిచ్చి చూడమన్నారు. పాతిక ముప్పయి పేర్లున్నయ్! గౌరవాధ్యక్షులు, అధ్యక్షులు, సలహాదార్లు, అధ్యక్షులు, కార్యదర్శులు కోశాధికారి. కమిటీ సభ్యులు వగైరా!

అందరూ ప్రముఖులే! మంత్రులూ, జడ్జీలు, ఫిలిం ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లు, రచయితలు, రచయిత్రులు వగైరా–

వారి సమాజం యిదివరలో చేసిన సన్మానాల తాలుకు ఫోటోల 'ఆల్బం' చేతికిచ్చారు.

తీసి చూశాను!

అబ్బో! చాల పెద్ద పెద్ద వారికే సన్మానాలు చేశారు. ప్రతి స న్మా న ం లో నూ మంత్రులూ, జడ్జీలు– పుర ప్రముఖులు పాల్గొన్నారు!

ఆ ఫోటోలు చూస్తున్నంత సేపూ చందా ఎంత యివ్వవలసి వుంటుందా అని లోలోపల పీకుతూనే వుంది.

'ఇంతకూ యిప్పుడు ఎవరికి చేయబోతున్నారు సన్మానం?' అని అడిగేశాను!

'మీకే' అన్నారు శర్మ!

ముందు గుండె గతుక్కుమంది! వెంటనే ఒళ్ళు పులకరించింది. వాళ్ళ ముఖాలలోకి చూశాను! కళాభిమానం, కళాసేవ వాళ్ళ ముఖంలో కొట్టవచ్చినట్టు కనబడింది!

పొంగుతున్న సంతోషాన్ని పొంగనివ్వకుండా ఆపి, 'నా కెందుకండీ సన్మానం? నే వేం చేశాను గనక' అన్నాను. అప్పుడు నా ముఖంలో ఎక్స్‌ప్రెషన్ ఎలా వుందో!

'అదేమన్నమాట! మీరు సినీ రంగానికి ఎంత సేవ చేశారు? మాకు తెలియదా? మిమ్మల్ని సన్మానించేది మీకోసం గాదు, మా కోసం! తెలుగు ప్రజల కోసం! తెలుగు కళ కోసం' అన్నారు శర్మ!

'వుండండి, ఒక్క నిముషం' అని లోనికి వెళ్లాను. 'ఒట్టి కాఫీ కాదు. నాలుగు పెస

రట్ను గూడ వెయ్యమని' అర్థరిచ్చి వచ్చాను.

'మీరు సినీ రంగంలో ప్రవేశించి ఈ సెప్టెంబర్ 16 కు సరిగ్గా పాతికేళ్ళు! కదండీ?' అన్నారు శర్మ!

ఆశ్చర్యంతో 'అవునండీ' అన్నాను!

'అందుకే, మీ సినీ జీవిత రజితోత్సవం సందర్భంగా మిమ్మల్ని సన్మానించ దలిచాం' అన్నాడు సాంబమూర్తి.

వెంటనే కృష్ణమూర్తి అందుకున్నాడు.

"మీరు 1951 లో వాహినీ సంస్థలో ప్రవేశించారు మీ మొదటి చిత్రం 'పెద్ద మనుషులు!' దానికి ఆ ఏడు ఉత్తమ చిత్రంగా రజత పతకం కేంద్ర ప్రభుత్వం బహూకరించింది.

మీ రెండో చిత్రం 'దొంగరాముడు' అది అన్నపూర్ణావారి మొదటి చిత్రం.

యిప్పటికి మీరు దాదాపు 60 చిత్రాలకు రచన చేశారు.

నేను నిర్ఘాంతపోయి, నిశ్చేష్టుడనైనాను.

'నా సంగతి నా కంటె మీకే ఎక్కువ తెలునండీ' అన్నాను - ఆయన విజ్ఞానాన్ని మెచ్చుకుంటూ!

"మీ సంగతే కాదండి! కళారంగంలో ప్రముఖులను గురించి - రెసెర్చిచేసి రికార్డులు తయారుచేస్తాం!' అన్నాడు గర్వంగా శర్మ!

వాళ్ల కళాభిరుచికి, కార్యదక్షతకు ముగ్ధుడనైనాను.

ఈసారి రామమూర్తి అందుకొన్నాడు.

"మీరు సినిమాలకి రాకముందు నాటకాలు వ్రాసేవారు. మీ నాటకాలకు నాటక కళా పరిషత్తు పోటీలలో బహుమతులు వచ్చాయి. మీకు బి. ఎ. లో తెలుగులో ఫస్ట్ క్లాసు వచ్చింది! - మద్రాసు యూనివర్శిటీవారి బంగారుపతకం బహూకరించ బడింది."

అబ్బ! ఎంత పరిశోధన చేశారు వీళ్లు! అసలు వీళ్లకి సన్మానం చేయాలి!—

"అంతర్జాతీయ కథల పోటీలో మీ కథకి రెండో బహుమతి వచ్చింది! కదూ!" అన్నాడు సాంబమూర్తి!

యిబ్బందిలో పడ్డాను!

"అది నాకు కాదండి! పాలగుమ్మి పద్మ రాజుగారికి" అన్నాను.

'ఓహో' అని కాస్త సర్దుకున్నాడు సాంబమూర్తి!

"మీరు కొన్నాళ్లు అడ్వకేట్ జనరల్‌గా పని చేశారు గదూ?" అన్నాడు రామమూర్తి!

"లేదండి! ఆయన దువ్వూరి నరసరాజు గారు? ఆయన యిప్పుడు లేరు." అన్నాను

"మరి మీరు?"

"నేను వున్నాను"—

"అదిగాదు - మీయింటిపేరు..."

"దువ్వూరి గాదు! దాట్ల!"—

అందరం కాస్త యిబ్బందిలో పడ్డాం! బండి పట్టాలు తప్పుతోంది.

"మీరింతవరకూ ఎన్నసినిమాలు తీశారు?' అని అడిగాడు శర్మ!

"నేను తీయలేదండి"

"మరి డి. వి. యస్. ప్రొడక్షన్స్ మీదిగదూ?"

'కాదండి ఆయన డి.వి.యస్. రాజుగారు,'

"ఓహో! డి. వి. యస్. అంటే డి. వి. యస్. అనుకున్నాం!"

"యిందులో - నేను ఎవరను కొని వీళ్లు వచ్చారో! యింత రిసెర్చి చేసిన వాళ్లు పొరబడతారా? నాకోసమే వచ్చి వుంటారు?' అని సమాధాన పరచుకొన్నాను.'

"ఎందుకయినా మంచిది మీజీవిత విశేషాలన్నీ వివరంగా మీరే వ్రాసి యివ్వండి మీకలర్ ఫోటోతో సహా - ఒక చిన్న పుస్తకంగా ప్రచురిస్తా"

'ఎందుకండీ! నాకసలు సన్మానాలంటేనే..' నీళ్లు నమిలాను.

'మీకు యిలాంటివి యిష్టం లేదనికూడ మాకు తెలుసు! అందుకే స్వయంగా వచ్చాం మట్లాడడానికి! సన్మానాలు మీరు చేయమంటేచేస్తామా? అది మా విధ్యుక్త ధర్మం' మిమ్మల్ని సన్మానిస్తే - మమ్మల్ని మేమే సన్మానించు కున్నట్లు! మీరు కాదన్నా—మేము సన్మానం చేసి తీరుతాం" అన్నారు శర్మ.

అతని మొహంలోనూ, మాటల్లోనూ, ఎంతో సిన్సియారిటీ కనిపించింది! నా మాటలకు కొంత బాధ గూడా పడ్డట్టున్నారు పాపం! కళాభిమానుల మనసులు అంత సున్నితం కాబోలు అనుకున్నాను

"సన్మానసభకి ముందు వూరేగింపు వుంటుంది" అన్నాడు సాంబమూర్తి సీరియస్‌గా!

"ఎందుకండీ..." అనబోయాను.

సాంబమూర్తి కోపంగా "మీ యిష్టా యిష్టాలతో మాకు పనిలేదు! మా ఆచారం ప్రకారం జరగవలసిందే' అని గద్దించారు.

ఆ గద్దింపులో ఎంతో ఆప్యాయత వుంది!

"వూరేగింపుకి కారు ఏర్పాటు చేయమంటారా?"

"కారా?..." సందేహంగా!...

"ఏదైనా కొత్తరకం! నావెల్టీగా వుంటే మంచిది!"

"గుర్రం అయితే?" రామమూర్తి సూచన!

శర్మ మొహం వికసించింది— "కాదు! - బ్రహ్మాండమైన నావల్టీ! హైదరాబాద్‌లో ప్రస్తుతం ఒక సర్కస్ కంపెనీ ఉంది! వాళ్ళతో మాట్లాడి— ఒంటెని ఏర్పాటు చేద్దాం!" అన్నాడు.

అవును నావల్టీగా ఉంటుందని నాకూ అనిపించింది "మీ యిష్టం" అన్నాను.

చటుక్కున కృష్ణమూర్తి ప్రశ్న!

"రాజుగారూ! తెలుగు నటీమణుల్లో మీకు అభిమాన పాత్రులైన వాళ్లు ఎవరు?

క్షణం ఆలోచించి "చాల మంది వున్నారు వాణిశ్రీ, సావిత్రి, జమున, అంజలీదేవి, భానుమతి, కన్నాంబ, కాంచనమాల..." అన్నాను.

"వీరిలో మీకు అత్యంత అభిమాన పాత్రురాలు ఎవరు?"

"చెప్పడం కష్టం!"

"అయితే ఒక పని చేద్దాం" వాళ్లందరి పేర్లు వేరు వేరు చీటీల మీద వ్రాసి - లాటరీ వేద్దాం! ఒకచీటీ తీద్దాం! ఆ చీటీ మీద ఎవరిపేరు వస్తే ఆమె చేత మీకు సన్మానం చేయిస్తాం."

వెంటనే నేను "అయితే నేను చెప్పిన లిస్టులో కన్నాంబగారి పేరు తీసెయ్యండి" అన్నాను.

"ఏం?" అన్నాడు సాంబమూర్తి!

"ఎందుకు పాపం ఆమెను శ్రమ పెట్టటం?"

"అవును" అని ఒప్పుకున్నాడు ఆయన!

"సరే! సన్మాన సభకి అధ్యక్షత వహించడానికి కేంద్ర, రాష్ట్ర మంత్రులలో ఎవరిని పిలవమంటారు?"

"వాళ్లలో నాకు విరోధులు ఎవరూ లేరు! ఎవరిని పిలిచినా నాకు యిష్టమే" అన్నాను— అజాత శత్రువులాగ.

"సర్! ఆ విషయాలు మాకు వదిలేయండి. కనీసం ముగ్గురు మంత్రులు — యిద్దరు జడ్జీలు సభలో పాల్గొనే ఏర్పాటు చేస్తాం! యింకా ఏమిటి మాట్లాడాలనుకున్నాం..." అని దీర్ఘంగా ఆలోచించి

"ఆ! అసలు ముఖ్యవిషయం — మీకు బిరుదు!"

"అవును మీకు బిరుదు యివ్వాలని నిర్ణయించాము. మీకు ఏం బిరుదు కావాలి" ని అడిగాడు చిరునవ్వుతో సాంబమూర్తి.

"మీ యిష్టం" అన్నాను ఎంతో వినయంగానూ కించిత్ సిగ్గుతోనూ!

"నాదొక సూచన!" అన్నాడు కృష్ణమూర్తి!

"మీ రచనలు ప్రధానంగా హాస్యప్రదమైనవి గనక మీకు 'హాస్యప్రద బ్రహ్మ' అని బిరుదు...

"వద్దండి! అది వద్దండి" అని ఆదుర్దాగా ఆవేశాను– కాస్త బతిమాలుతున్న ధ్వనితో!

"పోనీ "హాస్యప్రద చక్రవర్తి?"

"అదీ వద్దండీ! బిరుదు ఏదిచ్చినా కాస్త పెద్ద వాళ్లను పండితులను సంప్రదించి నిర్ణయించండి" అన్నాను ప్రాధేయపూర్వకంగా!

'సరే'నని వాళ్ళు నలుగురు ఏకగ్రీవంగా ఒప్పుకున్నారు.

నా పరిస్థితి ఏమీ బాగులేదు! ఈ సన్మానం ఎలా జరుగుతుందో. రసాభాస అవుతుందో అని భయంలో పడ్డాను!

పోనీ వద్దని ఖచ్చితంగా చెప్పడానికి మనసు ఒప్పుకోవడంలేదు!

యింటికి వచ్చి 'సన్మానం చేస్తా'మని ఎవరు అంటారు? ఎంతో కళాభిమానం గల వాళ్లు కాకపోతే.

కాస్త ధైర్యం పుంజుకుని అన్నాను!

"అయ్యా! మీ కళాభిమానానికి, కళా సేవకి తెలుగు దేశం ఎంతో ఋణపడి వుంటుంది యిక నా సంగతి చెప్పనే అక్కర్లేదు! ఈ జన్మలో మీ ఋణం తీర్చుకోలేను!

కాని నేను మనవి చేయవలసినవి రెండు మూడు విషయాలున్నవి!

సన్మానసభలో నన్ను గురించి మాట్లాడే వక్తలు నన్ను గురించిగాని, సినిమాలను గురించిగాని కాస్తో కూస్తో తెలిసినవాళ్లుగా చూడండి!

నన్నూ పద్మరాజుగారిని, పాపం దువ్వూరి నరసరాజుగారినీ, డి. వి. ఎస్. రాజుగారిని కలిపి కొడితే నేను కాస్త యిబ్బంది పడవలసి వస్తుంది" అన్నాను గాద్గదంతో!

"ఆజ్ఞాగ్రత్తలు తీసుకుంటాం లెండి! మీ జీవిత సంగ్రహం ముద్రించి వాళ్లకి యిస్తాం ముందుగానే!"

రజతోత్సవ సన్మానం

"వాళ్ల కిలాంటివి అలవాటే లెండి" అని నన్ను సముదాయించాడు శర్మ:

సాంబమూర్తి అదోలాగ నవ్వి అన్నాడు–

"మీకు యిని అలవాటు లేక ఏవో భయాలు, సందేహాలు పెట్టుకుంటున్నారు! మా సంగతి మీకు తెలీదు! యిటువంటివని నెలకు నాలుగు సన్మానాలు చేస్తుంటాం."–

నిజమేననిపించింది! వాళ్ళు అనుభవజ్ఞులు:

ఎంతో వినయంగా అన్నాను– "మీరు నాపట్ల చూపుతున్న ఆదరాభిమానాలకు, ఎలా కృతజ్ఞత చెప్పాలో తెలియటంలేదు–" కళ్లలో నిజంగా నీళ్లు తిరిగాయి

మొలకలెత్తిన 2 వేల ఏళ్ళ నాటి విత్తనాలు

అర్జెంటైనాలో రెండువేల ఏళ్ల క్రితం నాటి మూడు విత్తనాలను ఇక్కడి చారిత్రక మ్యూజియంలోని శాస్త్రజ్ఞులు విత్తి మొలకెత్తించినట్లు తెలుస్తున్నది.

ఈ విత్తనాలు ఎనిమిదేళ్ల క్రితం ఒక గుహలో లభించాయి. సీలు వేసిన ఒక డబ్బాలో ఇవి భద్రపరచబడి వున్నాయి. వాటిలో మూడింటిని జాగత్తగా నిరి భూమిలో పాతి పెట్టారు. అవి తొమ్మిది రోజుల తర్వాత 18 మి. మి మొలకలెత్తాయి

"ఒక్క రెండువేల రూపాయలివ్వండి" అన్నాడు శర్మ! తకీమని!–

పిడుగు పడ్డట్టయింది!

అప్రయత్నంగా– 'రెండువేలా?' అనేశాను పొరబోయి – దగ్గు వచ్చింది!

'ముందు ఏవో చిల్లర కర్చులుంటయ్ గదండీ మళ్ళీ మీ డబ్బు మీకు వచ్చేస్తుంది! సావనీర్ ప్రింటుచేసి డబ్బు వసూలుచేస్తాంగా అందులోంచి తీసి యిచ్చేస్తాం!" అన్నాడు సాంబమూర్తి బుజ్జగిస్తూ!

నాకు దగ్గు తగ్గలేదు!

"వుండండి! మంచినీళ్లు తాగివస్తా" అని దగ్గుతూ లోనికి వెళ్ళాను.

"పెసరట్లు పంపమంటారా?" అని అడిగింది మా ఆవిడ!

"అక్కర్లేదు! మంచినీళ్లివ్వమని" మంచి నీళ్లు తాగి–తమాయించుకుని –

"చెక్కుబుక్కు ఎక్కడుంది?" అని అడిగాను!

"మీ టేబిల్ డ్రాయరులో వుంది. ఎందుకు?"

"వాళ్లకి చెక్కు వ్రాసియివ్వాలి" అని మళ్ళీ వాళ్ల దగ్గరికి వెళ్ళాను దగ్గు ఎలాగో దిగమింగు కున్నాను కాని బుర్ర ఏమీ పని చేయడంలేదు

డ్రాయరులోంచి చెక్కు బుక్కు తీసి రెండువేల రూపాయలకి చెక్కు వ్రాశాను – వణుకుతున్న చేతులతో శర్మకి యిచ్చాను.

శర్మ చాల సిన్సియర్‌గా 'థాంక్స్' చెప్పాడు

"సెప్టెంబర్ 16 సన్మానం! వ్యవధి లేదు! చక చక ఏర్పాట్లు చేయాలి! యివాళే వెళ్లిపోతాం!" అన్నాడు సాంబమూర్తి!

నలుగురూ ఏకకంఠంగా–

"సెలవు" అని విడి విడిగా నమస్కరించి వెళ్ళిపోయారు!

నేను అలాగే నిలబడిపోయాను.

మా ఆవిడ వచ్చింది.

"ఎంత కిచ్చారు చెక్కు?"

"రెండువేలు"

"రెండువేలా? డబ్బిచ్చి సన్మానం చేయించుకుంటారా? యింతకంటె సిగ్గుచేటు వుందా?"

"ఏం చెయ్యమంటావు! డబ్బు సంగతి వాళ్ళు ముందు చెప్పలేదు, సన్మానానికి అంగీకరించి తీరా డబ్బు అడిగిన తరువాత 'వద్దంటే' ఏమనుకుంటారు?"

"అందుకని డబ్బు ఎదురిచ్చి సన్మానం జేయించుకుంటారా? అటువంటి సన్మానాలు లేకపోతే ఎవడేడిశాడు?"

నా మొఖంలోకి కాస్త చిరునవ్వు తొంగి చూచింది!

"పాతికేళ్ళనుంచి సినిమాలలో పనిచేస్తున్నాను. మరీ అంత తెలివి తక్కువ దద్దమ్మ ననుకోకు మరి!"

"అంటే?..."...

"నా బ్యాంక్ అక్కవుంటులో డబ్బులేదు"


అందువల్ల–

ఆ చెక్కు చెల్లదు!

ఈ సన్మానం జరగదు!!"

స్టేన్స్‌టైర్

సమస్యలను పరిష్కరిస్తుంది



స్టేన్స్ టైర్ రీట్రెడ్‌లు సురక్షితమైనవి. ప్రఖ్యాతి గాంచిన టైర్‌సోల్స్ సాంకేతిక పరిజ్ఞానాన్ని స్టేన్స్‌టైర్ వినియోగించు కుంటుంది. మీటైరు ఎక్కువకాలం పనిచేసేటట్టు గ్యారంటీ ఇస్తుంది.

స్టేన్స్ టైర్ ఎక్కువ ఆదాచేస్తుంది. ప్రతి కేసింగ్‌కు ఎక్కువ రీట్రెడ్‌లు చేయవచ్చు— కాగా లాభకరమైన అంశం. ప్రతి కిలో మీటరును లెక్కకడితే ఖర్చు అతితక్కువ కాగలదు. ముఖ్యమైన కేంద్రాలలో వున్న స్టేన్స్ టైర్ ఫ్యాక్టరీలు వెంటనే సేవచేయడంలో గణితి కెక్కినవి.

STANES TYRE

స్టేన్స్‌టైర్

అండ్ రబ్బర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్

తిరుచి రోడ్, కోయంబత్తూరు

ఫ్యాక్టరీలుగల ఇతర కేంద్రాలు: మద్రాసు. వెల్లూరు. తిరుచి. సేలం. మధురై. ట్యుటికోరన్. బెంగుళూరు. మెంగుళూరు. విజయవాడ. సికింద్రాబాద్. ఎర్నాకుళం. కొట్టాయం. కాలికట్. తిరుచూరు.

మగదికథ

పైడిపాటి సుబ్బరామశాస్త్రి

రాజయ్యకు అంత కోపం రావడం, తాను కాపురానికి వచ్చిన తర్వాత గంగమ్మ ఎప్పుడూ చూడలేదు. తాను చెప్పినట్లే ఎప్పుడూ వినే మనిషికి, ఇవాళ యీ అకాల తాండవం తీరు ఆశ్చర్యం కలిగించింది. అందుచేతనే అతనికి పిచ్చి ఎక్కిందేమో అనుకుంది.

"వెధవ డబ్బుకోసం, నీవు చెప్పినట్లు విని లేదని, నా చెల్లెలిని నానా దుర్భాషలాడుతావుటే, భడవా! ఇకముందు, నా యెదుట, నా చెల్లెలిని, ఏమయినా అంటే, నీ మూతిమీద వాతలు పెడతా!"

గంగమ్మ వణకిపోయింది

"అసలు నేను దద్దమ్మను కాదే గంగీ! నువ్వే వాని డబ్బుకోసం ఆశపడి, నాకుకూడా ఆశను కల్పించి, దద్దమ్మను చేశావు. వస్తువు పోయిన తర్వాత విలువ తెలిసింది. ఇప్పుడేడ్చి ఏమి లాభం ?" అన్నాడు తిరిగి.

"అన్నం వండాను. పెట్టుకు తినండి, నాకు పెట్టే ఓపిక లేదు" అంది గంగమ్మ.

"నేను నా చెల్లెలు ఇంట్లో తిని వచ్చాను." అన్నాడు రాజయ్య ధీమాగా.

గంగమ్మ నెమ్మదిగా నెత్తి బాదుకుంది.

"లేచి, పిల్లలకు అన్నాలు పెడతావా ? లేకపోతే నీవు తాషామరబా మోగించమన్నావా ?" అన్నాడు రాజయ్య.

లేచి పిల్లలకు అన్నాలు పెట్టింది. కాని తాను ఆ రాత్రి తినలేదు. దెబ్బలకు సున్నమూ బెల్లమూ నూరుకుని పట్టు వేసుకుని ఒరిగి పడుకుంది గంగమ్మ.

17

"ఎప్పుడూ నువ్వు అదోలాఉంటే, నాకు బాధగా ఉంటుంది అక్కా !" అన్నది సరోజిని, సురేఖతో. సురేఖ విరక్తిగా నవ్వింది.

"ఒక్కొక్కళ్ల జీవితాలొక్కొకవిధంగా నడుస్తాయ్ సరోజినీ ! మా అప్పచెల్లెళ్ల జీవితాల్లోనే నాది కేటాయింపు. నేను అన్నయ్యకుకూడా దూరం కావలసివచ్చింది."

"అక్కా ! నువ్వు అనాలోచితంగా ఏమీ చేయలేదు. ఇంటిలోనుండి గెంటించుకోనక్కఱలేకుండా మర్యాదగా బయటపడ్డావు. భాగ్యం అక్కకోరుకున్నదీ అదే ! వాళ్లకు నీకొఱకు లేనిబాధ, నీకు వాళ్లకోసం ఎందుకు?"

"పిల్లలమీద నాకు బెంగ ఎక్కువగాఉంది సరోజినీ ! వాళ్లలో వాళ్లువంతులుబడి నేను అత్తయ్య దగ్గఱపడుకుంటానంటే నేను పడుకుంటానని వచ్చేవారు."

(గత సంచిక తరువాయి)

"వాళ్లబదులు నేను నీదగ్గఱ పడుకుంటా నులే !"

"పడుకో ! నువ్వూ పాపాయివేగా ! పిల్లలు నాతో కబుర్లు చెబుతూఉంటే మా గంగమ్మతల్లి సహించలేక, వంటింట్లోనుండి వాళ్లను రమ్మని ఏదో పనిఉన్నట్లు కేకపెట్టేది. నన్నువదలివెళ్లడం ఇష్టంలేకపోయినా, వాళ్లు భయపడి. వెళ్ళిపోయేవారు. వాళ్లవంక గ్రుడ్లుతిమిచూచేది. వంటింట్లోనే వాళ్లను కదలకుండా చేతులుకట్టుకు కూర్చో మనేది, ఒకప్పుడు వాళ్ళు నిరాకరిస్తే, వాళ్లవీపు విమానంమ్రోత మ్రోగేది. వాళ్ళు కుయ్యో, మొఱ్ఱో, అని ఏడ్చేవాళ్ళు. నాకేడుపు వచ్చి 'ఇదేమిటె వదినే' అనిఅంటే, "నీకు తెలియదులే ! నీవు శ్రమబడి స్కూలునుండివస్తే, నిన్ను విశ్రాంతి తీసుకోనీయకుండా, నిన్ను వాళ్లు బాధించడం నాకిష్టం లేదు" అనేది.

"రాక్షసకృత్యం"

"సరోజినీ ! ఎవరిపిల్లలు వారికి కావాలి కాని, ఎంత ఆపేక్ష పెట్టుకున్నా ఒకర్లపిల్లలు మనకవుతారా ? నువ్వుచెప్పు :" అన్నది సురేఖ నిట్టూరుస్తూ. ఇంతలో సురేఖ మేనల్లుడొకడు'అత్తయ్యా!' అని ప్రవేశించాడు.

"ఎల్లా వచ్చావురా, కిష్టప్పా!" అన్నది సురేఖ.

వాడు మాట్లాడలేదు.

"మీ నాన్న ఏమయినా ఈ యింటి గుర్తు చెప్పాడా?"

> ***జరిగిన కథ-6:*** కొడుకు సూర్యానికి సరోజినిని యిచ్చి పెళ్లి చేయుమని అన్న శేషయ్యని అడుగుతుంది చింపమ్మ. ఆస్తి, చదువు లేని సూర్యానికి సరోజినిని యివ్వటానికి ఒప్పుకోడు శేషయ్య. ఉన్న ఆస్తి సరోజిని చదువుకి కరిగిపోగా గత్యంతరం లేక హైస్కూల్లో టీచరుగా చేర్పిస్తాడు శేషయ్య. సూర్యం మంచి పురోహితుడుగా పేరు సంపాదించుకుంటాడు. ప్రయివేటుగా ఎం. ఎ. పూర్తి చేస్తుంది సరోజిని. తను తన భర్తకు ఎలా దూరమయ్యిందీ సరోజినికి చెప్తుంది తోటి టీచరు సురేఖ. తను తన సంపాదన దాచుకోవడం అన్నకి కంటగింపుగా వుందని అతని మాటలవల్ల గ్రహిస్తుంది సురేఖ. సురేఖ తండ్రి మరణిస్తాడు. సురేఖపట్ల పెడసరంగా వుంటుంది వదిన గంగమ్మ. అన్న ఇంటినుండి వెళ్లిపోయి వేరే వుంటుంది సురేఖ.

లేదనట్లుగా, వాడు తల అడ్డంగా త్రిప్పాడు

"మరి, ఈ యిల్లు ఎల్లా గుర్తుపట్టగలిగావ్?"

సరోజిని వాడివంక ఆశ్చర్యంగా చూస్తోంది.

"భయంలేదు, చెప్పు!" అని సురేఖ వాడిని దగ్గరగా తీసుకొని బుజ్జగించింది.

"మరేమోనే, నువ్వు స్కూలు నుంచి వస్తూ ఉంటే, స్కూలుగేటుకు దూరంగా నిలబడి నువ్వు బయటకు వస్తూఉంటే చూశాను. నెమ్మదిగా, వెనకాలే, ఎడంఎడంగా నడుస్తూ వచ్చాను. నువ్వు వెనక్కు చూడలా! చూస్తే నేను నీకు కనబడే వాడినే! నువ్వేమో ఈ యింట్లోకి వచ్చావు. నేను చాలాసేపు వాకిట్లో నిలబడ్డాను. లోపలికి వద్దామా, వెళ్లిపోదామా, అని ఆలోచించాను. చివరకు ఎల్లాగూ ఇంతదూరం వచ్చాకదా, అని, లోపలకు వచ్చేశాను"

సురేఖ కిష్టప్పను ముద్దుపెట్టుకుంది."నన్ను చూడడానికి అంత దూరాన్నుంచి వచ్చి, ఇంత కష్టపడ్డావా, నాయనా! నేను చచ్చిపోయానే !" అని రెండు బిస్కట్లిచ్చి మంచినీళ్లిచ్చింది. వాడు తింటూ ఉండగా, 'స్టౌ' వెలిగించి గబగబా ఉప్మా చేసి వాడికి పెట్టింది. వాడు తింటున్నాడు. "నేను వచ్చేసిన రోజున నాన్న అమ్మతో ఏమయినా అన్నాడటరా!" అని అడిగింది సురేఖ.

"అమ్మ ఏదో చాలాసేపు నిన్నుగురించే గట్టిగా అంది. చెప్పనిచ్చి చెప్పనిచ్చి, నీ మూలంగా వచ్చింది యిదంతా అని చెంపలు వాయగొట్టాడు. ఆ రాత్రి అమ్మ అన్నం తినలేదు. మాకు పెట్టింది. సున్నం బెల్లం పట్టువేసుకుని పడుకుంది"

"అయ్యో ! పాపం వదినెను కొట్టాడా, అన్నయ్య!" అని నిట్టూర్చింది సురేఖ.

"ఓ జాలి మనసుదానా! గంగమ్మగారిని నిన్ను గురించి చాలాసేపు చెప్పనిచ్చి చెప్పనిచ్చి, విని విని, నీ మూలంగా వచ్చిందిదంతా అని, అని అని, దవడ శుద్ధిచేశాడు. అంతేనా కిష్టప్పా" అన్నది సరోజిని.

"అంతే!" అన్నాడు కిష్టప్ప. సురేఖ నవ్వింది.

"నువ్వు మా యింటిలోనుండి వెళ్లిపోతే,మాకు నెలకు వంద రూపాయలు పోతాయిటగా! ఆ మాట అంది అమ్మ నాన్నతో!" అని తనకు జ్ఞాపకం వచ్చిందేదో చెప్పాడు, కిష్టప్ప.

సురేఖకు ఆ విచారంలోనే మళ్లీ నవ్వువచ్చింది.

"ఎల్లా పోతాయిరా?"

"ఏమో! మా అమ్మనే అడుగు!"

"నేను అనలేదంటే?"

"ఎల్లా అంటుంది? అన్నదిగా"

"నీకెల్లా తెలిసిందని, నన్నడిగితే?"

"కిష్టప్ప చెప్పాడని చెప్పు" అని వెంటనే త్రిప్పుకొని "అమ్మో! చెప్పవద్దు. నేనిక్కడకు వచ్చినట్లు తెలుస్తుంది. "ఓరి వెధవ కిష్టప్పా! ఇక్కడి మాటలు అక్కడికి మోస్తున్నావా?" అంటుంది.

"సరే, పోనీలే, అడగనులే, కాని అన్నమాట నిజమేగా?"

"సత్యప్రమాణంగా!"

చిన్నపిల్లలు వాళ్లలో వాళ్లు గట్టిగా నిజమని చెప్పడానికి చేసే ప్రమాణం తన దగ్గర కూడా కృష్ణప్ప చేస్తే సురేఖకు నవ్వువచ్చింది.

"అబ్బీ! ఇంటికి ఆలస్యంగా వెడితే, నువ్వు

రాలేదని వాళ్ళు వెతుక్కుంటారేమో!'' అన్నది.

కృష్ణప్ప తెల్లబోయాడు.

''నిజమే. నేనిప్పుడే వెళ్ళిపోతాను, అత్తా!''

''అంత దూరం, నువ్వు అంత త్వరగా పోగలవా? బాగా ప్రొద్దుగుంకినట్లుంది. వచ్చినవాడవు స్కూలు గేటు దగ్గరే నన్ను పిలవకపోయావా, నాయనా?''

''నువ్వు కోప్పడుతావని పిలవలేదు''

''ఇప్పుడుమాత్రం కోపపడనా?''

''పడవు. ఉప్మా పెట్టావుగా! నీకు కోపం లేదు''

''నువ్వు నడవలేవు కాని, రిక్షామీద వెళ్ళు'' అని అర్ధరూపాయి యిచ్చింది కృష్ణప్పకు. వాడు పందే హిస్తూ తీసుకొని తూనీగల్లె దూసుకుపోయాడు వీధిలోకి.

''అన్నయ్య నా మూలకంగా వదినెనుకొట్టాడు చూశావా, సరోజినీ!''

''ఆదేవని కొద్దిరోజులు అక్కడఉంటేగంగమ్మ తల్లి చేసిఉండేది నిన్ను, నువ్వేమో జాలిపడు తున్నావు!''

''భార్యకు సమ్మతంగా చెప్పకోవాలి కాని, మగ వాడనుకదా అని అహంకరించి చేయి చేసుకుంటే వదినె ఆగగలదా?''

''మీ అన్నయ్య ఊరికే ఏమీ కొట్టలేదు. పురుషులు స్త్రీలను సమ్మతంగా చెప్పకుంటే వింటారని నమ్మకంఉంటే అల్లాగే చెప్పకుంటారు. వైద్యాలలో మనిషితత్వాన్నిబట్టి వైద్యం ఉంటుంది. అందరికీ ఒకేమందు పనిచేయదు. అల్లాగే మీవదినెకు చెప్ప వలసిన తీరులో సమ్మతంగా మీఅన్న చెప్పాడు. అది ఆమెకు తగినది. ఇంకొకళ్లయితే మరురోజునుండి ఎడముఖం పెడముఖంగా ఉంటారు. అల్లాంటి వాళ్ళు తెల్లవారేటప్పటికే కలిసిపోతారు. నువ్వు ఇంటిలోనుండి వచ్చేటప్పుడు నిన్ను తూలే ఆవిడ మాట్లాడింది. వెళ్లిపోయినతర్వాత మీ అన్నతో ఇంకా తూలి మాట్లాడిఉంటేనే, మీ అన్నయ్య మర్దించి ఉంటాడు''

''అంతే నంటావా?''

''అక్షరాలా అంతే! నీ అన్నలో మంచితనం ఉన్నది. నీ వదినెలో కుట్రఉన్నది. అయ్యో! దెబ్బలు తిన్నదే! పాటిమహిళ! కొట్టినవాడు పురుషుడు! అని మహిళాలోకం ఏమీ ఆందోళనచెందనక్కఱ లేదు.''

''భాగ్యం అక్కనుండి ఉత్తరం వచ్చింది.''

''ఏమని వ్రాసింది?''

''పోట్లాడకుండా, మర్యాదగా బయటకువచ్చి నందుకు తృప్తిని వెల్లడించింది, ఒళ్లెరిగి జాగ్రత్తగా బ్రదుకమంది. అన్నయ్యమంచివాడనీ, అవసర మయినప్పుడతని సహాయం పొందమనీ వ్రాసింది. అక్కడనుండి బయటకు వచ్చినందుకు తాను సంతోషించడమూలేదట! విచారించడమూలేదట!''

''మీ అక్కయ్య తూచి మాట్లాడుతుంది. తూచి వ్రాస్తుంది. విదేశాలలో రాయబారిగా ఉండ వలసిన మనిషి''

సురేఖ నవ్వింది.

''అక్కా! నీకు మంచి రోజులు వచ్చినయ్యని నాకు అనిపిస్తోంది. ఆ యింట్లో నుంచి బయట పడడం శుభసూచకం. మీ వదినె తెలివిగలదాననని అనుకుంటుంది కాని తెలివితక్కువది. ఆమెకు కుట్ర చేయడం, విసిరికొట్టడం తెలుసు. కాని లాలించడం, విస్సహాయ స్థితిని ప్రదర్శించడం అనే విద్య తెలియదు. అదే కనుక తెలిసిఉంటే, నీ జాతి లక్షణంచేత ఎంత సొమ్ము అడిగితే అంత సొమ్ము ఊరికే యిచ్చి దణ్ణం పెట్టేదానవు. మీ అన్న ఆత్మాభిమానం కలవాడు. సొమ్ము కావలసిఉన్నా, నోరు తెరచి అడుగలేడు.''

''నిజమే. నా నెత్తిన పేడ రాచేవారే. కాని మా నాన్న నన్ను మేలుకొలిపాడు. మా అక్క దానిని బలపరిచింది.''

* * *

కొద్దిరోజులకు రాజయ్య సురేఖఇంటికివచ్చాడు. ''అమ్మా! బాగున్నావా? నీకేదయినా ఇబ్బందిగా ఉంటే చెప్పు. నాకు వీలయినంత సాయం చేస్తాను'' అన్నాడు

''వదినే, పిల్లలూ, కులాసాగా ఉన్నారా, అన్నయ్యా?''

''ఉన్నారమ్మా!''

సురేఖ రాజయ్యకు ఉప్మా, కాఫీ ఇచ్చింది. తీసుకున్నాడు.

''అన్నయ్యా! ఒక్కొక్క మనిషి తరహా ఒక్కొక్క విధంగా ఉంటుంది. నేను వస్తున్న రోజున వదినె అన్న మాటలు ఇంకొకరయితే పట్టించుకునే వాళ్ళు. నేను పట్టించుకోలేదు. కాని ఏం చేస్తాను! వచ్చేశాను. వదినెను ఒకమాటు వచ్చిచూడాలను కుంటున్నాను ఎంతోకాలం కలిసిఉన్నాం. వదినెకు మాత్రం నన్ను చూడాలని ఉండదూ? కాని పిల్లలతో తీరుబడికాదు''

''చెల్లీ! నువ్వు మొన్నమొన్ననేగా అక్కడనుండి



వచ్చింది! ఇంకా నాలుగురోజులు పోయిన తర్వాత వస్తే మనుష్యులు అలవాటుపడతారు''

రావద్దని సున్నితంగా రాజయ్య చెప్పాడని అనుకుంది, సురేఖ. అప్పటికి పెళ్ళాన్నికొట్టిన దెబ్బల నొప్పులు తగ్గవచ్చు. ఈలోపుగావస్తే వదినె ఏదయినా అనవచ్చు. ఏదయినా ప్రళయం రావచ్చు.

''వెళ్లివస్తానమ్మా !'' అని లేచాడు తటపటాయిస్తూ.

''అప్పుడే వెడతావేం ? కూర్చో అన్నయ్యా !''

కూర్చొని ఏదో ఆలోచిస్తున్నాడు.

''అన్నయ్యా ! నీ ముఖం — ఇందాఃటినుంచీ చూస్తున్నాను—విచారంగా ఉంది. ఏదో చెప్పాలనుకుంటున్నావు. చెప్పలేకపోతున్నావు.''

''నిజమేనమ్మా ! అడగడానికి నోరురావడం లేదు. నిన్ను ఎప్పుడూ ఏదీ అడిగిందిలేదు. ఇప్పుడు నేనొక్క వెయ్యిరూపాయలబాకీ చెల్లించకపోతే వారంటు వస్తుంది. చెంబూ తప్పేలా వీధిలో పడేస్తారు. మర్యాదపోతుంది. నువ్వుగనుక అప్పఇస్తే నా గౌరవం నిలుస్తుంది. మాయింట్లో నీకేమయినా లోపం కలిగితే అది అంతా మఱచిపోయి, ఈసాయంచేయి.''

సురేఖ కళ్లవెంబడి నీరు బొట బొటకారింది. వెంటనే పెట్టెతీసింది. చెక్కుపుస్తకంతీసి తన సేవింగ్స్ అక్కౌంటులోనుండి ఒక వెయ్యిరూపాయలకు చెక్కు నిచ్చింది.

''నువ్వు దేవతవని నాకు తెలుసునమ్మా. నేను రేపు నీకు నోటువ్రాసి పట్టుకువచ్చి యిస్తాను'' అన్నాడు రాజయ్య.

''అన్నయ్యా ! నేనేమీ దేవతను కాదు నీ చెల్లెలిని మాత్రమే. నీకష్టం నాకష్టం అనుకునిఇచ్చాను. ఇదినీకు అప్పగా మాత్రం నీకివ్వలేదు. నేను నీకు ఎప్పుడూ అప్ప ఇవ్వను. ఇచ్చే శక్తిలేదు.

''సామ్మా ! ఎక్కడికి వెడుతున్నావ్'' అని అడిగాడట ఒకడు. ప్రాణప్రదమైనవాళ్లమధ్య

మ గ ది క్కు

తగాదా పెట్టడానికి వెడుతున్నానని సమాధానం చెప్పిందిట ఆసొమ్ము,తల్లీబిడ్డలమధ్యకూడా ద్రవ్యం విరోధాన్ని తెచ్చిపెడుతుంది.

నేను అప్పగా నీకు సొమ్మిఇస్తే మొదటిప్రశ్న వడ్డీ ఎంత అని? ఆ సొమ్ము సకాలంలో ఇవ్వకపోతే, సకాలంలో తీర్చలేదే అని బాధ. అది అప్ప అయిన తర్వాత తిరిగి రాబట్టుకోవడం కోసం కొంత ధన వ్యయం. ఆ సొమ్ము చేతికెన్నాళ్లకు వస్తుందో తెలియదు. కోర్టులో పడినతర్వాత చేతికి ఎంతవస్తుందో తెలియదు. వరుసగా అన్నీ ఖర్చులేగా!

నీ, నా, విషయంలో అల్లాంటివేమీలేవు. నేను నీకు మనస్ఫూర్తిగా సహాయం చేయదలచుకున్నాను. చేస్తున్నాను. అల్లా చేయడం నాకొక తృప్తి. ఆ తృప్తిని ఎన్ని వేలయినా పోసి కొనుక్కోలేము అన్నయ్యా! ఇది అప్పకాదు. కనుక నోటు అక్కరలేదు'' రాజయ్య నిశ్చేష్టుడయాడు.

''అన్నయ్యా! నీ ఇబ్బందికి ఈ సొమ్ము అడ్డం వేసుకో. నీ చేతిలో వెసులుబాటు కలిగినప్పుడు ఆ సొమ్ములో వదినెకు నగ ఏదయినా చేయించు. మెడలో బంగారం లేకుండా ఉన్న వదినెను చూస్తే నాకు చాలా బాధగా ఉంది. వచ్చే ఆదాయాన్నిబట్టి కుదుమట్టంగా ఇంటి ఖర్చు వాడు. ఎగిడీ దిగిడీగా వాడే రోజులు పోయినై. తాహతును మించి ఖర్చు చేయకు. ఎప్పుడయినా కొద్ది అప్ప కావలసివస్తే, నువ్వు చేయించబోయే నగ బ్యాంకులో పెట్టుకొని అప్ప తెచ్చుకుని, తీర్చుకొని, తిరిగి నగతెచ్చుకోవచ్చు.

ఇంకొకసారి నేను సొమ్ము అప్పగా గాని ఇంకే విధంగా గాని ఇవ్వడం నాకు సాధ్యం కాదని యిప్పుడే చెబుతున్నాను. నాచేత లేదని ఎప్పుడూ అనిపించకు మన ఇద్దరిమధ్యా ప్రోవలకు సొమ్ము ఎప్పుడూ కారణం కారాదు''

''ఇప్పుడే సగం చచ్చివచ్చాను. ఇకముందు ఎందుకు వస్తానమ్మా! అయినా ఆ వారంటు తద్దినం లేకపోతే అసలు వచ్చేవాడినేకాదు!''

''అన్నయ్యా! నేను కఠినంగా మాట్లాడిఉంటే క్షమించు!''

''లేదమ్మా ! నువ్వు ఎప్పుడూ సొల్లుమాట మాట్లాడవు. ఇతరులమనస్సు నొప్పించవు. నాకు తెలియదా, తల్లీ !'' అని రాజయ్య వెళ్ళిపోయాడు.

''సరోజినీ !'' అని పిలచింది సురేఖ. సరోజిని ప్రక్కవాటాలోనుండి వచ్చింది. జరిగినదంతా సురేఖ సరోజినికి చెప్పింది.

''అల్లా ఎందుకుచేశావు అక్కా ! అప్ప అని అడిగినప్పుడు అప్పగానే ఇవ్వకపోయావా ? వడ్డీ పెరుగుతూ ఉండేది. తీర్చలేకపోతే నోటు తిరగ వ్రాస్తూ ఉండేవాడు.

అల్లా పెరిగినకొద్దీ నీకు ఎక్కువ ప్రయోజనం. ఆయన అనుకూలంగా ఇంకా ఎక్కువగా ఉంటాడు. బాగా పెరిగినతర్వాత నోటు సొమ్ము వసూలు చేసి, ఆ డబ్బు మీకే ఇస్తున్నానని ఇచ్చివేస్తే, ఎంతో ఘనంగా ఉండేది. ఎక్కువ సొమ్ము ముట్టచెప్పినట్లు కనబడేది. వాళ్లకి ఇంకా ఎక్కువ విశ్వాసం ఉండేది. '

''సరోజినీ ! నువ్వు చెప్పింది నిజమే. కాని నాది అల్లాంటి మనస్తత్త్వంకాదమ్మా. ఆయన మా అన్నయ్య ! వచ్చి దీనంగా అడిగాడు. నాకు నాన్న అడిగినట్లే అనిపించింది.

ఇబ్బందిలో ఉన్నానన్నాడు కనుక కాదనలేకపోయాను. ఇక నోటు వ్రాయించుకోవడం సంగతి, మానాన్న నన్ను డబ్బు అడిగాడనుకో ? నోటు వ్రాయించుకునే ఇస్తానా ?

ఈ సొమ్ము నాకష్టార్జితం. ఆపదలో అన్నయ్య అడిగాడు. తృప్తిగా ఇచ్చేశాను. అంతవరకు ఇవ్వగల శక్తి ఉన్నదనుకుంటున్నాను. ఇది ఒక సత్కార్యమని అనుకుంటున్నాను. ''

''సరే ! ఎవరి పద్ధతి వారిది. ఎవరిస్వభావం వారిది. మళ్లీ అప్పకురావద్దని చెప్పావు. బాగుంది!''

*   *   *

సరోజినికి తెల్లవారకట్ట నిద్రలేవడం అలవాటు. అల్లాగే లేచింది. అలవాటుప్రకారం ముందుగా దేవుడిపటంవంక చూసి దణ్ణంపెట్టింది. తర్వాత అరచేయిచూసుకుంది స్విచ్‌వేసి వెలుతురులో అద్దంలో ముఖం చూసుకొని బొట్టు సరిచేసుకుంది కాలకృత్యాలు తీర్చుకుంది.

తనపెళ్లికోసం, ఎన్నాళ్లనుండో కాళ్లు బలపాలు కట్టేటట్టు తనఆరోగ్యంకూడా సరకుచేయకుండా తిరుగుతున్న తండ్రి మనస్సులో మెఱసి, ఒక్కసారి అతనివంక చూసింది. హాయిగా నిద్రపోతున్నట్లుగా కన్పించింది. రోజూ తనకంటె ముందుగా నిద్రలేచేవాడు నేడింకా నిద్రలోనే ఉన్నాడేమో—అనుకుంది. తానింటిలో తిరుగుతున్నప్పుడు అలికిడికయినా లేవలేదు. లేవడానికి బద్ధకిస్తే 'ఎవరమ్మా!' అని అయినా, అనేవాడు. గాఢనిద్రేమో ! గాఢనిద్రలో ఉన్నవాడూ మరణించినవాడూ సమానం అంటారు! పరిశీలనగా చూసింది. ఒకచేయి కిందికి వేలాడుతోంది. వేలాడేచేతిని మంచంమీద సరిగా

(33 వ పేజీ చూడండి)



టినోపాల్* ఇప్పుడు ఓ కొత్త పేరుతో


రానిపాల్+



రానిపాల్+
నూలు దుస్తులకు



రానిపాల్+-ఎస్
సింథెటిక్ మరియు
మిశ్రమ దుస్తులకు



ఉత్పాదన అదే, పనితనం అదే, కాని పేరుమాత్రం కొత్తది.

సర్వోత్తమ తెలుపు కోసం రానిపాల్+

Suhrid Geigy
LIMITED

+ సుహృద్-గైగి లిమిటెడ్ వారి ట్రేడ్ మార్క్ * ఇంతకు పూర్వం సిబా-గైగి లిమిటెడ్ వారి లైసెన్సు క్రింద అమ్మబడేది.

Shilpi SGT 6A/76 tel

బైస్కోపు బాతాఖానీ

నదిలో "లంక" మీద ఫిలిమ్ "స్టూడియో"

[పీ రా జీ]



'సినిమా'ల షూటింగు స్టూడియోల నుంచి బయటపడి వూళ్ల మీదపడ్డం ప్రారంభించిన తరువాత— భారీయెత్తున చిత్రాలు తీసేవాళ్లు యీ 'అవుట్‌డోర్'లో కూడా కొత్తకొత్త మార్గాలు వెతుక్కోవలసిన అవసరం ఎక్కువైంది.

నదీగర్భంలో చిన్నచిన్న లంకలుంటాయి... కృష్ణానదీగర్భంలో విజయవాడకు దగ్గిరిసా వున్న చిన్న లంకలున్నాయి. వీటని 'సొసైటీ'లు వేలం పాడుకుని, కంది, పెసర లాంటి పంటలు వేస్తూంటారు. 'కంద'కే యివి ఎక్కువ ప్రసిద్ధి కూడాను...

వీటిలో ఒక నూటయాభై లేదా నూటఅరవై యెకరాల వైశాల్యమున్న 'లంక' ఒకటి యున్నాళ్లూ సినిమావాళ్ల దృష్టిని ఆకర్షించకపోవడమే ఆశ్చర్యం. ఇప్పుడు అది 'దసరాబుల్లోడు' నిర్మాత రాజేంద్ర ప్రసాద్‌ని ఆకర్షించింది!

ఐదెకరాల మేర యీ లంకను వూరికి అభిముఖంగా వున్న వొడ్డు రేవు ఎన్నుకుని — దానిలో ఓ మోస్తరు 'రాజ విలాస మందిరం'లాంటి ఉద్యాన వన మందిరా'న్ని సినిమా షూటింగ్ అవసరాలన్నీ లెక్కలువేసి మరీ పెట్టుకుని యీ నిర్మాత నెలరోజులు తిరిగేసరికి కట్టించుకున్నాడు — నదిగర్భాన వన ముంది— ఉద్యానవనముంది— నదీ గర్భంలోకి తొంగి చూసే బాల్కనీ వుంది — మరోవైపు అందులోకి దారితీసే సోపానాలున్నాయి— జలయంత్రాలున్నాయి— విలాసదీపాలున్నాయి — వ్రేళ్లు లేవు గాని చిగుర్లు వేస్తున్న అశోక వృక్షాలు అంతెత్తున వున్నాయి! తోటలోపల విశ్వామిత్రుని సృష్టి కనుక రంగు రంగుల కాగితాల పూలు విరిసివున్నాయి! సినిమా చూసేదే కాని వాసన వేసేది కాదుగా ... వాటి మధ్య పగలైనా రాత్రైనా షూటింగ్ కొనసాగించటానికి 'లైట్లు'న్నాయి! — [ఆర్టిస్టులకు మేకప్ చేస్తుంటే వేలాది జనం చూస్తున్నారు]

'బంగాళా' అందాం దీన్ని బంగ్లా పెంకుతో కప్పేశారు కనుక... దానిలోపల మాంచి పడగ్గది— భోజనాల గది— స్నానాల గదికూడా వుంది. ఏ 'సీనై'నా కొంచెం మార్పులతో కామెరాని లైట్‌లను అవసరమైన చోట పెట్టుకుని షూట్ చేసుకోవచ్చును... అందుకే దీన్ని "స్టూడియో" అన్నాను...నిర్మాతలు పంపిణీదారులు దగ్గిరసావున్న విజయవాడ పత్రికలూ మాత్రమే దీన్ని పాపులర్ చేస్తున్నారు అనుకోవద్దు... అసలు యీ "మయసభా మందిరం" సెట్ లాంటి భవనాన్ని విరగబడి లాంచి తిరగబడి పోతుందన్నా వినకుండా రానూపోనూ రూపాయి యిచ్చి మరీ — పోలీసు లాఠీల ఝళిపింపులకు వెరవక— చూసే ప్రేక్షకులదే అసలు సందడి అంతా!!

"ఏమయ్యా! అంతా అధికారులు; డబ్బున్న వాళ్లు — మీ ఫోటోళ్లు చూడాలా! పెజానీకం మాడొద్దా?" అని కొంతమంది "పేపరువాళ్ల"ని— ఏ. పి. ఎమ్. పార్టీ మాత్రమే పార్టీ అనుకుంటున్నట్లున్న ఒక కార్మిక మహిళ యువతల వొడ్డున నిలదీసి అడిగింది...

"మీరంతా సినిమాలో చూస్తారని..." అందామనుకున్నాను కాని సమయం సందర్భం చూడాలిగా... తప్పించుకుని లాంచిలోకి దూరిపోయాము...

లంకమీద స్టూడియోలో 'బ్రేక్' కాఫీలు— పత్రికలవాళ్లకోసం జగపతి అధినేత ఎదురొచ్చారు. ఈలోగానే చిట్టిబ్బాయిగారు అంటే చలసాని ఉమామహేశ్వరరావు — చేతో బెత్తంతో సహా — పలకరించారు. [కర్ర పట్టుకుని ఆజ్మాయిషి చేస్తుంటే ఏమంటారు 'కర్రపెత్తనం' అనవచ్చా?] ఏర్పాట్లు చూడటంలో యీయనకి సాయపడుతున్నవాళ్లున్నారు... అవతల యీ పరస్పర సాయాన్ని సవాలు చేసే వేలాది 'జన' మున్నారు ... మధ్యలో విలాస మందిరంలో 'విలాసంగా' లేరుగాని — మేకప్‌లో వున్న అక్కినేని, మంజుల, సత్యన్నారాయణ, ధూళిపాళ, సూర్యకాంతం ప్రభృతి తారాగణమున్నారు!

కొస మెరుపు

జగపతి రాజేంద్రప్రసాదుగారు సొంతంగా తయారుచేసిన 'బంగారుబొమ్మలు' షూటింగ్‌కోసం యీ "లంకా పురమందిరా"న్ని కట్టారన్న వార్త చాలా పాతది కనుక మొదట్లో చెప్పలేదు ... అక్కినేని "పదిహేనుని వచ్చా"నన్నారు ... మంజులమీదా హీరోమీదా రెండు డ్యూయట్‌లు కూడా సెల్యూలాయిడ్‌మీదకి లాగేసి — "మానికొండ"కి మకాం ఎత్తేస్తున్నారు యూనిట్... ఆ దశలో నాలాంటి "వాన్ సినిమా రిపోర్టర్"కి తెలియదుకదాని— ఎన్నో ప్రశ్నలు వెయలేదు నేను —

"ఈ మందిరాన్ని ఆనక ఏం చేద్దామనుకుంటున్నారు?" అని అడిగాను.

"ఓ హిందీ సినిమాకికూడా వాడుకొంటే బాగుంటుందేమోనని ఆలోచిస్తున్నా" నన్నారు — రాజేంద్రప్రసాదుగారు.

"క్షేమంగా" వుంటుందన్నాను.

ఇది నేను ఆరంభంలోనే చెబుదును కాని రాజేంద్రప్రసాద్ "తీద్దామనుకుంటున్న హిందీ బయస్కోప్ గురించి వివరం నేనడుగలేదు... ఇది "స్మాక్"గా యివ్వాలో 'ఫిలర్‌గా' వదలాలో అర్థంగాక చివర చెప్పాను... ఏదైతేనేం యీ లంకమీది స్టూడియో ముందుకూడా పనికొస్తుంది. చాలా బాగుంది.

సినిమా "కళ"యే వ్యాపారం కాదు?!

సినిమాని వ్యాపారాత్మక కళ అని, కళాత్మక వ్యాపారమని — యిదని అదని — రకరకాలుగా అంటూంటారు కదా కాని మొన్న నీ మధ్యనే విజయవాడ ఫిలిం సొసైటీవాళ్లు ఒక "బెంగాలీ" సినిమా చూపించారు వెయ్యిమందిదాకా వున్న వాళ్ల సభ్యులకి — అది చూశాకా — సినిమా "కళయే" ననిపించింది.

తరుణ్ మజుందార్ దర్శకుడు — సినిమా పేరు "సంసార సీమంతే" నటులు సౌమిత్రా ఛటర్జీ, సంధ్యారాయ్‌లు.

నాటకాల పిచ్చి వున్న అమ్మాయి "రజనీగంధ" దుష్యంతుడిచేత శకుంతల మోసపోయినట్లు — మోసపోయి నష్టపడి భ్రష్టయై — వేశ్యమాత 'మాసీ' చేతిలోపడి వేశ్యవాటికలో జీవచ్ఛవంలా బ్రతుకుతూంటే — 'అఘోర్' అనే పేరున్న ఒక కన్నం దొంగ ప్రమాదవశాత్తు ఆమెకు తటస్థపడతాడు — ప్రేమాంకురం తరువాత గంగాజలాలలో యిద్దరూ "శుద్ధి" చేసుకోడం అన్నీ అతి పవిత్రమైన పద్ధతిలో యెంతో నాచురల్‌గా సాగిపోయాయి — వూపిరి తిప్పుకోకుండా షాట్ "కట్" చేయలేదా? అన్నట్లు — వేగంగా వెళ్లిపోతుంది కథ — గంగానదీ జలాలలో 'శుద్ధి' చేసుకుని త్రికరణశుద్ధిగా యీ ప్రపంచాని కవతలి హద్దుల్లోకి పారిపోయి ప్రకృతి మాత వొడిలో కష్టించి బ్రతకాలని కలలు



'బంగారు బొమ్మలు' షూటింగ్ దృశ్యాలు

గింటున్న తరుణంలో యీ జంట కూడా వోడి పోతుంది! మనిషి పరిస్థితులనుంచి వాటిని చేసిన యితర మనుషుల నుంచి (అదే సొసైటీ అందామా?) పారిపోలేడన్నట్లు అఘోర్ దొంగతనం చేస్తూ — దొరికిపోయి జైలుపాలై పోతాడు. కాని దొంగాడి తోడుదొంగలో కలిగిన చైతన్యం — మళ్లీ విటుల కోసం "దీపంబుడ్డి" పెట్టుకు దారికాస్తున్న "రజనిగంధ"ను ఆ "దుర్గంధ" పంకిలంలో పడి పోకుమా? అంటూ యివతలికి లాగయత్నిస్తుంది!

ఇదే కథలో "మిర్చీ మసాలా" కూరి ఫార్ములాలో యిరికిస్తే మన సినీబ్రహ్మలు — నాలుగు "ఏ" సర్టిఫికేట్లు కూడా చాలనంత గరమ్ గరమ్‌గా ఖంగాళీగా తీసి దోచేసేవాళ్లు — ఏమిటీ? మన జేబుల్ని మాత్రమే! [చచ్చేలా తిట్లుకూడా తినేవాళ్లు].

కాని తరుణ్‌మజుందార్ సినిమా చూస్తున్నప్పుడు ప్రేమ ప్రేమకి మన దృష్టిలో హిమాలయోన్నత శిఖరాగ్రమంత ఎత్తుగా ఎదిగి పోతాడు— సినిమా వెలుపలికి "గర్వం"గా వస్తూంటే మన హృదయ ఫలకం మీద యితని పేరు చెరగకుండా వేసిన ముద్రచేత కొంచెం బరువుగా వుంటుంది.

తెల్లారితే పత్రికలో ఏదో ఒక డైరక్టర్ "ఫొటో"తో యింతవాడంతవాడని యింతంత ప్రకటనలు చూసి — తీరా పోయి ఆ సినిమా చూసి నిరిపించే మనకి యిలాంటి దర్శకుడు 'బెంగాలీ'వాడై పోయేడే అన్న బాధతోపాటు మన దేశీయుడేనన్న "తృప్తి" కూడా మిగుల్తుంది!

"తరుణ్‌మజుందార్" సంధ్యరాయ్, సౌమిత్రులు బెంగాలీరాని నాకే యింత అర్థమైతే... ఆ బెంగాలీ వాళ్లెంత గుండెలు బాదుకుని ఆనందిస్తూ చూశారో యీ సిన్మాని?!

'ఫెరావో'ని మాత్రమేకాదు యిలాంటి సినిమా డైరక్టర్లని గన్న పవిత్ర బంగాలీమాతా! నీకు నాలాంటి సినిమాపిచ్చి గలవాళ్లతరఫున నా జోహార్! [పొరుగింటి 'పుల్లకూర'రుచి అని నాలాంటి సినిమా పిచ్చి గలవాళ్లని తిట్టుకొనేవాళ్లకి నా సానుభూతి కూడా...] ★

సినిమా

నటరత్న చెయ్యనున్న మహాయజ్ఞం!

త్రిపాత్రాభినయం చేసి, ప్రపంచ చలన చిత్ర చరిత్రలో కొత్త అధ్యయాన్ని ప్రారంభించిన "నటరత్న" మరొక యజ్ఞాన్ని ప్రారంభించ బోతున్నారు.

"శ్రీరామ పట్టాభిషేకం" చిత్రాన్ని ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మించబోతున్నట్లు, పత్రికా విలేఖరులతో చెప్పారు "నటరత్న".

శ్రీరాముడుగా... లంకేశ్వరుడుగా ద్విపాత్రాభినయం చెయ్యనున్నట్లు, చిరంజీవి బాలకృష్ణ లక్ష్మణుడుగా నటించబోతున్నట్లు ఎన్టీఆర్ చెప్పారు.

ఈ పౌరాణిక చిత్రానికి స్వర్గీయ సముద్రాల వ్రాసిన స్క్రిప్టు తన దగ్గరున్నట్లు, "నటరత్న" వెల్లడించారు.

జనకరాజ పుత్రిగా నటించడానికి సరికొత్తమ్మాయిని అన్వేషిస్తున్నట్లు, రామారావుగారు చెప్పారు.

పురాణ పాత్రలను పోషించడంలో ఎన్టీఆర్ అద్వితీయుడు అని "దాన వీర శూర కర్ణ" మరొక సారి ఋజువు చేసింది. దర్శకుడుగా ఆయన ఎంత గొప్పవాడో ప్రూవ్ చేసింది. ఎన్టీఆర్ తప్ప పౌరాణికాలకు మరొకరు సరిపోరు.

అభిమన్యు రాజ్యము

ఇది సినిమాపేరు అనుకునేరు. నేను యిలా వ్రాసినదాంట్లో ఎంతో అర్థం వుంది.

"నటరత్న" రూపొందించిన "దాన...వీర... శూర...కర్ణ" చిత్రంతో చిరంజీవి. బాలకృష్ణ అభిమన్యుడుగా ఎంతో అందంగా నటించాడు.

ప్రజలందరూ బాలకృష్ణను "అందగాడా... మాకు నచ్చావయ్యా" అని ప్రశంసించారు.

1979 జనవరి వచ్చేసరికి, బాలకృష్ణ తెలుగు చిత్రరంగంలో అగ్రశ్రేణి నాయకుడు అయ్యేది తథ్యము



'యవ్వనం మురిపించింది'లో శ్రీప్రియ

అని నా కలం ఆశిస్తుంది. ఈ కలం ఆశించిన నిజాన్ని ప్రేక్షకులు అవునంటారు.

చిరంజీవి. బాలకృష్ణతో ఒక రొమాంటిక్ పిక్చర్ రావాలేగాని, యువతరం ఆయన్ను ఆకర్షించి అభినందిస్తారు.

"కర్ణ"లో కనిపించింది కాస్సేపే అయినా, బాలకృష్ణ లక్షలాది ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకున్నాడు. బాలకృష్ణ, ఎన్టీఆర్‌గారిని మించినా, ఆశ్చర్యపడ పనిలేదు.

బాలకృష్ణలో యిద్దరు మహానటులు వున్నారు. ఎన్టీఆర్ గారి అందం...నాగేశ్వరరావుగారి అభినయ కౌశలం.

ఫ్యూచర్ "హీ-మాన్" అయ్యే అర్హత బాలకృష్ణకు వుంది.

'సావాసగాళ్ళు'లో సత్యనారాయణ



సినిమా



'అంతర[illegible]మనిషి'లో ఒక దృశ్యం

దాసరికి మరొక మంచికథ !

ప్రయోగాత్మక చిత్రాలను రూపొందించడంలో దాసరి ఎంతటి ప్రతిభావంతుడో, సారవంతమైన కథలను వ్రాయడంలో నారాయణరావు అంత గట్టివాడు.

దాసరి దగ్గర మరో సుగుణం వుంది. తన కథలనే నిర్మాతలు నిర్మించాలి అన్న ఆంక్ష విధించడం చేతకాదు. ఎవరు వ్రాసిన కథ అయినా, అందులో కొత్తదనం, సన్నివేశాల బలంవుంటే, ఆ రచయితను ప్రోత్సహించడం దాసరికి అలవాటు.

"అగ్రనటి" వాణిశ్రీకి పేరు ప్రఖ్యాతులను ఆర్జించిపెట్టిన "చిల్లరకొట్టు చిట్టెమ్మ" నాటకాన్ని, దాసరి తన నిర్మాత సత్యనారాయణరాజుకోసం దాసం గోపాలకృష్ణ దగ్గర కొన్నారు. నాటకాన్ని జనరంజకంగా వ్రాసిన, దాసం చేతనే సంభాషణలు వ్రాయించడానికి గడుసరి నిర్ణయించారు.

చిట్టెమ్మ ఎవర్ని వరిస్తుందో!

లక్ష్మీజ్యోతి ఫిలింస్ నిర్మించనున్న "చిల్లరకొట్టు చిట్టెమ్మ" చిత్రంలో నాయకురాలి పాత్ర ఎవర్ని వరిస్తుందోగాని, ఆ నటి ఆకాశానికి పెరుగుతుంది.

అగ్రనటి చేసిన పాత్రను పోషించగల ప్రతిభావంతురాలు యిప్పుడున్నవాళ్లలో ఎవరు చెయ్యగలరు?

దాసరి వితరణ

మనసిచ్చి ప్రేమించే స్నేహితులకు దాసరి ఎలాంటి మంచయినా చెయ్యడానికి వెనకాడరు. మనమున్న మనిషి గాబట్టే, తన కథను మరొక దర్శకుడికి యివ్వడానికి అంగీకరించారు.

కథ వ్రాసివ్వడమే గాక, మాటలు కూడా సమకూర్చడానికి ఒప్పుకున్న దాసరి వితరణశీలాన్ని ఎంతైనా అభినందించాలి.

విజయ...మాధవి పిక్చర్స్ అక్కినేనితో ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మించనున్న చిత్రానికి టి. కృష్ణ దర్శకుడుగా... దాసరి కథకుడుగా పని చెయ్యడం ముదావహం... శుభావహం.

శ్రీ వడ్డె శోభనాద్రి నిర్మించనున్న కలర్ చిత్రంలో "జయ"లందరూ ప్రధాన పాత్రలను పోషించగలరని తెలుస్తూంది.

రజతోత్సవ కానుకలు

ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ వెలసి యిరవై అయిదేండ్లు అయినట్టు, ప్రేక్షకులకు తెలుసు. ఆ సంస్థ అందించిన మాణిక్యాల్లాంటి చిత్రాలు ప్రజల్లో చెరగని ముద్రవేశాయి.



'ఓ మనిషీ తిరిగి చూడు'లో

ప్రత్యగాత్మ దర్శకత్వంలో వచ్చిన "భార్యాభర్తలు, కులగోత్రాలు, పునర్జన్మ...అత్తవారిల్లు" చిత్రాలు తాతినేని ప్రకాశరావు దర్శకత్వంలో వచ్చిన "ఇల్లరికం", ఎల్. వి. ప్రసాద్‌గారి దర్శకత్వంలో వచ్చిన "పెంపుడు కొడుకు" తాతినేని రామారావు దర్శకత్వంలో వచ్చిన "నవరాత్రి ... బ్రహ్మచారి... పల్లెటూరి బావ"... చిత్రాలు పి. ఏ. పి. సంస్థను ప్రజలకు దగ్గరిదాన్ని చేసాయి.

పి. ఏ. పి. నుంచి వచ్చే చిత్రాలను గురుశిష్యులు డైరెక్ట్ చెయ్యడం గమనించదగ్గ విషయం. సంస్థ ప్రారంభ చిత్రంనుంచి యిప్పటిదాకా వస్తున్న చిత్రాలన్నీ నవయుగ పంపిణీలో రావడం గమనార్హం.

నిర్మాత ఎ. వి. సుబ్బారావుగారు ప్రేక్షకులను రజతోత్సవ కానుకగా మూడు చిత్రాలను అందిస్తున్నారు.

ఒకటి (అత్తవారిల్లు) విడుదలయిన చోటల్లా, మహిళా లోకాన్ని బాగా ఆకర్షించింది.

రెండు మార్చిలో అక్కినేని...వాణిశ్రీ నటించిన (ఆలుమగలు) వర్ణచిత్రం విడుదల కాబోతూంది.

మూడు ఏప్రిల్‌లో (అర్ధాంగి) చిత్రం ప్రారంభమై, జూన్‌కు విడుదలవుతుంది.

"అర్ధాంగి" చిత్రానికి ప్రత్యగాత్మగారి శిష్యుడు గాంధీని, నిర్మాత సుబ్బారావుగారు దర్శకుడుగా ఎంపిక చేశారు.

ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్‌లో పనిచేసే ప్రతివ్యక్తి, వుమ్మడి కుటుంబంలో వసించే సభ్యుడుగా ఫీలవుతాడు గాబట్టే, నిర్మాత ఎ. వి. సుబ్బారావుగారు అందరినీ ఆప్యాయానురాగాలతో చూస్తారు గాబట్టే, పి. ఏ. పి. ని ఆదర్శ సంస్థగా పేర్కొనవచ్చు.



రామకృష్ణ సినీ స్టూడియోస్‌వారి 'దాన వీర శూర కర్ణ' చిత్రం జనవరి 14వ తేదీన రాజధానిలోని రామకృష్ణ 70 ఎం. ఎం. థియేటర్‌లో ప్రీమియర్ షో జరిగింది. ఆ ప్రదర్శనకు ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు, ఆయన సతీమణి, యితర మంత్రులు, ప్రభుత్వ అధికారులు, అనధికారులు అనేకమంది హాజరయ్యారు. శ్రీ రామారావు కృష్ణుడు, దుర్యోధనుడు, కర్ణుడు పాత్రలను అత్యంత సమర్థవంతంగా పోషించి, చలనచిత్ర చరిత్రలో ఒక నూతనాధ్యాయాన్ని సృష్టించారు. అభిమన్యు పాత్రధారి శ్రీ బాలకృష్ణ తన పాత్రను చక్కగా పోషించారు. కుంతి పాత్రధారిణి ఎస్. వరలక్ష్మి, యితర పాత్రధారులు చక్కని నటనను ప్రదర్శించి చిత్రానికి నిండుదనాన్ని తెచ్చారు. [శ్రీధర్]



జయసుధ, మురళీమోహన్

ద్వారకాధినేతకు కొత్తనటి కావాలి

ద్వారకా ఆర్ట్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న "గడుసు అమ్మాయి" చిత్రం రెండో షెడ్యూలు కూడా పూర్తయ్యింది. దాదాపు పది రీళ్ల చిత్రం తయారైంది.

ప్రత్యగాత్మ దర్శకత్వంలో ప్రత్యేకతను సంతరించుకుంటున్న "గడుసు అమ్మాయి" చిత్రానికి బొల్లిముంత కథను... మాటలను సమకూర్చారు.

ఈ చిత్రంలోని పాటలకు చలపతిరావు గిలిగింతలు పెట్టే సంగీత స్వరాలను సమకూర్చారు. సింహపురిలో జరుగుతున్న "గడుసు అమ్మాయి" చిత్రానికి వి.ఎస్.ఆర్. కృష్ణారావు ఛాయాగ్రహణ దర్శకుడు.

"గడుసు అమ్మాయి"గా జయసుధకు లభించిన పాత్ర, ఆమెను మరొక మెట్టు పైకి తీసుకెడుతుంది. ఈ చిత్రంలో మురళీమోహన్, మోహన్‌బాబు, లక్ష్మీకాంత్, వంకాయల సత్యనారాయణ, అల్లు రామలింగయ్య మరియు జగ్గయ్య ముఖ్యపాత్రధారులు.

"గడుసు అమ్మాయి" చిత్రనిర్మాతలు రాఘవేంద్రరావు... వెంకటేశ్వరరావు గార్లకు వారి తదుపరి చిత్రంలో నాయకురాలు పాత్రకు "కొత్త అమ్మాయి" కావాలి అనెడి అభిప్రాయాన్ని వారు వెలిబుచ్చారు.

గీత... సంగీత తర్వాత ఏమిటి ?

శ్రీ లక్ష్మీనరసింహా కంబైన్స్ నిర్మించిన "గీత... సంగీత" చిత్రాన్ని రష్‌న్ స్టేజిలో చూచిన వాళ్లు వెలిబుచ్చిన అభిప్రాయాన్ని పాఠకులకు తెలుపుతున్నాను.

ఇంత చక్కటి కథ, యింత నిండయిన కథ, యింత యింపైన కథ వుండ, ప్రభ... ప్రభాకర రెడ్డి... శుభ... గుమ్మడి... అంజలీదేవి... కాంతారావుగార్లు ఎంతో అద్భుతంగా నటించ, కోటారెడ్డి ఎంతో నీట్‌గా చిత్రాన్ని రూపొందించ, చిత్రం ఘనవిజయం సాధించకపోతుందా ? అన్నారు చిత్రవీక్షకులు.

మహిళలను ఆకట్టుకునే అర్హత "గీత—సంగీత" చిత్రానికి ఎంత వుందో, అల్లువారి హాస్యం మాస్‌ను అంత ఆకర్షిస్తుంది, అన్నారు చూచిన రసజ్ఞులు.

ఈ చిత్రాన్ని సమర్పిస్తున్న మావుళ్లయ్యను అభినందించారందరూ. తరువాతి చిత్రం ఏమిటి అని ఒకాయన ప్రశ్నించాడు.

కథ రెడీ! అన్నారు, మావుళ్లయ్య. మార్చి నుంచి షూటింగు అనుకొంటున్నాము, అన్నారు దర్శకుడు కోటారెడ్డి.



'మనవడికోసం'లో విధుబాల, భానుమతి, రోజా



సినిమా

ప్రభ జీవితంలో వసంతం

ఈ ఏడు ప్రభకు చాలా బాగుంటుంది. ఈ ఏడు మొదటి రోజున విడుదలయిన "సంసారంలో సరిగమలు", ఈ ఏడు ప్రారంభ వెంటనే ఆరో రోజున విడుదలయిన "అత్తవారిల్లు" చిత్రాలు ప్రభ "యిమేజ్"ను పెంచిన నిజాన్ని ఎవరూ కాదనరు.

ఒకటి "లైట్ రోల్", మరొకటి "డిఫికల్ట్ రోల్." వైవిధ్యంవున్న నరస గంభీరపాత్రలకు ప్రభ పూర్తిన్యాయం చెయ్యగలిగింది.

ఇంతకు ముందెన్నడూ కానరాని "అందం" ప్రభలో కనిపించింది. (రెండు చిత్రాలలో) "హేర్ స్టయిల్ కూడా బాగుంది. డైలాగు చెప్పడంలో తన కొక ప్రత్యేకత వుందని ప్రభ నిరూపించింది.

రాబోయే ప్రభ చిత్రాలన్నీ "మినిమమ్ గ్యారంటీ"ని ఆర్జించిపెట్టగల సత్తానుపొంది వున్నాయి.

ప్రజలు మెచ్చే పాత్రలు

ప్రభ అంటే శోకపాత్ర అని ఎవరయినా అనుకుంటే... అది పొరపాటు అవుతుంది. ప్రభ గ్లామర్ పాత్రలను చక్కగా పోషించగలదు. "గ్లిసరిన్" వాడకుండా శోకపాత్రలకు న్యాయం చెయ్యగలదు. చలాకీపిల్లగా హుషారుగా నటించగలదు. ఇన్ని చెయ్యగలిగిన ప్రభను ఫలానా పాత్రకయితేనే అని ఎవరూ బ్రాండ్ చెయ్యనవసరంలేదు.

ప్రజలు మెచ్చే పాత్రలను ప్రభ పోషిస్తున్న నిజాన్ని "జీవితంలో వసంతం... స్వర్గానికి నిచ్చెనలు... గీత... సంగీత" చిత్రాలు నిరూపిస్తాయి.

"స్నేహమేరా జీవితం" వర్ణ చిత్రంలో ప్రభ రెండు పాత్రలను పోషిస్తోంది. ఒకదానికి మరొకదానికి వున్న వ్యత్యాసాన్ని ప్రభ ఎంతో చక్కగా ప్రదర్శిస్తోంది. ఈ చిత్రం బి. వి. ప్రసాద్‌కు విపరీతమైన పేరును తెచ్చిపెడుతుంది. రంగనాథ్... గిరిబాబు... బి. వి. ప్రసాద్ ముఖ్య పాత్రధారులు.

గోపాలరావుగారి అమ్మాయి!

వాసు ఎంటర్ ప్రైజస్ నిర్మిస్తున్న కుటుంబ గాథా చిత్రానికి "గోపాలరావుగారి అమ్మాయి" అని పేరిడినట్లు, దర్శకుడు వాసు చెప్పారు.


'కల్పన'లో జయచిత్ర

ఇదొక గమ్మత్తయిన మకుటం అనిపిస్తుంది కదూ! ఇంతవరకు వచ్చిన చిత్రాల టైటిల్స్‌లో యిలాంటి విచిత్రమైనది యిదే మొదటిదేమో అనిపిస్తుంది.

ఈ చిత్రంలో రావు గోపాలరావు... 'షావుకారు' జానకి దంపతులుగా నటిస్తున్నారు. (ఫస్ట్ కాంబినేషన్)

"గోపాలరావుగారి అమ్మాయి"గా జయసుధ నటిస్తుందా అని దర్శకుడ్ని అడిగాను. "అవునేమో" అన్నారాయన.

ఈ చిత్రానికి ఆదుర్తి నరసింహమూర్తి కథ, మాటలను, చలపతిరావు సంగీతాన్ని, వి. ఎస్. ఆర్. కృష్ణారావు ఛాయాగ్రహణాన్ని నిర్వహిస్తున్నారు.

ఈ చిత్రంలో నాగభూషణం, నారాయణరావు, మోహన్‌బాబు ముఖ్య పాత్రధారులు.

వాసు గూర్చి రెండు వాక్యాలు

"ఆడపిల్లల తండ్రి" చిత్రాన్ని జనరంజకంగా రూపొందించి, సత్ఫలితాన్ని ఆనందించిన వాసు ఉత్తమశ్రేణి దర్శకుడుగా రాణించగల సమర్థతను కలిగియున్నాడు. పులి కడుపున మేక పుడుతుందా! ప్రత్యగాత్మ తనయుడు వాసు.

అందరూ ఎదురు చూస్తున్న చిత్రాలు

జనవరి రెండో వారంలో విడుదలయిన చిత్ర సీమల పరిస్థితిని పరిశీలన చేద్దామని, ఆంధ్ర దేశంలో యీ విలేఖరి సంచారం చేశాడు. రెండు చిత్రాలకు వసూళ్ల విజయం సంభవించిందే గాని, ప్రతిష్ఠ గాని రాలేదు.

"కర్ణ" చిత్రంలో సుయోధన పాత్ర ధారికి, "కురుక్షేత్రము" చిత్రంలో కర్ణ పాత్రధారికి పేరొచ్చింది.

మార్కెట్టులోవున్న చిత్రాలలోకి విశ్వనాథ్‌గారి దర్శకత్వంలో విడుదలయిన "సిరిసిరిమువ్వ" అత్యధిక ప్రజాదరణ పొందిన నిజాన్ని, యీ విలేఖరి కళ్లారా చూశాడు.

దర్శకుడంటే...విశ్వనాథ్ గారిలాగుండాలి అనేది మాటలు కూడా నా చెవిని పడ్డాయి. మహదేవన్ సంగీతాన్ని, చంద్రమోహన్ అద్భుత నటనా ప్రాభవాన్ని, జయప్రద మూగపాత్రాభినయాన్ని ప్రజలు మెచ్చారు.

— శ్రీనివాస్





అంతస్థుకి అటు ఇటు

ముక్తేవి భారతి

విమానం కదలగానే రాజారాం కారు స్టార్టు చేశాడు. క్లబ్బు కెళ్లాలనుకున్నాడు, కాని ఎందుకో వెళ్లా లనిపించలేదు. ఒక్క క్షణం ఆలోచించి ఇంటి దారి పట్టాడు.

''వెళ్లిందా అమ్మాయి'' పక్కకు ఒత్తిగిల్లుతూ అడిగింది రాధారాణి.

'ఆ' సిగరెట్టు పొగ గాలిలోకి వదలుతూ భార్య పక్కన కుర్చీలో కూలబడ్డాడు రాజారాం.

* * *

''ఆయనకి ఇష్టం ఉండదు నాన్నా... నాన్నా కొన్ని నెలలు పోయాక చిన్నబాబుని తీసుకువస్తాను కదూ... ఏం నాన్నా!'' చిట్టితల్లి నెమ్మదిగా చెవిలో చెప్పిన మాటలు మళ్ళామళ్ళా ధ్వనిస్తూ మనసును ముక్కలుముక్కలు చేస్తున్నాయి. సింహంలాంటి రాజారాం, సముద్రంలా గంభీరమైన రాజారాం, డబ్బుతో కొనలేనిదేదీ ప్రపంచంలో లేదని దృఢంగా నమ్మే రాజారాం కళ్లలో తిరిగిన నీళ్లు మొదటి సారిగా తుడుచుకున్నాడు.

* *

అందాల బొమ్మలా వుండే ఇందిరని పెళ్ళిచేసుకోవాలని ఎందరో అనుకున్నారు. మరెందరో ఇంటికి తామే వచ్చి అడిగారు. కాని ఇందిర పెళ్ళి గురించి ఆలోచిస్తుందో లేదో కాని రాజారాం ఒక్కసారికూడా అమ్మాయి పెళ్ళి గురించి మనసులో అనుకోలేదు. తనకున్న ఒక్క కూతురికి పెళ్ళిచేసి పంపేస్తే ఇల్లు చిన్నబోదూ—

'అయితే పిల్లకి పెళ్ళిచేయరా' అంటుంది రాధారాణి లిప్‌స్టిక్ పెదాలు తడుపుకుంటూ.

''ఒకవేళ పెళ్ళిచేస్తే— ఆ అబ్బాయి ఈఊళ్ళోనే వుండాలి. మా చిట్టితల్లిని ఎప్పుడు పంపమంటే అప్పుడే పంపాలి — ఒక్క పని చేయించకూడదు, ఒక్క మాట అనకూడదు, విన్నావా ! అది ఎవరి కూతురనుకున్నావ్! రాజారావ్స్ డాటర్'' రాజారాం గర్వంగా చిట్టితల్లికేసి చూసాడు. 'యస్ డాడీ'' ఫెమీనా తిరగేస్తూ, భుజాలమీదపడ్డ జుట్టు ఓసారి సరిచేసుకుంటూ తండ్రికేసి చూసింది ఇందిర.

* * *

అదృష్టం అనుకోకుండా కలసివచ్చేసింది.చాలా గొప్పవారి సంబంధం ఇందిరకి ఖాయమైంది.పిల్లవాని తాత జడ్జి పదవిలో ఎన్నో ఏళ్లు చేసి రిటైరయ్యాడు. పిల్లవాని తండ్రి మిలటరీలో పెద్ద ఆఫీసరు. పిల్లాడు ఓ పెద్ద కంపెనీలో మేనేజరు. వాళ్లకున్న ఆస్థి, అంతస్థు సందేహం లేకుండా చాలా పెద్దవి. ఎంతోమంది కావాలని కోరుకునేవి.

'వాళ్ల అంతస్థుకి మనం తగం నిజంగా. కాకపోతే పిల్ల అదృష్టం. ఎన్నో పెద్ద పెద్ద సంబంధాలు వస్తే కాదనుకుని మన పిల్లని చేసుకోటం...' రాధారాణి మాట పూర్తికాకుండానే—

''అంతస్థంటే'' రాజారాం ఎసుగ్గా రాధారాణి కేసి చూశాడు. ''అదే— అంతస్థంటే— అదేనండీ— మనకన్నా వాళ్ళు చాలా గొప్పవాళ్ళనా మరి...''

రాజారాం మనసును సమాధానపరచుకో ప్రయత్నిస్తున్నాడు. వాళ్ళు చాలా గొప్పవాళ్ళు — అయితే మాత్రం మా అమ్మాయి ఎంత అందమైందీ! అందుకే వచ్చి అడిగి, నన్ను ఒప్పించి మరీవెళ్లారు— రాజారాం నల్లని మీసాలు ఓసారి సరిదిద్దుకుని గర్వంగా నవ్వుకున్నాడు. నా అంతస్థుమాత్రం ఏం తక్కువని— తన్ను తానే ప్రశ్నించుకున్నాడు.

* * *

ఇందిర పెళ్ళి చాలా గొప్పగా జరిగింది. కాని కేవలం ఇందిరలాంటి అందమైన పిల్ల కోడలుకావాలని వాళ్లు తనతో సంబంధం కలుపుకున్నారు అని రాజారాం మనసుకి దృఢంగా తెలిసిపోయాక ఎక్కడ నుంచో కిందకు పడిపోయినట్లు కృంగిపోయాడు.

అమ్మాయిని చూడ్డానికి రాజారాం రెండు మూడు సార్లు వెళ్ళాడు. తన రాకపోకలు గుర్తించనట్లే వుండేవాడు అల్లుడు. ''పోన్లే— నా పిల్లకోసం నేను వస్తున్నానంతే'' పేలవంగా నవ్వుకుంటూ మెట్లెక్కేవాడు రాజారాం చాలాసార్లు.

* * *

రాజారాం ఎదురుగా బల్లమీద ఉత్తరం రెపరెపలాడుతోంది. ఈ ఉత్తరం రాయబట్టే వెళ్లి అమ్మాయిని ఎయిర్‌పోర్టులో చూడనైనా చూడగలిగాడు. ఒక్క వారం రోజులయినా తనదగ్గరుంచమని రాస్తే, ఇంచుమించుగా బతిమాలుతున్నట్టుగా రాస్తే విమానం విమానాశ్రయంలో కొద్దిసేపు ఆగుతుంది కాబట్టి అక్కడికి వచ్చిచూచి వెళ్లండనే సమాధానం !

మళ్లా ఓమాటు ఆ ఉత్తరం చదువుకుని పళ్ళు కొరుక్కుని, కాసేపు గదిలో అటూ ఇటూ పచార్లు చేసి ఆ ఉత్తరాన్ని చెత్తకాగితాల బుట్టలో విసిరేసాడు రాజారాం. తన తాహతు వాళ్ళకి తగదు— మొన్నా అల్లుడు పనిమీద ఈ వూరొచ్చి హోటల్లో దిగి వెళ్లిపోయాడు — ఏమిటీ అహం — డబ్బు, డబ్బు — రాజారాంకి క్షణం మతిపోయినట్లే అనిపించింది.

విమానం ఎక్కి వెళ్లిపోయే అమ్మాయి వెనక్కి వెనక్కి తిరిగి నాన్నని చూసి పేలవంగా నవ్వటం, 'ఆయనకి ఇష్టంలేదు నాన్నా' గొంతు తగ్గించి నెమ్మదిగా చెప్పటం ఎంత మరిచిపోవాలన్నా మరిచి పోలేకపోయాడు రాజారాం. ఆ నిముషంలో ప్రపంచం అంతా అంధకారంగా అనిపించింది. మనిషికి అంతస్థే కొలతబద్ద అయితే ఈ ప్రపంచంలో రకరకాల


మనుషులు ఎలా బతికిపోతున్నారు హాయిగా - రాజారాం ఆ చీకటి గదిలో అలాగే కూర్చుండి పోయాడు.

* * *

చిన్న వీధి బడి మాష్టారు కొడుకుగా పెరిగాడు రాజారాం. చిన్న పెంకుటింట్లో అమ్మ, నాన్న, తాత, బామ్మ, ఇద్దరన్నయ్యలు, ఇద్దరు చెల్లెళ్ళు, తను — అంతా వుండేవారు. అమ్మ పెట్టిన చద్ది అన్నం తిని పలక పట్టుకుని లాగు ముడి వేసుకుంటూ వీధిబడికి పరిగెత్తేవాడు. చిన్న లాంతరు ముందు కూచుని చదువుకున్నాడు. బాగా చదువుకుంటున్నాడని తాతయ్య మెచ్చుకునేవాడు. "ఏం చదువో — వాడి కడుపుకి వాడు సంపాదించుకుంటే చాలు" అనేది తల్లి ఏ మూతి దగ్గరో పని చేసుకుంటూ.

అలా అలా చిన్న పల్లెటూరిలో, చిన్న ఇంట్లో, చిన్నబడిలో, మరీ చిన్న బతుకులో కొంచం కొంచం పెరిగాడు.

మామయ్య తనకి కాలేజీ చదువు చెప్పిస్తానని



పట్నం తీసుకొచ్చేవరకు పట్నం ఎలా వుంటుందో తెలియదు. చాలా కష్టపడి చదువుకున్నాడు. అదృష్టం కలసివచ్చింది. — అంతే,

జీవితం కొత్తమలుపు తిరిగింది. మంచి ఉద్యోగంలో ప్రవేశించడం ఆలస్యం, పిల్లనిస్తామంటూ వెంటబడ్డవాళ్ళెందరో. రాధారాణి తండ్రి జానకిరామయ్య తనగురించి విని, వారం రోజులు తిరగకుండా పెళ్ళి సంబంధం కుదిర్చేసాడు. తనని కొనేసుకున్నాడు.

తను ఇంకో మెట్టు పైకి వెళ్ళిపోయాడు. గొప్పవాడైన మామగారు — ఆరోజు తనని వెంట బెట్టుకుని మరీ పెద్ద హోటలులో డిన్నరిచ్చినపుడు, తనవాళ్ళందరూ నిత్యం తినే తిండి, తనవాళ్ళ బ్రతుకులు కళ్ళముందు నిలిచి, అక్కడ తియ్య తియ్యని పదార్థాలు గొంతు దిగక తికమకపడ్డ రోజు ఎలా మరిచిపోగలడు! మొదట్లో కొన్ని రోజులు తల్లితండ్రులకి నెలనెలకి డబ్బు పంపేవాడు. వారం వారం ఉత్తరం రాసేవాడు. కాని తర్వాత తర్వాత

అంతస్తుకి అటూ ఇటూ

పూర్తిగా మారిపోయాడు రాజారాం. 'తన అదృష్టం తనది' అని సర్దిచెప్పుకుంటూ బతికేయడం అలవాటు చేసేసుకున్నాడు. తన ఇంటిచుట్టూ పూలమొక్కలు, పెద్దబంగళా, మరీ పెద్దకారు, తనకోసం చుట్టూ చుట్టూ తిరిగే రకరకాల మనుష్యులు, తన అంతస్థు — ఓహో — గొప్ప గొప్పవాళ్ళే తన ఆత్మీయులని నమ్మేస్తూ, తన డబ్బుతో ఈ ప్రపంచాన్ని కొనేయగలనని గాఢంగా నమ్మేస్తూ — ఓహో — ఎన్నేళ్ళు, ఎన్నెన్నేళ్ళు బతికేసాడు తను — మనిషి ప్రేమకి, ఆప్యాయతకి, త్యాగానికి — ఇలాటి ఎన్నిటికో ప్రపంచంలో కొంతైనా విలువ వుందని గుర్తించాల్సిన అవసరమే లేకుండా హాయిగా బతికేసాడు. చుట్టరికాన్ని, స్నేహాన్ని కూడా అంతస్థుల తూకంలో తూచి ఖరీదు కట్టేసాడు — ఓహో ఎంత పెరిగిపోయాడు తను !!

కానీ మరీ పెరిగిపోయిన రాజారాం. హాయిగా నవ్వడం, కళ్ళు మూసుకు సుఖంగా నిద్రపోవడం మరిచిపోయాడు. నిజానికి తను మనిషిగా బతకడమే మరిచిపోయాడు — కానీ బతికేసాడు — ఎన్నేళ్ళు — ఎన్నెన్నేళ్ళు !!

* * *

తన వాళ్ళని తలుచుకోగనే రాజారాం కళ్ళు చెమర్చాయి. తను చిన్నప్పుడు పెరిగిన ఇల్లు, తనతో బాటు ఒకే కంచంలో తిన్న అన్నయ్య, తన చిన్నారి చెల్లాయి— రాజారాం ఒళ్ళు పులకించింది. తన తనకోసమే ఎదురుచూసే వాళ్ళంతా ఏరీ? ఎవరు దొంగో, ఎవరు దొరో తెలియలేని ఇన్నివేల అనుబంధాల మధ్య తనవాళ్ళేరీ!?

ఇంత పెద్ద రాజారాం చీకట్లో కన్నీళ్ళు తుడుచుకున్నాడు. పెద్ద బంగళా, మరీ పెద్ద కారు, పూలతోట, ఇంకా ఎన్నోఎన్నో తననే వెక్కిరిస్తున్నాయనిపించి కదలిపోయాడు.

చిట్టి తల్లిని అల్లుడు పంపలేదని కృంగిపోయిన తను ఎన్ని అనుబంధాల్ని తేలిగ్గా వదిలేశాడు ఇంత వరకు— రాజారాం దీర్ఘంగా నిట్టూర్చాడు. హోదా మనిషిని పెద్దవాణ్ని చేస్తుంది. కాని దానితోబాటు మనసుకూడా పెరిగితేనే. అలా కాకపోతే- ఎన్నిఉన్నా అన్నీ వృధా వృధా!!

డబ్బు మనిషయిపోయి తను బతికిన బతుకు అసహ్యంగా, భయంగా కనిపించి కళ్ళు గట్టిగా మూసుకున్నాడు రాజారాం.

ఆ రోజు,

"ఊరెడుతున్నాను" సూట్‌కేసులో బట్టలు సర్దుకుంటూ రాజారాం.

"ఊరేమిటి" ఆశ్చర్య పోయింది రాధారాణి. "అమ్మాయి దగ్గరకా?"

"కాదు! అమ్మ దగ్గరికి" రాజారాం రాధారాణి ముఖం చూశాడు.

"బాగుంది మీ హాస్యం. అమ్మాయి కోసం బెంగపడుతున్నారు అసలె— దీనికితోడు ఆ ఊరెళ్ళి ఆ కారాలు తింటూకూచుంటే ఇంక మీ ఆరోగ్యం—" రాధారాణి మాట పూర్తికాలేదు.

"అక్కడుండి తిన్నంతకాలం మనిషిలాగే ఉన్నాను. అవన్నీ మానేశాక ఇలా మారిపోయాను" విరాగిలా ఓ నవ్వు నవ్వి గబగబా ముందుకు అడుగు లేసాడు రాజారాం.

* * *

తను చదువుకున్న చిన్న వీధి బడి దాటిపోతుంటే ఒళ్ళు గుగుర్పొడిచింది. గబగబా నడిచి ఇంటిముందు ఆగాడు రాజారాం. కిటికీలోంచి తొంగిచూశాడు. అమ్మ దొడ్లో తులసికోట దగ్గర తల పెట్టుకు నిద్రపోతోంది. నాన్న ముందు వరండాలో గురకతీసి నిద్రపోతున్నాడు. రాజారాం ఆదేపనిగా చూస్తున్నాడు లోపలికి. దీపపు వెలుగులో పక్కగా ఏదో చదువుతున్న అన్నయ్య కనిపిస్తున్నాడు. రాజారాం ఇక ఆగలేక గబగబా తలుపుతట్టాడు.

"ఎవరు కావాలండీ" తియ్యని చిన్న గొంతు విని పులకించిపోయాడు.

"మీరంతా" అప్రయత్నంగా అనేశాడు.

ఇంట్లో అందరూ రాజారాం చుట్టూ మూగారు. అనుకోకుండా రాజారాం రావటం అందరికీ ఆశ్చర్యంగానే వుంది.

"ఇలా కూచో" మంచం చూపించాడు తండ్రి.

"మీ ఆవిడ కులాసాయేనా" అంది అమ్మ.

రాజారాం నవ్వాడు.

క్షణంలో ఇంట్లో అందరూ ఏదో హడావిడి పడుతున్నారు. అమ్మ రహస్యంగా అన్నయ్యకి ఏదో చెప్తోంది చిన్నవాడు దొడ్డిగుమ్మంలోంచి వెళ్ళి మళ్ళా లోపలకొచ్చాడు.

రాజారాం అన్నీ గమనిస్తూనే ఉన్నాడు. తనకి అతిథి మర్యాదలు చేయడానికి వాళ్ళు పడుతున్న తాపత్రయం— రాజారాం కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

చల్లారిపోయిన అన్నం మీలాగ నేనూ తినగలనని, నేనూ మీలాగ నేలమీద పడుకోగలననీ, నేనూ మీ అందరిలో ఒకడనేనని, అందరిలా ఒకడనేనని — గట్టిగా అందరికీ చెప్పాలి చెప్పాలి అనుకుంటూ, గుండె గొంతుకలో కొట్లాడుతుంటే, గుడ్లప్పగించి చూస్తూ వుండిపోయాడు రాజారాం.

తనని వీళ్ళు ఎందుకు ప్రత్యేకంగా చూస్తున్నారు. — తనూ వీళ్ళ రక్తం పంచుకున్నవాడేనే — అందరూ ఒకటైనట్లు తనొక్కడూ ఒకటైనట్లు అనుకున్న రాజారాంకి ప్రపంచమంతా శూన్యంగా వికారంగా కనిపించింది.

వారం రోజులు అక్కడే గడిపిన రాజారాం బయలుదేరుతుంటే బుట్టనిండా అరిసెలు సర్ది పెట్టింది అమ్మ. తనకి ఇవి యిష్టమని అమ్మ మరిచిపోలేదా ఇంకా —

'బాబాయ్ — మళ్ళీ రా' చిన్న తియ్యని గొంతు, ఒక్క ఉత్తరంముక్క రాయరా బాబూ — నీళ్ళు నిండిన కళ్ళతో అమ్మ చూపు — కదిలిపోతున్న రాజారాంని క్షణం కట్టివేసాయి. ఈ ఆప్యాయతలు తను భరించలేకపోతున్నాడు. — ముందుకేస్తున్న అడుగులో మార్గం కనిపించకుండా కన్నీళ్ళు అలుముకున్నాయి. ఈ ఆప్యాయతల్ని ఏ డబ్బుతో కొనుక్కోగలను !! — లక్షాధికారి రాజారాం దీర్ఘంగా నిట్టూర్చి ఆ నిశీధిలో కలసిపోయాడు.

డాక్టర్ సలహాలు

కె. ఆర్. — రాజమండ్రి

నా వయస్సు 22 సం.లు. నాకు ఎడంవైపు వృషణం వాచివుంది. ఇలా గత తొమ్మిది నెలలుగా తగ్గకపోగా, వృషణం పై భాగంలో "కార్డ్" కూడా వాచింది. దీనికి నివారణోపాయం తెలియజేయండి.

★ ఇలా వృషణం, దానికి చెందిన రక్త, లింఫ్ నాళాలు, కండరాలు మొదలయినవాటి కలయిక అయిన "స్పెర్మాటిక్ కార్డ్" వాయటం అనేది ఫైలేరియా క్రిములు ఆ నాళాలలో అడ్డుపడటంవలన ఏర్పడుతాయి. దీనికి నివారిణ ఆ రోగానికిగాను చికిత్స చేయించుకోవటమే!

సల్ఫా మాత్రలు ప్రతి 4 గం.లకు 1 మాత్ర వంతున రోజుకి 6 మాత్రలు — ఒక 7 రోజులు, "హెట్రజాన్" మాత్రలు పూటకి 2 వంతున రోజుకి 3 సార్లుగా వరుసగా 10 రోజులు తీసుకొంటే ఆ రోగం ఉధృతమయ్యే అవకాశం వుండదు. తర్వాత తలయెత్తే అవకాశమూ లేదు! ఆ వాపు కొద్దిగా తగ్గటం జరుగుతుంది. పూర్తిగా పోతుందనుకోవటం పొరపాటు.

ఎస్. వి. ఆర్. — ఏలూరు

ఒక సం. 5 నెలల నుంచి నాకు ఎడం 'రొమ్ము' వాచివుంది. గత 1 సం. లోపల అది పెరిగి, నెప్పిగాకూడా వుంటున్నది. ఆ పెరగటంవల్ల ఏర్పడిన వాపు మెడవైపు, ఎడమ చంకవైపు, వీపు, చెస్ట్ ప్రాంతాలకికూడా ప్రాకింది. ఏ రోగం అనేదీ తేల్చుకోలేని పరిస్థితిలో మీ సలహా కోరుతున్నాను.

★ మీరు వ్రాసిన వివరాలనుబట్టి ఆ వాపు వ్యాప్తిని గుర్తించి, నేను మీకు వ్రాయగలిగే సలహా— దగ్గరగావున్న శస్త్రచికిత్స వైద్యులకి చూపించి, ఆ వాపు చీము (అంటే ఇన్‌ఫెక్షన్)వల్ల ఏర్పడినదా లేక అక్కడి కండగాని, గ్రంధులు వాయటంవల్ల గాని, మితిమీరి పెరిగిపోవటంవల్ల గాని ఏర్పడినదా అనే విషయాలను నిర్దుష్టంగా తెలుసుకోవాలి అనేది మాత్రమే! ఆటు తర్వాత దానికి వైద్యం చేయించుకోవటం అనేది ఆ రోగాన్నిబట్టి ప్రస్తుతం ఆ రోగం వున్న 'దశ'నుబట్టి (స్థితిని అనుసరించి) నిర్ణయించవలసి వుంటుంది. మీరు యింకా ఆలస్యం ఏమాత్రం చేయకుండా చికిత్స పొందటం చాలా అవసరం అని మాత్రం చెప్పవలసివుంది.

ఎం. ఎ. ఎ. కె. — కడప

మా పాపకి 7 సం.ల వయస్సులో "టి. బి." వచ్చింది. దానికి క్రమం తప్పకుండా ఇంజక్షన్లు, మాత్రలు వాడటం జరిగింది. ప్రస్తుతం బాగానే వున్నా, మళ్ళీ వయస్సు మీరాక తిరిగి యీ రోగం వస్తుందేమో అనే భయం మా కందరికీ వుంది.

★ ఒకసారి పూర్తిగా నయమయి, వైద్యులు ఎక్స్‌రే, నెత్తురు, కఫం మొదలయినవి పరీక్షచేసి వారు చెప్పినంతకాలంపాటు చికిత్స చేసుకొని, వారి అనుమతితో ఆ మందుల వాడకం ఆపితే తిరిగి పెద్దయ్యాక రాగల అవకాశాలు చాలా చాలా తక్కువ. కానీ అసంపూర్తిగా చికిత్స చేయించుకొంటే — పెద్దయ్యేదాకా ఎందుకు? వెనువెంటనే రోగం యధాస్థితికి వస్తుంది. కాబట్టి మీ భయానికి ఆస్కారం లేదనే నా సలహా!

(50 వ పేజీ చూడండి)

మ గ ది క్కు

(24 వ పేజీ తరువాయి)

వేద్దామని స్పృశించింది. తండ్రిచేయి తనచేతికి చల్లగా తగిలింది.

వెంటనే ముక్కుదగ్గర వేలుపెట్టిచూసింది. శ్వాస ఆడుతోందా లేదా అనిపించే స్థితిలో ఉంది. సరోజిని గాబరాపడి శరీరం అంతా నొక్కి చూసింది. చలనం కన్పించలేదు. ప్రక్క రెండు గదుల వాటా వాళ్ళు ఊళ్ళోలేరు. ఇక ఇంట్లో అల్లా ప్రక్కవాటా ముందుగదిలోఉన్న సురేఖా తానే. సురేఖను లేపింది.

మంచంమీద మరణించకూడదనీ, అల్లా జరిగితే 'నారాయణబలి' వగైరా ప్రాయశ్చిత్తాలు చేయవలసివస్తుందనీ, ఎవరో తనతండ్రితో అంటూ ఉండగా సరోజిని ఎప్పుడో వినిఉంది. వెంటనే సురేఖా తానూ కలిసి, శేషయ్యను దొడ్లోకి ఎల్లాగో చేర్చారు. మంచంతోనే. తర్వాత మంచంమీద నుండి దింపారు. శేషయ్య తనతండ్రి తద్దినంకోసం తెచ్చుకున్న దర్భ ఇంట్లో ఉండనే ఉన్నది. దానిని క్రిందవేసి శేషయ్యను దానిమీదికి లాగారు. శేషయ్య పిట్టలాంటి మనిషి కనుక వాళ్ళు అలాచేయగలిగారు.

సరోజిని వెంటనే తలక్రింద దీపారాధనచేసింది. తులసి తీర్థంపోసింది. ఒకటి రెండుసార్లు గుటక వేశాడు శేషయ్య...కనుక తనతండ్రి మంచంమీద మరణించలేదని నిర్ణయం చేసుకుంది. ఒకమారు కళ్ళుతెఱచి సరోజినిని చూసి శాశ్వతంగా మూసివేశాడు.

అంతవరకూ చెవిలో నారాయణస్మరణ చేస్తున్న సరోజిని అంతటితో ఆపేసింది. నిగ్రహించుకున్న దుఃఖం పొంగిపొంలివచ్చింది. సరోజిని నిగ్రహానికి సురేఖ ఆశ్చర్యపోతూ గ్రుడ్లప్పగించి చూస్తోంది. సురేఖను చూస్తూ ఉండమనిచెప్పి సరోజిని వెంటనే సిటీబస్సుమీద గుణదల వెళ్ళిపోయింది.

మేనత్తను చూడగానే సరోజినికి ఏడుపు కట్టలు తెంచుకు ప్రవహించింది. "అత్తయ్యా! నాన్న వెళ్ళిపోయాడు" అని చింపమ్మను కౌగలించుకొని యేడ్చింది.

"ఎంత పని జరిగిపోయిందే! ఓరి అన్నయ్యా! నన్ను విడిచి వెళ్ళిపోయావుటరా!" అని రొమ్ములు బాదుకు ఏడ్చింది చింపమ్మ. కొంతసేపు ఏడ్చిన తర్వాత—

"ఏమి జబ్బు చేసిపోయాడో? రోగం వచ్చినట్లే తెలియదే! కాకిచేత కబురుచేస్తే వచ్చిచూసే దాన్ని కదా! బ్రతికిఉండగా చూపులందేవి" అంది చింపమ్మ.

"హఠాత్తుగా పోయిఉంటాడమ్మా! జబ్బు చేస్తే సరోజిని కబురుచేయదూ? ఈ కాలంలో 'హార్టు అటాకులు' చాలా వచ్చి ఏడుస్తున్నయ్. మనం తినే అన్నంఅంతా దోషదూషితమే కదమ్మా" అన్నాడు సూర్యం కన్నీటి బిందువులు తుడుచుకుంటూ.

"హఠాత్తుగానే పోయాడు, బావా! రాత్రి అంతా బాగానే ఉన్నాడు బంగాళా దుంపల వేపుడు కూర చేసిపెట్టమ్మా! అంటే, చేసిపెట్టాను. తెల్లవారకట్ట మధ్యగదిలోకి వెళ్ళి చూస్తే, హంస లేచిపోయిందేమో అనే అనుమానం కలిగింది. ముక్కు దగ్గర వేలుపెట్టి చూశాను. సురేఖా నేనూ దొడ్లోకి చేర్చాము. తులసి తీర్థం పోశాను. గుటక వేశాడు. చూసి మెడ వాల్చివేశాడు. బావా! నువ్వూఅత్తయ్యా తప్ప నాకెవ్వరున్నారు? శవాన్నయినా మీరు చూస్తారనీ, తర్వాత చేయవలసిన పనులు చేయిస్తారనీ, బయలుదేరివచ్చాను. శవం దగ్గర, పాపం సురేఖ ఒక్కర్తే ఉంది. భయపడుతుందో, ఏమో!" అన్నది సరోజిని.

"సరోజినీ! అమ్మా, నువ్వూ ముందు పదండి. నేను వాహకులనూ, చేయించే ఆయననూ, చెప్పి వస్తాను. శవాన్ని ఇంట్లో ఉంచుకోలేంకదా? ఉన్న వాళ్ళలో మంచివాళ్ళకు చెప్పి వస్తాను" అని పంచాంగం చూసి, "నక్షత్రం మంచిదేలే. ఇల్లు వదలిపెట్ట నవసరం లేదు" అన్నాడు.

చింపమ్మ శేషయ్య శవాన్ని చూడగానే బాగా ఏడ్చేసింది. శోకాలు పెట్టింది. ఆ శోకాలతో చుట్టు ప్రక్కలవాళ్ళుకూడా పోగయ్యారు. ఏడవడానికి చాలా రోజులున్నవని, సరోజిని, ఏడ్పుమ్రింగివేసి కర్తవ్యాన్ని ఆలోచిస్తోంది. తాను ఏడ్పుమ్రింగినా, సురేఖ ఏడుస్తూనేఉంది. తనతండ్రి మరణించినట్లే ఆమె ఏడుస్తోంది. ఆమెవల్ల ఉపకారం ఏమీకనబడలేదు.చెప్పిన పనిమాత్రం చేస్తోంది. సరోజిని ఆమె నోదారుస్తోంది. ఇప్పుడు సరోజిని తనయింటికి తానేపెద్ద. అల్లాగే వ్యవహరిస్తోంది.

సూర్యం పూనుకున్నాడు. కృష్ణాతీరంలో దహన సంస్కారాలూ అరండేలుసత్రంలో కర్మజరిగిపోయినై, పదమూడవరోజున సూర్యం, చింపమ్మ, గుణదల వెళ్ళిపోయారు. సరోజిని ఇంటికి వచ్చేసింది. ఇల్లు బావురుమంటోంది. కార్యక్రమంలో ఉండడం చేత, ఒంటరితనం, సరోజినికి తెలియలేదు. ఎవరిదారిని వారు వెళ్ళిపోయిన తర్వాత సరోజిని, తనస్థితి ఏమిటా అని ఆలోచించడం ప్రారంభించింది.

ముందుకుచూస్తే నుయ్యి, వెనుకకుచూస్తే గొయ్యిగా ఉన్నది పరిస్థితి. ఇంట్లో, ఎక్కడ తిరిగినా, ఏ ప్రక్కకువెళ్ళినా, తండ్రే జ్ఞాపకానికి వస్తున్నాడు. తనకు ఒంటరితనం భరించడానికి దుర్భరంగా ఉంది. అయినా నిబ్బరంగా ఉండాలనే ప్రయత్నిస్తున్నది. కాని అనేకములైన ఆలోచనలు ఆమెను ముసురుకుంటున్నాయి.

మనస్సులో ముందు సురేఖ నిలచింది. సురేఖకు అక్కలున్నారు, చెల్లెళ్ళున్నారు—అన్నలున్నారు,తమ్ములున్నారు. కావలసినంత బలగంఉంది. వారు ఉపకరించకపోయినా, అల్లాఉండడం అనేది, ఒక దండి, గొప్ప అదృష్టం.

తనకో! పైవారెవ్వరూలేరు. ఒంటికాయ శొంఠికొమ్ము మోస్తరుగా అసలు పుట్టడమే తానొక్కర్తేపుట్టింది. తల్లీదండ్రీ లేకపోవడంలోనూ, జీవికకు తెక్కలే ఆధారంకావలసి రావడంలోనూ ఇద్దటిస్థితీ సమానమే.

అయితే సురేఖకు పెళ్ళిసమస్యలేదు. దానినిపెద్ద

వాళ్లే చేశారు. అనుకూలంగానో, ప్రతికూలంగానో ఇదివరకే పరిష్కారమయిపోయింది. జీవితం ఒక దారిని పట్టింది. ఆమెకుపకరించినా, ఉపకరించకపోయినా భర్త అనేవాడొకడున్నాడు. ఆమె పెళ్లి కాకుండా ఉండిపోయిందన్న మాటే లేదు. తనకో పెళ్లే కాలేదు. ఏటి సూతకం కనుక ఇంకొక ఏడాదిదాకా అయ్యే అవకాశమూ లేదు.

తన పెళ్లి సంగతి విచారించేవారే లేరు. తానే విచారించుకోవడానికి సిగ్గు అడ్డం వస్తుంది. ఎరుడి మంచి చెడ్డలను విచారించేటంత పరిణత బుద్ధి తనకున్నదని అనుకోవడానికి అవకాశంలేదు. అందుచేత ఇతరులు చెప్పే మాటమీదే ఎక్కువ ఆధారపడాలి.

పైకి అందరూ బాగానే ఉంటారు. వచ్చేవాడు ఎల్లాంటివాడు వస్తాడో తెలియదు. వయస్సు పెరిగిన కొద్దీ మనస్సులు దగ్గర అవుతయ్యో, దూరమే అవుతయ్యో, తేలికగా చెప్పతగిన విషయంకాదు. పెళ్లి లేకుండా ఉండే స్థితే ఒకరకంగా మంచిదేమో! కాని అది అశాస్త్రీయమని తండ్రి అన్నాడు. తాను తన తండ్రికి వివాహం లేకుండా ఉండనని వాగ్దానం చేసి ఉంది.

వేయి కందిరీగలు కుట్టినట్లుగా సరోజిని బాధపడింది. సురేఖ ఏడుస్తున్నప్పుడామెనుచూసి తాను ఆమె బేల అనుకుంది. కార్యక్రమం అయ్యేవరకూ తాను నిబ్బరంగా ఉన్నా, ఆ దుఃఖం అంతా ఒక్కమాటు కట్టలు తెంచుకు ఇప్పుడు వస్తోంది. తాము కూడా బేలయేనేమో! అసలు స్త్రీలందరూ ఎప్పుడో ఒకప్పుడు బేలతనం వహించేవారేమో! అసలు చదువుకంటె అనుభవం గొప్పది. అనుభవం వయస్సుతో వచ్చేది. కనుకనే, వివాహం విషయంలో పెద్దల మాటలను చాలాకాలం నుండీ పిన్నలు వింటున్నారేమో!

సురేఖ! ఏమి సురేఖ! పుట్టింటివారి వ్యూహాన్ని తెలుసుకొని, ఛేదించి, బయటపడి, ఇవతలకు వచ్చిన సురేఖ రాజయ్య అడగగానే వెయ్యిరూపాయలకు చెక్కు ఇచ్చింది. పైగా అప్పగా అడిగితే ఊరికే ఇచ్చింది. ఎల్లా ఇచ్చింది? ఆశ్చర్యకరం. అంటే, వెనకటి విషయాలన్నీ ఆ క్షణంలో మరచిపోగలిగిందన్న మాట!

అతడు అన్న, తాను చెల్లెలు. దానికే ప్రాధాన్యం. అన్నను చూస్తే తండ్రిని చూసినట్లుగా ఉన్నదట! అన్న అడిగితే తండ్రి అడిగినట్లుగా ఉన్నదనడంలో అర్థమదే. విడమరచి ఆమె చెప్పనక్కరలేదు. తన కిష్టం లేని పనిని, రక్తబంధుత్వం, ఆ క్షణంలో ఆమెచేత చేయించింది. వెయ్యిరూపాయలిప్పించింది, ఉచితంగా ! రక్తబంధుత్వం చాలా దొడ్డది.

అన్నదమ్ములకు వైరాలుండవచ్చు! జ్ఞాతులకు శత్రుత్వముండవచ్చు! వీళ్లందరినీ ఎప్పుడో ఒకప్పుడు ఆ రక్తబంధుత్వం కలుపుతుంది. ఒకడు చస్తే మిగిలినవాళ్లు మైలపడతారు. పదవ రోజున వచ్చి తిలోదకాలు వదలుతారు. ఆ గోత్రానికి చెందకుండా కాస్త దూరమయిన వాళ్లు ధర్మోదకాలు వదలుతారు. ఆ గోత్రంలో మనిషిని అందరూ 'మావాడు' అని సగర్వంగా, ఆత్మీయంగా చెప్పుకుంటారు! 'మా'

మ గ ది క్కు

అనే దానితో వ్యక్తీకరించబడే అభిమానం చాలా గొప్పది.

సురేఖకు రక్తబంధువులు చాలామందిఉన్నారు. తనకెవరున్నారు? తన తండ్రి చెల్లెలు చింపమ్మ ఉన్నది. ఆమె కొడుకు ఉన్నాడు. చింపమ్మ తనకు మేనత్త. అంటే మేని అత్త. శరీర సంబంధమయిన అత్త. అంటే రక్తస్పర్శగల అత్త. కనుకనే ఇంటికి వచ్చింది. ఆమె కొడుకు పూనుకొని సర్వమూ నిర్వహించాడు.

సూర్యం కూడా తన బ్రతుకుతెరువు తాను చూసుకోవాలి కదా! తల్లిని తీసికొని సొంత యింటికి గుణదల వెళ్లిపోయాడు. తనకున్న రక్తబంధువులు వారేనన్న సంగతిని విస్మరించరాదు. ఇవన్నీ మనస్సులో మెదలి, సరోజిని చింపమ్మ ఇంటికి వెళ్లింది. చింపమ్మ ఎంతో ఆదరించి పీటవేసి కూర్చోపెట్టింది. "అత్తా! కర్మరోజులలో వచ్చినవారిని ఉండమని అనరాదు కనుక చెప్పలేదు ఇల్లు బావురుమంటోంది. సురేఖ ప్రక్క ఉన్నా ఆమెది క్రొత్త స్నేహం కదా! నాన్నను మఱచిపోలేకుండా ఉన్నాను. బెంగగా ఉన్నది. నువ్వు వచ్చి ఒక నెలరోజులపాటు మా యింట్లో ఉండకూడదా?" అన్నది సరోజిని చింపమ్మతో.

"అల్లా బెంగ పెట్టుకోకూడదమ్మా ! చచ్చిన వాళ్లతో కూడా చావలేము. ఒక ఏడుపు ఏడుస్తాం, ఊరుకుంటాం — అంతే ! అదే ధ్యాసతో ఉంటే, ఆ దిగులు మనిషిని క్రుంగతీస్తుంది. ఆరోగ్యంచెడుతుంది. తర్వాత మందు ఖర్చు. అసలు ఆరోగ్యం దెబ్బతిన్న తర్వాత, మనిషి తిరిగి కోలుకోవాలంటే ఎంతకాలం పడుతుందో తెలియదు. అసలు మనోవ్యాధికి మందే లేదు. పెళ్లి కావలసిన పిల్లవు. బెంగ పెట్టుకుంటే, ఆ బెంగ ముఖంమీద కన్పిస్తే, చాలా ఇబ్బందులున్నాయి. ఉత్సాహంతో, తోసుకు తిరగాలి. పెద్దవాళ్లు ఎంతకాలమనిఉంటారు?ఇవాళశేషయ్యా, రేపు నేనూ!"

"అత్తయ్యా! అల్లా అనబోకు. అశ్లీలం పలుకకూడదు. పైన 'తథాస్తు' దేవతలుంటారట! బావకు నువ్వయినా వండిపెట్టే ఆధారం లేకపోతే ఎల్లా?"

"పిచ్చిదానా! ఆయువుతీరి, పోయేవాళ్లను ఎవరూ పట్టుకోలేరు, అమ్మా! పోవద్దు అంటే అట్టే ఆగిపోగలనా ? ఎవరి ఆయుర్దాయం ఎంతకాలముందో, అంతకాలమూ, వారు మంచాన పడి అయినాసరే, జీవించే ఉంటారు. ఈమధ్య ఒకాయన విమాన ప్రమాదంలోనో, లేక కారుప్రమాదంలోనో పడిపోయి, సుమారు రెండునెలలు స్మృతి లేకుండా ఉండిపోయాడుట! మళ్లీ బ్రదికి రాయల్లే తిరుగుతున్నాడుట! ఈ దినపత్రిక ఒకటి చూస్తూఉంటాడుగా మా వాడు! వాడు చెప్పాడు. కొందరికి కాఫీ 'కుతి' ఉన్నట్లుగా మా వాడికి పేపరు చదవడం ఒక కుతి. అది చదవందే వాడికి నిద్ర పట్టదు.

సరే! వాటికేం! ఈ కష్టకాలంలో నీకు మాత్రం తోడయేవారు ఎవరు ఉన్నారు? వంట చేసుకుని వెంటనే నౌకరీకి ఏమి పోగలవు ? నేనొక నెలపాటు ఉడకేసి పెడతానులే! ఇంతలో నా కండలేమీ కరగిపోవు. నాకు మాత్రం ఎవరున్నారు తల్లీ ! మా అబ్బాయీ, తర్వాత నువ్వూ. నువ్వేమీ నన్ను బరువు మోయమని అడుగలేదు. నా అన్నం నేను ఎల్లాగూ వండుకోవాలి కదా! నీకుకూడా ఒక చారెడు పోస్తే సరిపోయె!"

"చాలా సంతోషం, అత్తా! రక్తస్పర్శ ఉన్న దానవు కనుక వెంటనే వస్తానన్నావు. ఇంకొకళ్లు అల్లా ఎందుకంటారు?" అన్నది కన్నీళ్లతోసరోజిని.

"కావలసినవాళ్లం, ఒకళ్లకు ఒకళ్లు కాకపోతే, పరాయివాళ్లవుతారా? నీ బావకు వంట వండుకోవడం చేతనవును కనుక నేను వస్తాననడానికి వీలు కలిగింది!"

అనుకున్నట్లుగా చింపమ్మ నెలరోజులూ వండిపెట్టింది. ఆమె ఇంట్లో మాటా పలుకూ ఆడుతూ ఉండడంతో సరోజిని బెంగ కొంత తీరింది.

"ఏదో ఒక్క ఉప్పురాయిని పెట్టుకుని బ్రతుకుతున్నాను. స్మార్తంలో వాడు ప్రయోజకుడయాడు. పీటమీద కూర్చుని, ఉపాహోపనయనాలు నిరాఘాటంగా చేయించగలడు. అనర్గళంగా, నమకమూ, చమకమూ చెప్పగలడు. ఎంతోమందికి అభిషేకాలు చేసి ద్రవ్యం సంపాదిస్తున్నాడు. అందరిచేతా ఔనని పించుకుంటున్నాడు. తిండికి లోటు లేదు. కాని ఒక్కటే లోపం!"

"అదేమిటత్తా!"

"నేను బ్రతికిఉండగా, కోడలు ఇంట్లో కాలు పెడుతుందనీ, ఇల్లు కళకళలాడుతుందనీ అనుకున్నాను. దానిని చూసే అదృష్టం నాకున్నట్లు కన్పించదు. కోడలువచ్చి నాకు వంటా వార్పూ చెయ్యక్కరలేదు. నా ఓపిక ఇంకా చావలేదు. ఈ రోజునకూడా గుండిగడు అన్నం గాడిపొయ్యి మీద వార్చగలను. వాడు ఒక గృహస్థుడు అయాడనే మాట విని కన్నుమూద్దామని ఉంది. ఈశ్వర సంకల్పం. అల్లా లేకపోతే ఈ లోపుగానే కన్ను మూస్తానేమో!

బ్రహ్మచారికాని, బెండకాయకాని ముదరకూడదు. పెళ్ళి చేసుకోరా అంటే నా జాతకంలో ఇప్పుడు పెళ్లియోగం లేదంటాడు. అయినా ఇప్పుడు పెళ్లికి తొందరేమంటాడు. కాలం మారినట్లుగా కన్పిస్తోంది వాడుమాత్రం నా యిష్ట ప్రకారం నడుస్తాడన్నమాటేమిటి? వాడేమిటి? ఆడవాళ్ళు కూడా ఇప్పుడు మాకు పెళ్ళికి తొందరేమిటంటున్నారు. సరుకు చెట్లల్లే ఎదిగిపోతున్నారు. అలా అనడం ఒక ఫాషన్ అయిపోయింది."

సరోజిని తల వంచుకుంది.

"అమ్మా! నిన్ను అన్నానని అనుకోబోకు. నేను లోకం సంగతి చెప్పాను. నీకుకూడా తగులుతుందనుకోలేదు. మీ నాన్న ఎంత ప్రయత్నంచేసినా, కుదరక చేసుకోలేదు కాని, నీవు పెళ్లికి తొందరలేక మానలేదు. పాపం! అన్నయ్య ఎన్ని ఊళ్ళు తిరిగాడో" అని చింపమ్మ కన్నీళ్ళు పెట్టుకుంది.

శేషయ్య మాసికం, త్రైపక్షకంకూడా వెళ్ళిపోయినై. సూర్యంవచ్చి వాటిని సక్రమంగా నిర్వర్తించాడు. చింపమ్మ త్రైపక్షికం కూడా పూర్తి అయ్యేదాకా విజయవాడలోనే ఉండిపోయింది. అన్నయ్య ప్రసాదం తిన్నానని తృప్తిపడి, గుణదల వెళ్ళిపోయింది.

[ఇంకా ఉంది]

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

వీస్ ఎస్. బి. శింగరాయ కొండ.

మీకు ముందుగా ఓ కోటి రూపాయలు యిచ్చారనుకోండి. ముందు ఏ పని ప్రారంభిస్తారు?

ఇక మాట్లాడకకండి. ఆ కోటీ యిలా పడేస్తే కర్చు చేసి మర్నాటికి ఎకవుంటు యిస్తాను!

ఈ రోజుల్లో పెద్దమనిషిగా చెలామణి అవడానికి ఏం చెయ్యాలి?

పెద్ద మనిషిగా వుండడం — నేర్చుకోవాలి ముందు. అప్పుడే కద అసలు పెద్దమనిషి అనడం!

కె కె. ఎస్. అవనిగడ్డ.

గయ్యాళితనం చేత మంచితనం కప్పివేయబడుతుంది— సూర్యుణ్ని మేఘం కప్పినట్టు. . .

చిత్రం కా.కా. శర్మగారూ, అక్కడికా మేఘం సూర్యుణ్ని అతుక్కు పోయి వుంటున్నట్టు!

కట్నాలు లేకపోతే రూపవిహీనులు విద్యావిహీనులు అయిన ఆడపిల్లలు కోడళ్లు అనిపించుకోడంకష్టం.

అలా డబ్బిచ్చి కోడలనిపించుకునే బదులు యింటి ఆడబిడ్డగా వుండి— హాయిగా బ్రతకడం గౌరవప్రదం. అయినా అందమైన దాన్ని డబ్బు లేకుండా చేసుకుంటే మటుకు— అందం శాశ్వతమా వయస్సు శాశ్వతమా? రేపేదో వచ్చి కురూపి అయితే పెళ్ళాన్ని వదిలేస్తారా? పుచ్చుకోని కట్నం అప్పుడు తెమ్మంటారా?! కట్నం పుచ్చుకుంటే మనిషి అందంగా కనిపిస్తుందా!. . . పౌరుషంలేని అబ్బాయిలూ, వారి తల్లి తండ్రులు పెట్టే వంకలివి క్ర వంక తీయడానికి కాలుస్తారు. మరి ఈ బుద్ధి వంకర ఎలా తీస్తారో నాకు తెలియడంలేదు!

జి. ఎస్. ఎన్. ఆర్. జగ్గంపేట.

సమాన హక్కులు కావాలనే మీరు షేక్‌హాండ్ అడిగితే నమస్కారం పెడతారెందుకు?

మీ చేతికే గజ్జి వుంటే మా గతేమిటి రెడ్డి గారూ?! అయినా నమస్కరించడం మన సంప్రదాయం. దానికీ సమాన హక్కులకీ సంబంధం ఏమిటి?!

జె. ఎమ్. ఆర్. గంజాం.

కాలేజీ అమ్మాయిలు జిడ్డుగా ముఖం పెట్టుకు వెళ్ళకపోతే కాస్త చిరునవ్వు వెలిగించుకుంటూ పోతే ఎంత బాగుంటుంది?

మీకా? వాళ్లకా? ! ఆ చిరునవ్వు చూసి మీ బోటివాళ్ళు కాలరెత్తుకుని స్నేహబృందం మధ్య డబ్బాలు కొడతారు.(ఆ పిల్ల నన్ను చూసి నవ్వింది. నన్ను ప్రేమిస్తోంది) అని! ఆడ పిల్లలని కత్తి మీద నడిపిస్తారు— మీలాంటి సభ్యత తక్కువైన కుర్ర వాళ్ళు. నవ్వుతూ వెడితే వెకిలి పీనుగనో లూజు అనో తాటేకులు కట్టేది మీరే! సీరియస్‌గా పోతే జిడ్డు అనేదీ మీరే!!

ఎస్. బి. ఎస్. కొమెరెపూడి

ప్రేమలో ఓడి పోయిన మగవాడికి మధువు మగువ దేవుడిచ్చిన వరాలని ఒక నవలా రచయిత అన్నారు. మరి స్త్రీలకు ఏమిటో తెలియచేస్తారా?

ఏముందీ. కొత్త నవలకు శ్రీకారం చుట్టడమే!

వి. హెచ్. ఎస్. ఆర్, చిల్లపల్లి.

నాకు నాట్యం అంటే చాలా యిష్టం నేర్చుకోవాలని వుంది. కాని నేను పేద వాడిని. నా కోర్కె తీరుతుందంటారా?

పట్టుదల వుంటే తప్పక తీరుతుంది. ముందు మీ ముఖం శరీరం నాట్యానికనువుగా వున్నాయో లేదో చూసుకోవడం ముఖ్యం, లేకపోతే— స్టేజి మీద గాడుగేది గొంతు చించుకుని విచ్చలవిడిగా తిరుగుతున్నట్టుంటుందే కాని— ఏ కామదేవ్ నాట్యంలాగో రక్తి కట్టదు. అప్పుడు ప్రయత్నం ప్రారంభించాలి. ఏ కళాక్షేత్రానికో కూచి పూడి అకాడమీకో,ఏ నాట్యాచార్యునికైనా రాసి పరిస్థితి చెప్పుకోవచ్చు. నాట్య కళారీతులను పోషించే ప్రభుత్వ సంస్థలు— ఉచిత వేతనాలు కూడా యిస్తారు.

సిహెచ్. జె. జి. హైదరాబాదు.

రామకృష్ణ కవి 'ఉవిదలకు బుద్ధి పెడతలమిందు కాదె' అన్నాడు.

మగవాడు కదా? నిగమశర్మలాంటి వాణ్ని కూడా ఏమీ అనలేక—అతని వలపుల వలలో పడిన కోడలు పిల్లని సులభంగా అనేశాడా మహానుభావుడు నేనైతే పురుషున కసలు బుద్ధి యుండదు గాదె! అనేసే దాన్ని!

యు. వీస్. రాజమండ్రి.

ఆడవారి మాటలకు అర్థాలే వేరులే అంటారు. దీనికి మీ సమాధానం?

కనీసం వారి మాటలకి ఉన్న అర్థం కాకపోతే వేరే అర్థమేనా వుంటుందీ, మగవారి మాటలకసలు అర్థమే వుండదని!

ఆర్. పి. ఆర్. బోనకల్లు.


వివాహం చేసుకోడానికి చట్టంతో పనిలేదు. కాని విడాకులకెందుకు అవసరం?


పెళ్లి— నిజందైనా, దొంగదైనా గుడిలోనో, గుట్టు చప్పుడు కాకుండానో చేసేసుకుంటారు. కాని విడాకులు తీసుకోందుకు సాక్ష్యాలు కావాలి. మీ గుడిలో దేముడు, మీ పెళ్లి చేసిన పురోహితుడూ సాక్ష్యానికొస్తారా? రారు. అంచేత పవిత్రంగా చేసుకున్నామనే పెళ్లి బజారు పాలైనప్పుడు— అంత హంగామా! ఇప్పుడిప్పుడే ఈ పెళ్ళి తతంగాలఫార్సుకి తోడుగా ప్రతి వివాహం రిజిష్టరు చేసి తీరాలన్న చట్టం సవరింపు ఆలోచనలో వుంది. అప్పుడు అసలు పెళ్లి ప్రేమ పెళ్ళి రిజిష్టరు పెళ్లి అంటూ ఆడాళ్ల మగవాళ్ల బొంకడానికి వుండదు!


... స్, వై. (మురబహాల్. ఒరిస్సా)

మీరు స్త్రీలకు సమాన హక్కులు కావాలంటారు కదా పురుషులతో పాటు మీరు ఉద్యోగం చేస్తున్నా పురుషులకంటే మీకే ఎక్కువ సౌకర్యాలున్నాయి.

చిత్రం. లేకపోతే ప్రసవం ఆఫీసులోనూ పురుషుల ఆఫీసు పని మెటర్నిటీ లీవుమీదాసాగిం... అంటారా ఏం కర్మ?!







పాప్యులారిటీ ఈజేసిన్

(17వ పేజీ తరువాయి)

ఒక్క కంటి చూపుతో అశేష ప్రజానీకాన్ని నిలబెట్టే శక్తిగల మేగ్నెటిక్ హీరో కన్పించలేదు.

చిన్నారి రాధని గుండెలమీద జోకొడుతూ. ఆప్యాయంగా గుండెలకి హత్తుకుని, ఆపేక్షగా చూసే ఆనాటి శంకర్ కళ్ళే–,

తన మనసులో మమతతో పెనవేసుకుపోయిన తన శంకర్ రూపమే– ఎదుటనిల్చి గుండె నిండిపోయినట్లైంది.

శంకర్ కళ్ళల్లో అర్థంకాని భావాలు మెరుపులా మెరిశాయి.

అనూహ్యమైన అనుభూతులు గుండెల్లో పెల్లుబికాయి.

"రాధా–!"

మనసు పలికినమాట.

మమతలు చీల్చుకుని పెదాలుదాటి రాలేకపోయింది.

అప్పటికే గదినిండిన ఖరీదైన జనం వింతగా చూస్తున్నారు. మేతకోసం వచ్చిన గ్రంధసాంగులు ఆకలిగా చూస్తున్నారు -డదంటే ఒకే అర్థం తెల్సిన పెద్దమనుష్యులు నోరు చప్పరించారు.

సమయాన్నీ వయసునీ అంచనా వేసుకుంటున్న అల్పబుద్ధులు ఊహాగానాలు మొదలుపెట్టారు.

ఒక అడుగు ముందుకు వెయ్యబోయిన శంకర్ కళ్ళు చురుకుగా చుట్టూ చూశాయి.

పదుచుదనపు శంకర్ని

పరువంలో వున్న రాధనీ.

అసేపనిగా చూస్తున్న రకరకాల మనుషుల్ని ఇబ్బందిగా చూసి సర్దుకున్నాడు శంకర్.

తనకెంతో తెల్సిన్న రాధని కనీసం మాట్లాడించలేక పోవటాన్ని వింతగా చూస్తూ–సైప్ చూసుకున్నాడు పి. ఎ.


"సార్ డిన్నర్‌కి పోవాలి ... ముందర జర్నలిస్టులతో చర్చకూడా వుంది."

దీర్ఘాలోచనలో వున్న శంకర్ ఉలిక్కిపడ్డాడు.

అవమానంతో తల దించుకున్న రాధ, గుండెల్లో, కలుక్కున గుచ్చుకుంది. "వెడదాం పదండి" వెళ్ళబోతూ రాధని స్పాటిగా చూశాడు శంకర్.

"నమస్కారమమ్మా...!"

అయోమయంగా తడబడుతూ రెండు చేతులూ జోడించింది రాధ.



గుణత్రయం-సంసారులు భక్తులు

సంసారులు రజస్తమోగుణాలకు నిలయమనీ భక్తులు సత్త్వగుణప్రధానులనీ చాలా మంది అభిప్రాయపడుతూ ఉంటారు. అది సరి కాదు. సంసారులలోనూ భక్తులలోనూ కూడా సాత్త్వికులు, రాజసులు, తామసులూ మూడుతెగలవారూ ఉంటారు. ఈ విషయాన్ని శ్రీరామకృష్ణులే ఒక ప్రసంగంలో స్పష్టంగా తెలియచేశారు.

సంసారి అయిన సాత్త్వికుడికి కట్టుకుందికి గుడ్డ కడుపు నిండడానికి ఏదో తిండి ఉంటే చాలును. ఇల్లు మంచి స్థితిలో ఉన్నా పట్టించుకోడు. శాంతం కలిగి, అమాయకుడై దయాళుడై ఉంటాడు. ఆచారనియమాలను పాటిస్తాడు. ఒకరికి ఎప్పుడూ అపకారం చెయ్యడు.

రాజసుడైన సంసారికి బడాయి కావాలి. విలువైన దుస్తులు, చేతికి గడియారం, వేళ్ళకు ఉంగరాలూ కావాలి. కళ్ళకి కాళ్ళకి, జోళ్ళు కావాలి. అతడు ఇంటిని బాగా అలంకరించి, గోడలకు అందమైన చిత్రాలు, ఫొటోలు తగిలించును.

తమోగుణ ప్రధానుడైన సంసారికి అహంకారం ఎక్కువ. కామ, క్రోధాదులకు అతడు వశమై ఉంటాడు. సోమరితనం ఎక్కువ. నిద్ర ఎక్కువగా ఉంటుంది.

భక్తులలో ఈ గుణాలున్నవారి పద్ధతి వేరు. సాత్త్విక స్వభావంగల భక్తుడు మిక్కిలి గోప్యంగా భగవంతుని ధ్యానిస్తూ ఉంటాడు. అతడు ధ్యానంలో వుండి కళ్ళు మూసుకుంటే ఇతరులకు నిద్రపోతున్నాడనే భావమే కలుగుతుంది. ఆహారంలో రుచీ, పచీ చూడడు. ఆకలి సమయానికి ఏది దొరికితే దానితోనే తృప్తిపడతాడు. ఇతరుల దయకు అపేక్షించి, తన్మూలంగా ధనాన్ని సంపాదించడు. లేదనే చింత ఉండనే ఉండదు.

రజోగుణం గల భక్తుడు తాను భక్తుడని అందరూ అనుకోవాలని అభిలషిస్తాడు. పెద్ద పెద్ద పట్టెనామాలు గాని, విభూతిరేఖలు గాని ధరిస్తాడు, మెడలో వేసుకనే తావళాలలో మధ్య మధ్య బంగారు పూసలను చేరుస్తాడు. దేవుణ్ణి పూజించేటప్పుడు విలువైన పట్టు వస్త్రాలు ధరిస్తాడు. ఇలాటి ఆర్భాటాలు చూపుతాడు.

'తమోగుణం వున్న భక్తుడు భగవంతుణ్ణి బలాత్కరించి తన కోరికలు నెరవేర్చుకోవాలని యత్నిస్తాడు. అతనికి భగవంతుడిమీద విశ్వాసం గట్టిగా ఉంటుంది. తన మొర వినకపోతే భగవంతుణ్ణి నిందించడమే కాదు. తిట్టనూ తిడతాడు. అలా తొందరపడి తాను కృతఘ్నుడైన తర్వాత తన అపరాధాన్ని క్షమించమంటాడు, ఇతనికి తొందరపాటు ఎక్కువగా ఉంటుంది.

రజస్తమోగుణాలను ఒక్కసారిగా కాకపోయినా క్రమంగానయినా తగ్గించుకోవాలి. భగవంతునిపై విశ్వాసాలున్నా, తాను భక్తుడనని ప్రకటించుకోడానికి ఎంతమాత్రం ప్రయత్నించకూడదు. తాను తరించడానికి భగవంతుని మెప్పు కావలెనేగాని, యితరుల మెప్పు అక్కరలేదు. అట్లే తాను భక్తుడననే అహంకారంతో తన కష్టాలు తీర్చలేదని భగవంతుణ్ణి నిందించడం కూడా తగదు. భక్తుని హృదయాన్ని పరీక్షించడానికే యిలా చిక్కులు పెడుతున్నాడని గ్రహించాలి.

భక్తుడైనా సరే రజస్తమోగుణాలను జయించినప్పుడే అతని భక్తి మేలైనది కాగలదు.

ఆ కన్నీటిలో నిరసన-అవమానం- అభిమానం-పోటీలుగా కన్పిస్తుంటే- చటుక్కున తల దించుకున్నాడు శంకర్.

"...మీ అభిమానానికి కృతజ్ఞతలు. వంటరిగా చాలా దూరం వెళ్ళాలేమో... ఆడపిల్లవు...రామ్మా...!"

అక్కడేవున్న డ్రైవర్ పరుగుమీద వచ్చి నిలబడ్డాడు.

"...చూడు...పాపం...ఈవిడ... ఎంతో అభిమానంతో వచ్చింది...కారు వుంది కదూ దింపిరా...!"

"స్సేర్...!"

రాధని వెళ్ళమన్నట్టు చూసి- ఇక ఫంక్షన్‌కి వెళ్ళటానికి- లోపలికి వెళ్ళిపోయాడు హీరో శంకర్.

* * *

నిశ్చేష్టంగా ప్రాణం లేని బొమ్మలా కూర్చున్న రాధ- కారు హార్న్ వింటూనే ఉలిక్కిపడింది.

హడావుడిగా లేచి చుట్టూ చూసింది.

పిల్లలందరూ అమాయకంగా నిద్ర పోతున్నారు. తండ్రి నిద్రరాని కళ్ళు ఆతృతగా గుమ్మం వంకే చూస్తున్నాయి.


శంకర్ డ్రైవర్- పెద్ద పేకెట్‌తో- గుమ్మంలో నిలబడి వున్నాడు. అయోమయంగా నిలబడ్డ రాధ చేతిలో పేకెట్ పెట్టి నమస్కారం పెట్టాడు.

'అయ్యగారు మీటింగ్ మధ్యలోంచి లేచి ఇది మీ కియ్యమన్నారమ్మా తెల్లవార కట్లు పెడుతున్నామని చెప్పారు."

సమాధానం చెప్పకుండా అచేతనంగా నిలబడ్డ రాధకి మరొక్కసారి చెప్పి-

వెళుతున్న శంకర్ డ్రైవర్‌ని కలో నిజమో అర్థం కానట్టు చూస్తూ వుండిపోయింది రాధ.

శంకర్ కళ్ళలో ఎవరికీ అర్థంకాని భావా



లకే తననే ఆశ్చర్యంలో ముంచిన అతని ప్రవ ర్తనకే తగిన సమాధానం తప్పకుండా ఇందులో వుండి వుంటుంది. క్షణం కూడా ఆలశ్యం భరించలేనట్లు పేకెట్ విప్పినరాధ చేతులు వొణికాయి. కళ్ళు చెదిరాయి.

పాప్యులారిటి ఈజేసిన్

తెల్లని కాగితంలో శంకర్ అందమైన కళ్ళునీళ్ళతో వెంటాడుతున్నట్టు మెరిశాయి.

"తల్లీ రాధీ !

ఏన్నాళ్ళైంది నిన్ను చూసి!!! నా గుండెల్లో నిదురపోయి, నా భుజాలెక్కి ఆడు కున్న నా రాధతల్లి ఇంత పెద్దదై నిండుగా, అందంగా అనురాగాన్ని గుండెల్లో దాచుకుని నా కోసం వస్తే రెండు చేతులూ జాపి

ఆత్రంగా గుండెలకి హత్తుకోలేని నిస్సహాయుడినైన నీ శంకర్ అన్నయ్యని క్షమిస్తావా తల్లీ -

నేను మద్రాస్ వచ్చాక మాష్టారికి కొన్నాళ్ళు ఉత్తరాలు వ్రాశాను. బదిలీ అవబోతోందని వ్రాశారు గానీ ఎక్కడికో వ్రాయలేదు...—

రాధా! ఇవాళ నేనెంత అదృష్టవంతుడ్ని! నిన్నీ విధంగా చూడగలిగాను.

కానీ మనసారా మాట్లాడలేక నా ఆనందాన్ని ఆవేదనగా గుండెల్లోనే దాచుకుని కన్నీటితోనే నీకు వీడ్కోలు చెప్పాను. మామూలు అభిమానిని చూసినట్టు అందరి ముందు ప్రవర్తించాను.

తల్లీ! నేను సినిమా వాడిని. పైగా పది మందితో గంతులు వేసే హీరోని. నువ్వు పరువంలో వున్న ఆడపిల్లవి. అదీ రాత్రి వచ్చావు. అవే ... అక్కడివాళ్ల ఊహలకి చక్కని రంగులు వేస్తాయి.

ఈ క్షణంలో ఇంటికి వచ్చి మాష్టారితో కబుర్లు చెపుతూ నీ చేతి అన్నం తినాలని తహతహలాడుతున్నాను. కానీ నా ప్రతీ అడుగునూ ఫొటోలు తీసేవాళ్ళున్నారు. నా ప్రతీ చర్యలోనూ అర్థాలు వెతికేవాళ్ళున్నారు.

నేను మనిషిని కాదు రాధీ! మమతలు బలవంతాన చంపుకుని ఆనందాన్ని పెదాలపై పులుముకుని నా కోసం కాక అందరి కోసం బ్రతుకుతున్న మనసు చచ్చిన మరమనిషిని. ఈ కాస్త వ్రాయటానికే నాకు ఐదునిముషాలు విరామం దొరకలేదు.

మిమ్మల్ని చూడాలని వుంది — మాష్టారికి నమస్కారాలు చెప్పు. మీరందరూ నా దగ్గరకు వచ్చేస్తే ... ఎంత బావుండును. రాధీ ...! చూశావా అప్పుడే అందరి కళ్ళూ నా మీదున్నాయి. ఒక్కమాట ... మీ వదిన కోసం తీసిన చీరె నీకు పంపుతున్నా — ఆడబడుచుగా అందుకుంటావు కదూ.

డిన్నరుకి పిలుపొచ్చింది.
రాధీ! ఇప్పుడు నాకేమనిపిస్తోందో చెప్పనా,
"పాప్యులారిటీ ఈజెసిన్ రియల్లీ..."

శంకర్ —

పసిపాపలా వెక్కిళ్ళు పెడుతున్న రాధనీ, ఉత్తరాన్ని మార్చి మార్చి చూసిన శంకర్ మాస్టారు అంతా అర్థమైనట్టు తృప్తిగా నిట్టూర్చారు.

* ఫాలాక్షుని డైరీ *

గుమాస్తా అర్హత!

'ఎంప్లాయిమెంట్ న్యూస్' అనే పత్రికలో ఉద్యోగము కొరకు దరఖాస్తులు కోరబడుచున్నవనే ఓ ప్రకటనలో 'టెంపరరీ క్లార్క్' ఉద్యోగానికి సివిల్ ఇంజనీరింగ్ డిగ్రీ వున్న యెడల మంచిది అని వున్నదట!

సరదాకో వంతెన!

కేరళలో ఫలానాచోట ఓ బ్రిడ్జి కట్టాం, కట్టామని ఆ ప్రభుత్వం చెప్పి చెప్పి చివరికి కట్టేసిందట. వారు కట్టిన బ్రిడ్జిక్రింద ఓ కాలువగానీ, చిన్న మురిక్కాలువగానీ లేదట. రయ్యనో బ్రిడ్జికట్టేశారంటే. కట్టాక మనం ఏ నదిమీద, ఏ కాలువమీద కట్టామో బ్రిడ్జి అన్న మాటని ప్రశ్నిసుకుంటే యీ సమాధానం దొరికిందట. చివరికది రైలుమార్గం మీద ఓవర్ బ్రిడ్జా అంటే అదీకాదట సరదాకో బ్రిడ్జనమాట!

బరువు మనిషి!

ప్రపంచంలో ఏవొక్కడూ ఊహించడానికి కూడా వీల్లేనంత బరువు యు. ఎస్. ఏ.కు చెందిన ఐరివాన్‌లో రాబర్ట్‌హియూస్‌అనే ఆయన వుండేవాడట. ఆయన 1069 పౌన్లబరువుండేవాడట. తన 32వ ఏట 1958 లో ఆయన చనిపోయాడట.

చదువుపై ప్రభుత్వ ఖర్చు!

న్యూజిలాండు తనదేశంలో పౌరుని చదువు కోసం ఆదేశం ఏటికి సరాసరి ఓ పౌరుని మీద 808 రూపాయలు [మన లెక్కలో] ఖర్చు చేస్తోందట. అదేవిధంగా ఆస్ట్రేలియా 779 రూపాయలు, బ్రిటను 721 రూపాయలు, సింగపూరు 200 రూపాయలూ ఖర్చుచేస్తుంటే మనభారతదేశం 120 రూపాయలు ఖర్చు చేస్తోందట.

విలాసయాత్ర వసతి!

ఆస్ట్రేలియాలో ఓ కంపెనీ తన వ్యాపారాన్ని ఓ లెక్కకుపెంచిన వారికి కొన్ని వసతులిస్తామనీ 95 శాతం పెంచిన రిప్రజెంటేటివ్‌లకు ఏదైనా ఓ విదేశంలో ఉల్లాసయాత్రకు రానూపోనూ విమానం టిక్కెట్లూ, ఖర్చులూ భరిస్తామని, నూటికి నూరుశాతం పెంచినట్లయితే భార్యా పిల్లలతో కోరిన దేశానికి ఉల్లాసప్రయాణం ఖర్చులు భరిస్తామని తెలియజెప్పిందట. కానీ ఆ కంపెనీలో ఏ రిప్రజెంటేటివ్ కూడా 95 శాతం దాటలేదట. మాకీ వసతే బాగుందని విడిగానే ఉల్లాసయాత్రలు పోతున్నారట —దీని భావమేమి!!

అంతుపట్టని కారణం!

అలనాటి ఈజిప్టుదేశపు రాజుల శవాలు త్రవ్వితీస్తే యీ నాటికి కూడా చెడకుండా అదేప్రకారం వున్నాయట. దీనికి చాలా ఆశ్చర్యపోయి, శవాలలా వుండడానికి కారణం కేవలం శవాలకు వుపయోగించిన రసాయనద్రవ్యాలేనొమ్మని, మరి కొంచెం ఆలోచించి అదేమీకాదు ఆ శవాలలా పాడవకుండా వుండడానికి కారణం ఈజిప్టు వాతావరణము, క్రిమ్ములు లేని ఆ నేలే కారణమంటున్నారట, మరితర శవాలు కూడా కుళ్ళరాదుకదా ఆ కారణమే అయితే!!

గొడుగు గతచరిత్ర!

చాలా కాలం క్రితమే యీజిప్టుదేశంలో గొడుగును ఉపయోగించారట. కానీ ఆ కాలంలో గొడుగు కేవలం ఆడవారు తమ ముఖానికి ఎండతగులకుండా వుండేందుకు ఉపయోగించేవారట. మగవాళ్ళు మాత్రం గొడుగుజోలికే పోయేవారుకాదట. ఆ పద్ధతిలో గొడుగులడవారి అలంకరణలో ఒక ఆభరణంలా వున్న రోజుల్లో మొట్టమొదట లండన్ నగరంలో జోన్స్‌హన్వేఅనే ఆయన సాహసించి, గొడుగును వానలో వాననుంచి తప్పించుకునే సాధనంగా ఉపయోగించాడట. ఆనాడాయన్ని లండన్ నగరంలో ఆడవారేగాక, మగవాలు కూడా చాలా ఎగతాళి చేశారట. అయినా ఆతను వాటిని లక్ష్యపెట్టక గొడుగేసుకు ఎండలో కూడా తిరిగేవాడట.

నాలుగోఏటే రచయిత్రి అయిన అమ్మాయి!

డొరతీస్ట్రెయిట్ అనే అమ్మాయి తన నాలుగో ఏట 'ప్రపంచం ఎలాపుట్టింది! ఎలా ఆరంభించబడింది' అనే విషయం మీద పుస్తకంరాసి ప్రచురించిందట. ఆమెకు యిప్పుడు 19వ ఏడుట!

తమిళనాడులో విడాకుల కేసులు

తమిళనాడులోని మద్రాసు, సేలం, చిదంబరం తిరుచ్చి మొదలైన నగరాలలోని కోర్టులలో 456 వివాహరద్దు [విడాకులు] కేసులు విచారణలో వున్నాయట. వీటన్నిటికి భార్యా భర్తల నిరంతర కలహాలు, ఒకరినొకరర్థం చేసుకోలేకపోవడాలు, చాలీచాలని జీతాలు, అనుకోని ఖర్చులు వంటివి కారణాలట! లేక అన్యోన్యదాంపత్యం, ఎక్కువైన రాబడులు, తక్కువఖర్చులూ ఎలా అవుతాయి!!సిల్లీ!

దుబారా తగ్గితే దిగుమతి తగ్గుతుంది

హిందూదేశంలోని పౌరులంతా వస్తువులను, పరికరాలను చక్కగా ఉపయోగించి, దుబారాలను, అనవసర ఉపయోగాలను తగ్గించినట్లయితే మన దేశం 1200 కోట్ల రూపాయలకమ్ముతుచేసే సామాన్లు, 400 కోట్ల రూపాయలు ఖరీదు చేసే ఎరువులూ విదేశాల నుంచి దిగుమతి చేసుకోటాన్ని అరికట్టవచ్చు!

"ష్ శ్! యింకొక్కమాట అన్నా నామీద ఒట్టే" వెంకట్రావుగారు తెచ్చి పెట్టుకున్న కోపంతో, ఆజ్ఞాపిస్తున్నట్లుగా అన్నారు.

ఆయన కెందుకో మనసులో చెప్పలేని భయంగా వుంది.

ఒక్క క్షణం మాట్లాడ వద్దంటే రాజారావుగారు వినటంలేదు. ఆయన ఒక్కోమాట ఎంత సహజంగా మాట్లాడినా, అది వెంకట్రావుగారి గుండెల్లో వాడి శకలంలా నాటుకుంటోంది! గతాన్ని తిరగదోడ, పశ్చాత్తాపమో పరితాపమో తెలియని భావ తరంగాల్ని సుళ్ళు తిప్పుతోంది!

స్నేహితుడి మనసులో చెలరేగే భావాలు, మొహంలో చదివినట్లుగా, రాజారావుగారి పెదవులు శుష్కహాసం చేసాయి!

"సరే వెంకూ! నామాట అబద్ధం అంటావా?" అంటూ సూటిగా నవ్వుతూ అడిగారు.

సమాధానం చెప్పలేనట్టు మొహం పక్కకి తిప్పుకొన్నారు వెంకట్రావుగారు.

నీలం జీరోలైట్ కాంతి ఆ గది అంతా పరుచుకుని, డిమ్ముగా వెలుగుతోంది! మంచానికి నాలుగడుగుల దూరంలో, నేలమీద కొంగు పరుచుకుని, తల క్రింద ఓ చేతిని ఒత్తుగా వుంచుకుని, మరో చేతిని తన గుండెల్లో అమాయకంగా ఒదిగిపోయి ఆదమరచి నిదపోతున్న పదమూడేళ్ళ పద్మని చుట్టేసి, మగతగా పడుకొని వుంది.

ఆవిడకి కొద్ది దూరంలో, చాప మీద వరసగా లలిత, శారద, శ్యామ... నిదపోతున్నారు. పక్కగా మడత కుర్చీలో రాజారావుగారి పెద్దల్లుడు సుందరం, నిద్రతో జోగుతున్నాడు. రెండో అల్లుడు సిగిరెట్ల కోసం బయటి కెళ్ళాడు.

అప్రయత్నంగానే గాఢంగా నిట్టూర్చారు వెంకట్రావుగారు! వాళ్ళెవ్వరూ గుండెల మీద చేయి వేసుకుని నిశ్చింతగా నిద్రపోవటం లేదని ఆయనకి తెలుసు! ఏక్షణం ఎలా పరిణమిస్తుందో అన్న భయాందోళనలు, మూసిన వాళ్ళ కనురెప్పల ఎదురులో ప్రత్యక్షమవుతున్నాయి!

జీవితంలో వూహించని సంఘటనలు ఎంత విచిత్రంగా జరిగిపోతాయి!

అసలు నిన్న వుదయం కేంప్ నుంచి వస్తూనే. ఆఫీసు రూంలో వున్న టెలిగ్రాం చూసి, తన కళ్ళని తానే నమ్మలేక పోయాడు

ఏది స్నేహధర్మం?



సింగంపల్లి సూర్యకుమారి

'రాజారావు సీరియస్ ... స్టార్ట్ యిమీడి యట్లీ' అని వుంది.

'అది పదిహేనేళ్ళ తర్వాత వాడినుంచి వచ్చిన ఆహ్వానం అన్న ఆనందం.. ఆవార్తతో ఆవిరి అయిపోయింది! కాముడితో ఎలా చెప్పాలో అర్థం కాలేదు! అయినా చెప్పక తప్పలేదు!

ఆ వార్త వింటూనే అది నిసత్తువగా, కుప్పలా కూలిపోయింది!

ఆ తర్వాత "మీరే దీని కంతా కారణం?" అంటూ తనని ఏడుస్తూనే సాధింపు మొదలు పెట్టింది. అప్పటికి దానితో వాదన పెట్టుకునె ఓపికగానీ, కోపంగానీ తనకి లేవు. బతిమలాడి, బలవంత పెట్టి... చివరికి యిక్కడికి ప్రయాణం చేయించాడు.

తీరా హైద్రాబాద్ వచ్చాక ... యిక్కడి పరిస్థితి, వీడి మాటల ధోరణి చూస్తే... ఓహ్...' వెంకట్రావుగారు బాధగా రెండు చేతుల్లో తల దూర్చి, పిచ్చిగా జుట్టు పీక్కున్నారు.

'పదిహేనేళ్ళ క్రితం తనవల్ల జరిగిన చిన్న పొరపాటు యింత దారుణంగా ఉంటుందని ఏనాడూ వూహించలేదు ఆయన.

రెండు నిమిషాలుగా స్నేహితుడి ముఖ భావాలు గమనిస్తున్న రాజారావుగారు, ఆప్యాయంగా ఆయన చేతిని అందుకుంటూ...

"దేనికిరా యింతగా బాధ పడతావు? ఈ క్షణం నా కెంత నిశ్చింతగా, హాయిగా వుందో తెలుసా?" అన్నారు.

వెంకట్రావుగారు మాట్లాడలేదు.

"ఒరేయ్ వెంకూ! నీకు గుర్తు వుందా? చిన్నతనమంతా ఎంత హాయిగా, నిష్కపటంగా, నిరాటంకంగా కాల ప్రవాహంలో కొట్టుకు పోయింది!"

'నిష్కపటంగా' అన్న మాట, వెంకట్రావుగారి వెన్నుమీద కొరడాతో చరిచి నట్టయింది! ఒక్క క్షణం ఆయన మొహం వివర్ణమయి పోయింది!

'నిజమే. ఆ రోజులు ఎంత వుల్లాసంగా, నిష్కపటంగా దొర్లిపోయాయి! ఆ పసితనం లోని ఆత్మీయత, స్వచ్ఛత, తను స్నేహాన్ని ఎంత వరకు తెచ్చాయంటే... 'స్వంత వ్యాపారం!' అనే తండ్రి పట్టుదలతో తన కుటుంబం బస్తీ తరలి వెళ్ళిపోతే, తల్లిదండ్రుల దగ్గర వాడు అలకలు, వుపవాసాలు సాగించి మేనమామ దగ్గర చదువుకుంటాననే సాకుతో తనకి అతి చేరువగా, బస్తీకి వచ్చేలా చేసాయి!'

ఎందుకో ఆ పసితనపు స్మృతులు, అనుభూతులు వెంకట్రావుగారి నరనరాన్నీ విచిత్రంగా స్పందింప చేసాయి!

వున్నట్టుండి, ఆయన మనసు. హఠాత్తుగా మెత్తగా గతంలోకి జారిపోయింది!

ఆనాటి ఆ స్నేహం అలాగే యస్సల్సీ వరకు నిరాటంకంగా సాగిపోయింది. ఆతర్వాత కొన్ని ఆర్థిక పరిస్థితులు ఆ యిద్దర్నీ వేరు చేశాయి!

కాలేజీ చదువుల కోసం తప్పని సరిగా రాజారావు విశాఖ వెళ్ళిపోతే, తండ్రి వ్యాపారం కుంటుపడి, కుటుంబం జరుగుబాటు కోసం వెంకట్రావు ఓ కంపెనీలో క్లర్క్ వుద్యోగం సంపాదించుకోవలసివచ్చింది.

స్నేహితుడు పక్కన లేనందువల్లనో

ఏమో; రాజారావు చదువు తర్వాతెల్లకన్నా ఎక్కువ రోజులు సాగలేదు!

ఆ తర్వాత తండ్రి, మేనమామల సలహాతో సహకారంతో. విజయవాడలో ఓ కొత్త పత్రిక ప్రారంభించాడు అతను. ఐదేళ్ళలోనే వూహించనివిధంగా, పత్రిక స్టాండర్డ్ పెరిగింది.

ఈ ఐదేళ్ళలో ఒక్కసారి కూడా స్నేహితులిద్దరూ కలుసుకొనే అవకాశంగానీ, వుత్తరాలు రాసుకునే తీరికగానీ కలగలేదు.

తండ్రి చనిపోయి కుటుంబ బాధ్యతలు మీదపడి వెంకట్రావు సతమతమయిలే, వలుగురి మధ్య ఓ గుర్తింపుతో ... పేరు పలుకుబడిలో, క్షణం తీరిక దొరకక, రాజారావు వుక్కిరి బిక్కిరి అయిపోయేవాడు.

కనీసం ఒకరి పెళ్ళికి మరొకరు వెళ్ళే వ్యవధి కూడా యిద్దరికిలేకపోయింది.

తండ్రి చనిపోయిన తర్వాత వెంకట్రావు జీవితం మరీ యంత్రంలా తయారయింది. వారంలో నాలుగు రోజులు అనారోగ్యంతో బాధపడే తల్లి... పాలుకారే పచ్చని వయసులో వసివాడి పోతున్న యిద్దరు పిల్లలు... ఆ సంసార రథాన్ని గుట్టుగా లాగటానికి తాపత్రయపడే భార్య... యిన్ని ఆర్థిక అవసరాల్ని ఆదుకోలేకపోతున్న తన జీతం...

ఒక్కోసారి జీవితం అంటే ఏమిటి? అన్న ప్రశ్నతోపాటు, భవిష్యత్ మీద చెప్పలేని నిరాశ నిస్పృహలు కలుగుతున్నాయి అతనికి.

అటువంటి సమయంలోనే ఓ పత్రిక ఏజెంట్ ని కలుసుకోవటానికి, అవూరు వచ్చారు రాజారావు. స్నేహితుడి పరిస్థితి చూడగానే అతని హృదయం బాధతో విలవిల్లాడిపోయింది.

"ఏరా వెంకూ! నేనంటూ ఒకడిని వున్నానని మరిచి పోయావా?" అంటూ కన్నీళ్ళతో నిష్ఠూరంగా. ఆవేదనగా అడిగాడు.

వెంకట్రావు కంగారు పడిపోయాడు.

"ఛ...ఛ అలా మరిచిపోతే మనస్నేహానికి అర్థమే లేదురా రాజా !" అన్నాడు బాధగా.

"అయితే చెప్పు యిన్ని అవస్థలు పడుతూ నాకెందుకు వుత్తరం రాయలేదు?"

"ఎలా రాయమంటావు? రెండు మూడేళ్ళుగా నీకే సమాచారాలు కనుక్కోలేని వాణ్ణి, ఈ కష్టాల్లో వున్నానని రాయమంటావా? వూహూం... నామనసు అంగీకరించదు !..."

"చాల్లే! నీ వెధవ అభిమానాలూ నువ్వూ!" అంటూ స్నేహితుణ్ణి మెత్తమెత్తగా మందలించాడు రాజారావు !

కామేశ్వరి ఆ యిద్దరి స్నేహానికి ముగ్ధురాలయింది! 'చెల్లెమ్మా' అని రాజారావు 'ఒరారా' ఆప్యాయంగా పిలుస్తుంటె పొంగిపోయింది! వున్నంతలోనే అతనికి మర్యాద చేసింది.

రాజారావు 'అర్జెంటు పని వుందంటూ,' ఆపూటే విజయవాడ వెళ్ళిపోయాడు. వెళ్ళే ముందు...

"ఒరేయ్! యిప్పటికైనా నీ పిచ్చి అనుమానాలు కట్టిపెట్టి వుత్తరాలు వ్రాయి! చెల్లెమ్మా! నువ్వు అయినాసరే!...యిక్కడి పరిస్థితులు ఎలాంటివైనా, అభిమానపడకు. నాకు నిస్సంకోచంగా వ్రాయి !" అంటూ, తను అక్కడికి వెళ్ళగానే, వెంకట్రావుకి యింతకన్నా మంచి వుద్యోగం వచ్చే ప్రయత్నం చేస్తానని ధైర్యం చెప్పి, వెళ్ళిపోయాడు.

కానీ, ఈ లోపలె అనుకోని ఓ సంఘటన జరిగిపోయింది !

వెంకట్రావుకి పెళ్ళికావలసిన ఓ చెల్లెలు అనురాధ వుంది. అప్పుడప్పుడు వెంకట్రావుతో యింటికి వచ్చే అతని కోక్లర్క్ గోపాలం, అనురాధ ప్రేమించుకున్నారు. అన్నగారు తనకి సంబంధాలు చూడటం మొదలు పెట్టేసరికి ఈ వ్యవహారం అంతా ఒదినగారికి చెప్పేసింది ఆమె. ఆవిడద్వారా అది అన్నవరకు వెళుతుందని అనురాధకి తెలుసు.

మూడేళ్ళుగా కలిసి పనిచేస్తూ, గోపాలం మంచి చెడ్డలన్నీ క్షుణ్ణంగా అర్థం చేసుకున్న వెంకట్రావు, ఈ పెళ్ళికి అభ్యంతరం చెప్పలేదు. గోపాలంతో ముఖాముఖి మాట్లాడి, అతని యిష్టం తెలుసుకున్నాడు. ఆ తర్వాత, పల్లెటూరు వెళ్ళి అతని తల్లితండ్రులతో మాట్లాడి, వాళ్ళ సమ్మతి తీసుకుని ముహూర్తం కూడా నిశ్చయం చేసుకువచ్చాడు.

అయితే...అనురాధ దురదృష్టంకొద్దీ, ఓ రోజు ఆఫీసునుంచి వస్తున్న గోపాలానికి, లారీ యాక్సిడెంట్ జరిగి, అక్కడికక్కడే మరణించాడు.

ఈ సంఘటన అనురాధమీదకన్నా ఎక్కువగా, వెంకట్రావు జీవితంమీద, మనసుమీద, గట్టి దెబ్బతీసాయి !

'అనురాధ దురదృష్ట జాతకురాలు!' అన్న ముద్రతోపాటు 'పెళ్ళి నిశ్చయం కావటానికి ముందే, ఆమెకి గోపాలంతో అక్రమ సంబంధం వుందన్న' అపనిందలు బయలుదేరాయి !

దెబ్బమీద దెబ్బఅన్నట్టు..ఆసమయంలోనే

పదివేల గర్భస్రావాలు చేసిన నకిలీ డాక్టరు

డాక్టరునని చెప్పి అక్రమంగా గర్భస్రావాలు చేస్తున్న ఒక 40 ఏళ్ళ వ్యక్తిని పోలీసులు మద్రాసులో యిటీవల అరెస్టు చేశారు.

ఈ నకిలీ డాక్టరు పేరు సుబ్రహ్మణ్యం. పశుసంవర్ధకశాఖలో పూర్వం పశువుల ఇన్ స్పెక్టరుగా వుండేవాడట. అతను ఇటువంటి అపరేషన్లు 10 వేల వరకు చేసినట్లు ఒప్పుకున్నాడు. 12 ఏళ్ళ నుంచి ఈ ప్రాక్టీసులో వున్నాడు.

59 రోజుల నుంచి తొమ్మిది

ఏది స్నేహధర్మం ?

వెంకట్రావు తల్లి కూడా మరణించింది. యిటు తల్లి మరణం అటు చెల్లెలి దురదృష్టం. వెంకట్రావుని పిచ్చివాణ్ణి చేసాయి!

ఆఫీసు, యిల్లు తప్ప బయట ప్రపంచానికి మొహం చూపించటం పూర్తిగా మానుకున్నాడు. ఒక్కోసారి బయటకి వెళితే అర్ధరాత్రి వరకు యిల్లు చేరేవాడుకాదు. మానసికంగా క్రుంగిపోతున్న అతణ్ణిచూసి అనురాధ, కామేశ్వరి భయపడిపోయారు.

ఎంత ప్రయత్నించినా భర్తని కంటికి రెప్పలా కాపాడుకోవటం అసాధ్యమేమో అనిపించింది కామేశ్వరికి. వెంటనే పరిస్థితులన్నీ వివరిస్తూ... 'మీ స్నేహితుణ్ణి రక్షించుకునే బాధ్యత మీదే;' అంటూ రాజారావుకి వుత్తరం రాసింది.

మూడోరోజుకల్లా అతను వచ్చేశాడు.

స్నేహితుణ్ణి చూడగానే...విన్నాళ్ళుగానో గుండెల్లో గూడుకట్టుకుపోయిన ఆవేదన, ఆరాటం, వెంకట్రావుని వివశుణ్ణి చేసాయి!

"ఒరేయ్ రాజా! ఈ ప్రపంచంమీద నాలాంటి దురదృష్టవంతుడు మరొకడు లేడురా!" అంటూ స్నేహితుడి చేతుల్లో మొహం దాచుకుని పసిపిల్లవాడిలా ఏడ్చాడు.

అతణ్ణి ఓదార్చటం కష్టమే అయింది రాజారావుకి.

ఆ చేదు జ్ఞాపకాల మధ్య, నిందల మధ్య స్నేహితుణ్ణి వుంచటం మంచిది కాదనిపించింది అతనికి. ఓ విధంగా బలవంత పెట్టి

మాసాల వయసు కల పసికందుల మృత దేహాలను అతని వద్దనున్న 119 సీసాలలో భద్రపరిచాడు. తన శక్తిని ప్రజలకు చాటి చెప్పడం కోసం ఈ సీసాలు జాగ్రత్త చేశాడట!

తొమ్మిది మాసాల వయసు కల మృత శిశువు కళేబరాన్ని పోలీసులు భూస్థాపితం చేశారు

ఈ నకిలీ డాక్టరు ఆపరేషన్ వల్ల కాకుండా ఒకరకమైన రసాయనిక ద్రవం ద్వారా భ్రూణహత్యలు చేస్తూ వుండేవాడని కమీషనర్ తెలియ జేశారు.

ఈ రసాయనిక ద్రవం నమూనా లను పరీక్ష కోసం పంపించారు. సుబ్రహ్మణ్యాన్ని రిమాండులో వుంచారు.

నట్టుగా ఒప్పించి వెంకట్రావు కుటుంబాన్ని తనతోపాటు విజయవాడ తీసుకెళ్ళిపోయాడు.

అక్కడే తనకి తెలిసిన ఓ కంపెనీలో, వెంకట్రావు తన పూచీమీద, మంచి ఉద్యోగం యిప్పించాడు. అంతే కాకుండా అనురాధ మనసు పూర్తిగా వైరాగ్యంలో పడకముందే ఆమెకి పెళ్లి చేసేయటం మంచిదని కూడా అతణ్ని హెచ్చరించాడు. వెంకట్రావు దానికి అవును అనిగానీ, కాదు అనిగానీ అనలేదు!

ఆ బాధ్యత కూడా తనే స్వీకరించిన రాజారావు ఓ రోజు...

"ఒరేయ్ వెంకూ! మా పత్రికాఫీసులోనే ఓ కుర్రాడు వున్నాడు. చాలా బుద్ధిమంతుడు కానీ చిన్న చిక్కు. అతనిది మీ కులం కాదు" అని చెప్పాడు.

"కులం గోత్రం" అని చాదస్తపడే అమ్మ నాన్న లేరు కదరా!" అన్నాడు వెంకట్రావు బాధగా.

"ఆల్‌రైట్! నీకు అభ్యంతరం లేదన్న మాటేగా! పోతే అతనికి విశాఖలో మంచి వుద్యోగం వచ్చింది! పది పదిహేను రోజుల్లో వెళ్ళిపోతున్నాడు. ఈ లోపలే పెళ్ళి చేసేయటం మంచిది!" అన్నాడు.

"మరి కట్న కానుకలు...లాంఛనాలు..." వెంకట్రావు ఆదుర్దాగా ఏదో చెప్పబోయాడు.

"ఏడిశావ్! కట్నకానుకలని పీడిస్తే యిక నేను సంబంధం తీసుకు రావటంలో అర్థం ఏముందిరా?" అంటూ స్నేహితుణ్ని గట్టిగా కసురుకున్నాడు.

వెంకట్రావుకి కృతజ్ఞతతో, సంతోషంతో నోట మాట రాలేదు!

"రాజా!" అంటూ కన్నీళ్ల మధ్య ఆప్యాయంగా అతని చేతులు అందుకుని, కళ్ళ కద్దుకున్నాడు.

అతి ప్రయత్నం మీద అనురాధని ఒప్పించి పెళ్ళిచేసి పంపేశారు!

మరో పదేళ్ళు కాలచక్రం క్రింద నలిగి పోయాయి!

ఆ పదేళ్ళ కాలంలో...ఎన్నో మార్పులు మరెన్నో సంఘటనలు చిత్రంగా జరిగి పోయాయి!

*　　*　　*

"ఒరేయ్ వెంకూ!"

ఎక్కడో నూతిలోంచి పిలిచినట్లు విని పించేసరికి, ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు వెంకట్రావుగారు.

ఎంతసేపటి నుంచి పిలుస్తున్నారోగానీ, బాధను అణచి పెట్టటానికి ప్రయత్నిస్తు న్నట్టు, ఓ చేత్తో మంచం పట్టెని గట్టిగా పట్టుకుని, మరో చేత్తో గుండెలు రాసు కుంటూ మెలికలు తిరిగి పోతున్నారు రాజా రావుగారు.

"రాజా!" అంటూ ఒక్క వుదుటున మంచం మీదకు వంగి ఆదుర్దాగా పిలిచారు వెంకట్రావుగారు.

రాజారావుగారు బాధవల్ల మాట్లాడలేక పోతున్నారు. మంచినీళ్ళు కావాలన్నట్టు చేత్తో సంజ్ఞ చేసారు! గ్లాసులోకి నీళ్ళు వంచి తెచ్చి స్నేహితుడిచేత తాగించారు ఆయన. అయినా రాజారావుగారి పరిస్థితి మెరుగుపడలేదు. అదిరే గుండెతో వెంక ట్రామయ్యగారు, ఆయన పెద్దబ్బాణ్ని తట్టి లేపి...

"బాబూసుందరం! వాడికి మళ్ళీగుండెల్లో నొప్పివస్తోంది!" అనిచెప్పారు.

"అలాగా! యిప్పుడే డాక్టర్ని తీసుకొస్తా నండీ!" అంటూ చెప్పులైనా వేసుకోకుండా గబగబా బయటకి పరుగు తీసాడుఅతను.

క్షణం క్రితం భర్తగ్లాసుతీసిన చప్పుడుకే కామేశ్వరమ్మకి మెలుకువ వచ్చింది. రాజా రావుగారి పరిస్థితి చూస్తుంటే ఆవిడ మనసు ఎంత ఆందోళన పడుతుందో...తల్లిలేని ఆ నలుగురు ఆడపిల్లలు... ముఖ్యంగా పసితనం వీడని పద్మని చూస్తుంటే అంతకు రెట్టింపు ఆర్ద్రతతో చలించి పోతోంది!

ఆర్థిక పరిస్థితుల ఒడుదుడుకుల నుంచి, అపవాదుల సుడిగుండాలనుంచి, సురక్షితంగా ఓ దరి చేర్చి, తన పసుపు కుంకుమ కాపాడి, భర్తకి ఆఫీసరుగా, నలుగురిలో ఓ ప్రత్యేకమైన హోదాను ఆయన కలిగించాడన్న నిజం, కృతజ్ఞత యిప్పటికీ ఆవిడ గుండెల్లో గూడు కట్టుకుని వున్నాయి.

అసలు, స్నేహితుడంటే ప్రాణం కన్నా ఎక్కువగా భావించే భర్త, ఆనాడు ఎందుకలా సంకుచితంగా ప్రవర్తించారో ఈనాటికీఆమె వూహకందని సమస్యగా మిగిలిపోయింది!

పదినిమిషాల్లోనే డాక్టర్‌తో తిరిగి వచ్చాడు సుందరం!

ఆయన వస్తూనే రెండు యింజక్షన్స్ చేశాడు రాజారావుగారికి. స్నేహితుణ్ని టెస్ట్ చేస్తూ, పరోక్షంగా తన అభిప్రాయం వెల్లడి చేస్తున్న డాక్టరుగారి పెదవి విరుపు, ముడిచిన కనుబొమలు చూసి, వెంకట్రావుగారి హృదయం నీరయిపోయింది! అయినా ఏమూలో ఉన్న వెర్రిఆశ లాంటిది...ఆయన్ని డాక్టర్ వెనుకే, గుమ్మం వరకువెళ్ళేలా చేసింది!

"అయామ్‌సారీ! ఈరాత్రి గడిస్తేగానీ ఏవిషయం చెప్పలేను. కానీ. ఓ మాట. ఆయన ఎక్కువగా వుద్రేకపడకుండా మాత్రం జాగ్రత్తగా చూడండి!" అని హెచ్చరించి వెళ్ళిపోయాడు డాక్టరు.

తిరిగి వచ్చి నిసత్తువగా కుర్చీలో కూర్చుండి పోయారు వెంకట్రావుగారు. ఆయన కళ్ళు... మంచం మీద, అచేతనంగా పడివున్న స్నేహితుడి మీదనిర్నిమేషంగా నిలిచి పోయాయి!

చిక్కిపోయిన దవడలు, లోతుకుపోయిన కళ్ళు, పదేళ్ళనుంచి ఆ మంచంలోనే తీసు కుంటున్నట్లుగా... బక్క చిక్కిన బడుగు దేహంలావున్న రాజారావుగార్ని చూస్తుంటే... పదిహేనేళ్ళ క్రితం. పుష్టిగా, అందంగా, ఆరోగ్యంగా వుండే తన రాజాయేనా! అన్న అనుమానం, ఆవేదన కలుగుతున్నాయి ఆయనకి.

చాలాసేపటి తర్వాత స్నేహితుడి పెద వులు కదలడం చూసి...

"రాజా! దాహంగా వుందా? మంచినీళ్ళు ఇవ్వనా?" అని అడిగారు.

ఆయన వద్దన్నట్లు తల వూపి, స్నేహి తుడి చేతిని తన చేతిలోకి తీసుకున్నారు!

"ఒరేయ్ వెంకూ! నీతో ఎన్నెన్నో...

మాట్లాడాలని వుందిరా!'' అన్నారు హీన స్వరంతో ఆయాసపడుతూ.

''వద్దు! వద్దు!'' వెంకట్రావుగారు కంగారుగా వారించారు.

''అస్సలు మాట్లాడ కూడదని డాక్టరు చెప్పాడు! ఈ ఒక్క రాత్రికి కళ్ళు మూసుకుని విశ్రాంతిగా పడుకోరా!'' అన్నారు అర్థింపుగా.

''ఇక నాకు ఒకటే విశ్రాంతి ... శాశ్వత...''

వెంకట్రావుగారు చప్పున చేయి చాచి ఆయన నోరు మూసేశారు.

'మళ్ళీ అదే మాటా? ... అలా అంటే నామీద ఒట్టే అన్నా వినవేం?'' అన్నారు తెచ్చి పెట్టుకున్న విసుగుతో.

రాజారావుగారు నిండుగా నవ్వి మళ్ళీ ఏదో చెప్పబోయారు! కానీ, ఆయన వినిపించుకోలేదు. తన చేతిని విసురుగా లాక్కుని లేచి నిలబడ్డారు! యింకొక్కక్షణం అక్కడవుంటే, రాజారావు మాట్లాడటం, ఆ వెంటనే గతించిన సంఘటనల వత్తిడికి వుద్రేకపడటం, తిరిగి నొప్పి అధికం కావటం ఖాయం.

ఏది స్నేహధర్మం?

అందుకే ఆయన పిలుపు వినిపించుకోనట్టే పక్కగదిలోకి వెళ్ళిపోయారు వెంకట్రావుగారు.

ఒక్కోక్షణం ఆయన గుండెలమీద చెప్పలేని బరువును మోపి, నిర్లక్ష్యంగా గడిచిపోతోంది! తను వుదయం ఆ యింట్లో అడుగు పెట్టగానే ఎదురయిన సంఘటన, మరోసారి ఆయన కళ్ళముందు కదిలింది!

''ఒరేయ్ వెంకూ! యితను నా పెద్దల్లుడు సుందరం! అసిస్టెంట్ యింజనీర్‌గా యిక్కడే పని చేస్తున్నాడు. అతను రెండో అల్లుడు రమేష్! లాయర్ ప్రాక్టీస్ మొదలెట్టాడు. మూడో అల్లుడు డాక్టర్!... ఫారిన్‌లో వున్నాడు. రెండు మూడు నెలల్లో రిసెర్చి పూర్తిచేసివస్తాడు'' అంటూ అంత బాధలోనూ, గర్వంగా పరిచయం చేస్తుంటే మొదట విస్తుపోయాడు తను.


అటువంటి అల్లుళ్ళని తీసుకురావటానికి వాడు శారీరకంగా, మానసికంగా, ఎన్ని కష్టాల్ని తట్టుకున్నాడో గ్రహించటానికి తనకి ఎంతోసేపు పట్టలేదు! పైగా వేలు కుమ్మరించి కొనుక్కున్న ఖరీదైన అల్లుళ్ళని ప్రత్యేకించి వాడు గర్వంగా పరిచయం చేయటానికిగల కారణం కూడా తనకి తెలుసు!

సరిగ్గా పదిహేనేళ్ళ క్రితం... సర్వం కోల్పోయిమామూలుమనిషిగా, తన స్నేహంతో వూపిరి పోసుకుని తన దగ్గరికి చేరినవాడితో, కావాలని వాదన పెట్టుకుంటూ...

''డబ్బు విలువగానీ జీవితం విలువగానీ నీకు బొత్తిగా తెలియవురా! నువ్వు యింకా భ్రమలోనే వున్నావు! ఒరేయ్! నీకు వున్నది ముగ్గురు ఆడపిల్లలుగానీ మూడు రత్నాలు కాదు. బీరువాలో వుంచి మురిసిపోవటానికి'' అని వ్యంగ్యంగా అన్న తన మాటలకి,రోషంతో తల ఎగరేసి...

''ఈనాడు నాకేం లేదనేగా ఈ ఎత్తిపొడుపు! ఒరేయ్! ముగ్గురు ఆడపిల్లలంటే మట్టిలో విసిరేసే మూడు రాళ్ళు అనుకుంటున్నావు కదూ? కాదురా! సాన పెట్టి వాటి మెరుపేమిటో, వాటి స్థానం ఎక్కడో





కూడా నిరూపిస్తాను!'' అంటూ భార్యా బిడ్డల్ని తీసుకుని వెళ్ళిపోయాడు.

ఆ ప్రతిజ్ఞ నిలుపుకున్న శక్తే, ఈనాడు వాడి కళ్ళలో కదిలిన గర్వానికి ఆనందానికి ఆలంబన అయింది!

హఠాత్తుగా గదిలో అలికిడి వినిపించేసరికి కళ్ళు విప్పారు ఆయన! కామేశ్వరమ్మ ఎందుకో వచ్చి నిశ్శబ్దంగా తిరిగి వెళిపోతోంది.

''కాముడూ! ఆగు. యిలా నా దగ్గరగా వచ్చి కూర్చో! నాకేమిటో భయంగా వుంది!'' అన్నారు గబగబా కుర్చీలో లేచి కూర్చుంటూ!

అప్పటికే ఆయన మొహమంతా చెమట పట్టేసింది! పరిశీలనగా చూస్తే, ఆయన శరీరంలోని అణువణువు కంపిస్తోందని అర్థమవుతుంది. కానీ కామేశ్వరమ్మ యిదేమీ పట్టించుకున్నట్టు లేదు.

అప్పుడే, ఓ కొత్త మనిషిని చూస్తున్నట్టు, ఆవిడ భర్తవేపు అదోలా చూసింది!

''భయం దేనికండీ! నిర్దయమైన సమాజపు విషచూపుల నుంచి రక్షించి, ఆఫీసరుగా మీకు ఓ ప్రత్యేక హోదాని కలిగించిన స్నేహితుణ్ని, ఆనాడు మెడబెట్టి గెంటించినప్పుడు, చీత్కారం చేసినప్పుడు లేని పాపభీతి, ఆయన చావుకళ్ళారా చూడటంలో కలుగుతోందా?'' అంది

''కాముడూ!'' వెంకట్రావుగారు తెల్లబోయి చూసారు!

ఈ ముప్ఫయియేళ్ళ జీవితంలో, ఆవిడ అంత వ్యంగ్యంగా, ఎత్తిపొడుపుగా మాట్లాడటం ఆయన ఎరుగడు.

''అసలు, చెడి స్నేహితుల పంచన చేరమని వివరన్నారోగానీ, అంతకంటె హీనం మరోటి ఏదీలేదని నేను నొక్కి చెప్పగలను!'' అందివాప్త ఆవేశంగా.

అప్పటికే ఆవిడగుండెల్లోని వేదన, కన్నీటి రూపంలో బయటికి జారుతోంది! వెంకట్రావుగారు అవాక్కయినట్టు, స్తబ్దంగా, భార్యను చూడటంతప్ప, పెదవి విప్పలేక పోయారు. ఆవిడ ఏడుస్తూనే ఏమిటేమిటో అంటోంది. చాలాసేపటి తర్వాత ఆయనలో చలనం కలిగినట్టయింది. లేచి మెల్లగా భార్య దగ్గరగా వెళ్ళి ఆర్తిగా కళ్ళు వత్తారు.

''పిచ్చిదానా! ఎందుకలా ఆవేశపడతావు! ఒక్కమాట చెప్పనా?... రాజా అష్టైశ్వర్యాలతో, కీర్తి ప్రతిష్ఠలతో తులతూగుతున్న రోజున, సంతోషించిన వాళ్ళలో మొట్టమొదటి వ్యక్తిని నేను. అలాగే అర్థంలేని ఆడంబరాలతో జీవితాన్ని చేతులారా నాశనం చేసుకుని, నడిరోడ్డుమీద నిలబడినప్పుడు, హృదయం బద్దలయ్యేలా విలపించిన మొదటి వ్యక్తిని కూడా నేనే!... ముందు యిలారా!'' అంటూ భార్య చేయిపట్టి తీసుకొచ్చి, మరోకుర్చీలో కూర్చోపెట్టారు ఆయన.

''చూడు కాముడూ! రాజా మనస్తత్వం నీకన్నా నాకే బాగాతెలుసు. అవునా? పసితనం నుంచి మా మనసులు పాలు తేనెలా కలిసిపోయాయి! చిన్నప్పుడు ఎక్కువగా మునసబుగారి జామితోటలో చేరి, యిద్దరం దొంగతనాలు చేసేవాళ్ళం. కడుపుకు పట్టినన్ని కాయలుతిని నిక్కరుజేబుల్లో, దోసిళ్ల నిండుగా కూడా కాయలు కోసి తీసుకు పోయేవాళ్ళం.

అప్పుడప్పుడు యింటికి వచ్చేదారిలో మాలపేటదగ్గర ఆగి, అనాథ పిల్లలకి తనుకోసిన కాయలన్నీ యిచ్చేసేవాడు రాజా! పైగా... అవి చాలకపోతే, బతిమలాడి, బెదిరించి నాదగ్గరివి కూడా తీసుకుని వాళ్ళందరికి పంచిపెట్టేవాడు యిదంతా ఎందుకు చెబుతున్నానో తెలుసా?'' అని ఒక్కక్షణం ఆగి భార్య కళ్ళలోకి చూసారు ఆయన.

ఆవిడ అయోమయంగా, తల అడ్డంగా వూపింది!

''ఆనాటి వాడి పసితనంలో, ఎంతో స్వచ్ఛత, అమాయకత, ఆ దీనులపట్ల ఆర్ద్రత వుండేవి. కానీ, క్రమంగా వాడు పెరిగేకొద్దీ, ఆ స్వచ్ఛత, అమాయకత అతిశయంగా, ఆ ఆర్ద్రత కొంత స్వార్థంగా, వాడిలో వేళ్ళు పాతుకుపోయాయి.

ప్రతిక స్టాండర్డ్ పెరిగి, నలుగురిలో ఓ గుర్తింపు ఏర్పడేసరికి, వాడి దుబారాకి అడ్డూ అదుపు లేకుండాపోయింది. అర్థంలేని ఆ ఖర్చులకినేను ఎన్నోసార్లు మందలించేవాణ్ణి. అయినా వాడు వినిపించుకునేవాడుకాదు!... పైగా...

'నీకు ప్రపంచం సంగతి బొత్తిగా తెలియదురా! యిప్పుడు లౌక్యంగా యింత ఖర్చుపెట్టానంటే, యింతకు రెట్టింపు సొమ్ముతో పాటు, నలుగురిలో గుర్తింపు, పేరు కూడా వస్తాయి!' అని నవ్వుతూ నా మాటల్ని కొట్టిపారేసేవాడు.

అలాగే, ధనపడి అంతా హారతి కర్పూరం చేసాడు. కానీ, వాడు కోరుకున్న కీర్తి ప్రతిష్ఠలు వాణ్ణి ఆదుకోలేదు. బావమరిది సంకుచితత్వానికి అభిమానపడి భార్యాబిడ్డలతో మన దగ్గరకి వచ్చేశాడు. వుద్యోగప్రయత్నం చేస్తానంటే వద్దన్నాడు వ్యాపారంతప్ప మరేం చేయలేనన్నాడు. ఆఫీసులో కొంత డబ్బుతెచ్చి యిచ్చాను. వ్యాపారం తెలిసిగానే మొదలుపెట్టాడు కానీ ఏం లాభం! వాడి స్వభావంలో మార్పేం రాలేదు.

ఏది స్నేహధర్మం ?

చిన్నప్పుడు చేతిలో జాంకాయలు లాక్కుని పంచిపెట్టినట్టే, ఎవరికో 'చందాలు...విరాళాలు' యివ్వాలంటూ నన్ను వందలు వందలు అడిగేవాడు. అప్పటికి వాడితోపాటు నేను కూడా బాధ్యతగల యిద్దరు బిడ్డల తండ్రిని.

అదీగాక...జీవితాంతం రాజా కుటుంబాన్ని పోషించినా, వాడి ఋణం ఈ జన్మలో తీరని దని నాకు తెలుసు. అసలు అప్పటి నా వుద్యోగ స్థితినిబట్టి, భవిష్యత్తు మోసం చేయకుండా వుంటే, మన పిల్లలతోపాటు వాడి ముగ్గురు ఆడపిల్లలకి పెళ్ళి చేయగల శక్తి నాకు వుంది! కానీ, కాలం ఎప్పుడూ ఒకేలా వుంటుందని భ్రమపడటం కూడా మన పొరపాటు!

అందుకే...ఆనాడు వాడి విషయంలో అంత కఠినంగా ప్రవర్తించాను. నా మాటల వల్ల అభిమానంతో వేరుపడి. అలాగైనా వాస్తవాన్ని, లోకాన్ని అర్థం చేసుకుంటాడను కున్నానుగానీ, యిలా...యిన్నేళ్ళు తన వునికి తెలియనివ్వకుండా నన్ను శిక్షిస్తాడని అనుకో లేదు!

ఎన్నోసార్లు నువ్వు ఈ విషయంలో నాతో పోట్లాట వేసుకునే దానివి. అప్పట్లో, ఆ బాధలో, నీకేం సమాధానం చెప్పలేక విసు క్కునేవాణ్ణి. కోపగించుకునేవాణ్ణి. ఆ తర్వాత 'అసలు విషయం యిది' అని చెప్పి నిన్ను నమ్మించబోయి, వాదన పెంచుకుంటూ, క్రమంగా మానబోతున్న గాయాన్ని మళ్ళీ రేపటం యిష్టంలేక వూరుకున్నాను.

కాముడూ! విలువైన పదిహేనేళ్ళ కాలం వ్యర్థమైపోయినమాట నిజమే! కానీ, యిన్నాళ్ళ ఎడబాటులోని, తీయని బాధని చూస్తుంటే యిప్పుడు అనిపిస్తోంది.

స్నేహం అనేది ఆ క్షణంలో వుత్సాహాన్ని వుత్తేజాన్ని కలిగించి, మరు క్షణంలో చెదిరి పోయే తామరాకుమీది నీటి బొట్టులా క్షణిక మైనది కాకుండా, వసివాడి రాలిపోయినా, పూవుకి తావి అబ్బినట్లు వుండాలని!

ఈ యింట్లో అడుగు పెట్టగానే నువ్వు గమనించావో లేదో, అల్లుళ్ళని పరిచయం చేస్తుండగా వాడి కళ్ళలో కదిలిన, ఆనందం, గర్వం...నిజానికి ఆనాడు నేను ఆ బాధ్యత స్వీకరించి వుంటే, యిప్పుడు వున్న ఆనందం తృప్తి వాడికి దక్కేవి కావేమో?"

స్థాణువులా వింటూండిపోయిన కామేశ్వ రమ్మకి, 'అసలు విషయం యిదీ' అని తెలియ గానే, ఆవిడ కళ్ళు మరింత అశ్రుపూరితా లయ్యాయి.

నిజమే ఆయన కళ్ళలో ఏదో వింత మెరుపు తొణికిసలాడింది. కానీ ఆ మెరుపు కూడా ఎంతోసేపు నిలువలేదు. పాలిపోయిన మొహంలో భర్త చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొని...

"ఒరేయ్ వెంకూ! ఈ చివరి క్షణాల్లో నిన్ను చూడాలనే ఆవేదన, ఆరాటంలో పాటు, కొంత నా స్వార్థం కూడా వుందిరా! పెద్ద పిల్లల బాధ్యత అయితే తీర్చుకోగలి గాను. కానీ పసిదాన్నే అన్యాయం చేసి పోతు న్నాను. నేను లేనన్న లోటు తప్పించి... బ్యాంక్‌లో దాని భవిష్యత్తుకోసం, పదివేలకి పైగానే ఫిక్సెడ్ చేసాను! అయితే దాని బతుకు బాటలో రాలిపడే ముళ్ళు జాగ్రత్తగా ఏరి పారేసి, దాన్ని సజావుగా జీవిత గమ్యానికి చేర్చే బాధ్యత నీదేరా" అంటూ దీనంగా కంటనీరు పెట్టుకున్నారు. స్నేహం లోని విశ్వాసం యిప్పుడు అర్థమవుతోంది ఆవిడకి.

వెంకటాప్పుగారు భార్యతో మెల్లిగానే మాట్లాడావని అనుకున్నారు గానీ, ఒక విధ మైన వుద్వేగభావంతో...ఆవేశపడిన ఆయన అంతర్యం పక్క గదిలో అంతిమ క్షణాలకి అతి దగ్గరగా వున్న రాజారావుగారికి వినపడి ఆయన హృదయాన్ని కదిలించివేసింది!

ఆనందం, ఆవేదన, ఆత్మీయత, ఆర్ద్రత గుండెల్ని చీల్చుకుంటూ పెల్లుబుకుతున్న స్నేహ మాధుర్యం ఆయన హృదయాన్ని కాలం నడి సముద్రంలో నావలా వూపేశాయి! నోట మాట రాలేదు. ఊపిరి అందటం కూడా కష్టమయింది ఆయనకి.

అతి ప్రయత్నం మీద శూన్యంలోకి రెండు చేతులూ జోడిస్తూ...

"ఒరేయ్ వెంకూ! స్నేహం అంటే నీదేరా! మళ్ళీ జన్మంటూ వుంటే...నిన్నే... నిన్నే...నాకు స్నేహితుడిగా ప్రసాదించమని... భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను... రా..." ఆయన ఆ ప్రార్థన పూర్తి కానేలేదు.

క్షణంలో రాజారావుగారి ఆత్మ స్వేచ్ఛా విహంగంలా రెక్కలు విదుల్చుకుంది! మరు క్షణమే ఆయన పంచప్రాణాలు, ఆ పంచ భూతాల్లో లీనమైపోయాయి!

ఎం. కాం. పరీక్షలకి చదువుకుంటున్న క్యాడెట్ సార్జెంట్ జి. పూర్ణచంద్రరావు 1976 లో ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే పెరేడ్‌లో పాల్గొన్నాడు. ఈ యువకుడు ఎన్. సి. సి. ఏర్‌వింగ్‌లోనే కాదు సోషల్ సర్వీస్‌లో కూడా వున్నాడు [ఎన్. ఎస్. ఎస్. లో]



★ యువతరం ★

"రిపబ్లిక్ డే పెరేడ్ చూసే అవకాశం కలగవచ్చుగాని అందులో పాల్గొనటం అందరికీ వీలుపడదు. అందుకు నేను గర్విస్తున్నాను" అన్నాడు. "వివిధరాష్ట్రాలకు చెందిన క్యాడెట్లు తెలిసీ తెలియని భాషలో పలకరించుకోవటమూ అర్థంకాక మొహా మొహాలు చూసుకోవటం చూడాల్సిందేతప్ప వర్ణించలేం."

స్కీట్ షూటింగ్ పోటీలో పాల్గొన్నాడు. "రాష్ట్రపతి, ప్రధాన మంత్రులతో తేనీరు– రక్షణమంత్రి, త్రివిధ దళాధిపతులు మొదలైన ప్రముఖులతో విందారగించగలిగాం" అని చెప్పాడు.

"జనవరి 26న ఉదయం నాలుగ్గంటలకే విజయ్‌చౌక్ చేరుకున్నాం. ఎనిమిదిగంటలకు ఇండియా గేట్‌వద్దగల అమరవీరుల స్మృతి చిహ్నంవద్ద ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీగారు జ్యోతి వెలిగించారు. ఆ తర్వాతరాష్ట్రపతి జాతీయపతాకం ఎగురవేశారు. శతఘ్నులు ప్రేలడంతో మా పెరేడ్ ప్రారంభమయింది. అన్నివేల మంది మధ్య పెరేడ్ చేసుకుంటూ రాష్ట్రపతిని సమీపిస్తున్నపుడు కలిగిన అనుభూతి నా జీవితంలో మరువలేను" అని పూర్ణచంద్రరావు పులకితుడై చెప్పాడు. వీళ్ళంతా వుదయం పాల్గొన్న పెరేడ్‌ని ఆ సాయంత్రం టెలివిజన్‌లో చూసుకొన్నారు. అదో అదృష్టం.

వీరి క్యాంప్‌లో ప్రతీరోజూ సాంస్కృతిక ప్రదర్శనలు జరిగేవట. ప్రధానికి గౌరవ వందనం సమర్పించినపుడు మెడల్ సంపాదించటమేకాక ఆమెతో ఫొటో దిగే అదృష్టం లభించింది యీ తెనుగు విద్యార్థికి. ఆంధ్రప్రదేశ్ తరపున 'అమ్మవారి జాతర' ప్రదర్శించి ప్రధానిని ముగ్ధులను చేశారట. వాళ్ళ క్యాంపుల వాళ్ళు వీళ్ళకి ఢిల్లీ, ఆగ్రా, ఫతేపూర్‌లలోని చారిత్రాత్మక ప్రదేశాలు చూపించారట. నాటకాలాడతాడు. టేబిల్ టెన్నిస్, బాడ్‌మింటన్ అవీ ఆడతాడట! ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ఇతని కార్టూనులు పడ్డాయి ... నెమ్మదస్తుడు ... క్రమశిక్షణలో మంచి పౌరుడు అవుతాడని ఆశిద్దాము. — సు–★

తెల్లగా వుండని వైట్‌హౌసు

వైట్‌హౌసుకి ఆ పేరు దాని రంగు వల్ల రాలేదని చెబితే ఆశ్చర్యంగా ఉండవచ్చు. బూడిద రంగు రాళ్లతో కట్టిన ఈ నిర్మాణాన్ని 1814 లో బ్రిటిషు సైన్యం తగులబెట్టింది. తరువాత ఈ భవనాన్ని మరామ్మతు చేసి పూర్తిగా తెల్లరంగు వేశారు. ఇప్పుడు జిమ్మీ కార్టర్, 1600 పెన్సిల్వేనియా ఎవెన్యూలోని ఈ భవనంలో ప్రవేశించినప్పుడు ఇది మరి తెల్లగా ధగధగలాడిపోయింది. ఇటీవలనే ప్రెసిడెంటు భవనానికి కొత్తగా పెయింటు వేశారు. ప్రతినాలుగు సంవత్సరాల కొకసారి ఈ భవనానికి పెయింటు వేస్తుంటారు. దీనికి 500 గ్యాలన్ల పెయింటు పడుతుంది. పెయింటు వేయటానికి ఆరు వారాలు పట్టింది. మొత్తం 29.000 డాలర్లు ఖర్చైంది. అమెరికా ప్రెసిడెంటు వార్షిక వేతనం 2,00,000 డాలర్లు. అంతటితో సరికాదు. వైట్‌హౌసు నిర్వహణకు

స్పోర్టెంత ?-10

చివరికి మన క్రికెట్ టెస్ట్ పోటీల దుస్థితి ఎంత దిగజారిందంటె బెంగుళూరులో జనవరి 28 నుంచి ప్రారంభమైన క్రికెట్ నాల్గవ టెస్ట్‌కి టిక్కెట్‌లు పిలిచి అమ్మడం జరిగింది. ఇది వరకు బ్లాకు మార్కెట్‌లో కూడా దొరకని టిక్కెట్‌లకు యిప్పుడు ధర తగ్గించారు - టిక్కెట్‌ల మీద లక్కీ "డ్రా"లు, బహుమతులు ఏర్పాటు చేశారు. అంతేనా? పత్రికలలో వెలువడ్డ వార్తలు చూస్తే ఆశ్చర్యంగా వుంది... బ్యాంకుల ద్వారా అప్పులు యిప్పిస్తాం- మీరు టెస్ట్ మ్యాచికి టిక్కెట్‌లుకొని సులభ వాయిదాల పద్ధతిలో తీర్చండి అని కూడా ప్రకటించారుట !

అసలు మన క్రికెట్ క్రీడాకారుల కేమైంది? లోప మెక్కడుంది? ఎందుకని యీ టీము యింత 'నాసి'గా ఆడింది? అన్న ప్రశ్నలే అందర్నీ వేధిస్తున్నాయి. ★★★

మీకు తెలుసా?

కాంగ్రెసు (అమెరికన్ పార్లమెంటు) సంవత్సరానికి 20,95.000 డాలర్లు కేటాయిస్తుంది. అత్యవసర ఖర్చులకు గాను ప్రెసిడెంటుకి మరొక 50,000 డాలర్లు ఇస్తారు. దీనికి ప్రెసిడెంట్ లెక్కలు చూపవలసిన పని లేదు.

ప్రెసిడెంటు ఫోర్డ్ పెన్షన్ వగైరాలు

ప్రెసిడెంటు ఫోర్డ్ పదవీ విరమణ అనంతరం పెన్షన్‌తో పాటు ఇంకా ఎన్నో సౌకర్యాలుంటాయి. ఫెడరల్ శాసనం ప్రకారం అమెరికా మాజీ ప్రెసిడెంట్లకు ఏటా 60,000 డాలర్ల పెన్షన్ వస్తుంది. అయితే ప్రెసిడెంటు ఫోర్డ్, రెండవ ప్రపంచ యుద్ధంలో నాలుగు సంవత్సరాలు నౌకాదళంలో పని చేశారు. పాతిక సంవత్సరాలు ప్రతినిధుల సభ (అమెరికన్ కాంగ్రెసు దిగువ సభ) సభ్యులుగా ఉన్నారు. ఎనిమిది నెలలు వైస్‌ప్రెసిడెంటుగా ఉన్నారు. 29 నెలలు ప్రెసిడెంటు పదవి నిర్వహించారు. వీటన్నిటికి కలిపి ఈయనకు ఏటా మొత్తం 1,03,000 డాలర్లు పెన్షన్ వస్తుంది. అంతేకాకుండా పదవీ విరమణ చేసిన ప్రెసిడెంటు మొదటి సంవత్సరం ఖర్చులకు గాను కాంగ్రెసు 10.00,000 డాలర్లు మంజూరు చేసింది. ఇంకా మాజీ ప్రెసిడెంటు ఆఫీసు నిర్వహణకు, సిబ్బందికి గాను సంవత్సరానికి 96,000 డాలర్లు కేటాయించడం జరిగింది.

రిబ్బను పకోడి

కావలసినవస్తువులు: శనగపిండి— మూడుకప్పులు బియ్యప్పిండి—ఒకకప్పు, వెన్నపూస—పదిగ్రాములు. నూనిపావుకెజి

జల్లించిన శనగపిండి, బియ్యప్పిండి, వెన్నముక్క ఒకబేసినులో వేసి సరిపడు వుప్పు, పచ్చిమెరపకాయలు, అల్లం మెత్తగా నూరి ఆ నీళ్ళు (తుక్కుతీసి నీళ్ళుపోసి)పోసి జంతికలపిండిలా కలుపుకోవలెను. జంతికలగొట్టములోమూడు గేట్లులావుంటుందిబిళ్ళ ఆబిళ్ళఅమర్చి పెద్దనిమ్మకాయంత వుండ గొట్టములో పెట్టి రెండవగొట్టముతోకాగిననూనిలో ఒత్తవలెను. ఇవిచక్కగా అరఅంగుళము వెడల్పులో పొడవుగా ముక్కలు ముక్కలుగా వుండును. రెండువేపులా వేగాక తీసిపళ్ళెములో వేసి అర్చి చేసుకున్నాక చల్లారినపిదప డబ్బాలో వేసి వుంచుకుంటే వారంరోజులు దాక నిలవ ఉంటాయి.

— శ్రీమతి ఎ. అరుంధతీరావు.

డాక్టర్ సలహాలు

(33వ పేజీ తరువాయి)

కె. సి. పి. — గిద్దలూరు

నాకు మల, మూత్ర విసర్జన సమయాల్లో 4, 5 తెల్లటి చుక్కలు మూత్రద్వారంనుంచి గత 8 సంవత్సరాలుగా వస్తున్నది. వివాహమై 7 సంవత్సరాలు అయింది. ఇంతవరకు సంతానం కలుగలేదు. నాకు వివాహానికి పూర్వం దురలవాట్లు ఉండేవి. పై రోగానికి, ఇదివరకు నాలోని దురలవాట్లకీ, ప్రస్తుతం పిల్లలు కలుగకపోవటానికి సంబంధం ఉన్నదా ?

మీకు తెలిసే వ్రాసిన విషయాలు మీ సందేహానికి జవాబులే అంటే మీకు అర్థమయిందిగా ! దురలవాట్లవల్ల ఏర్పడిన సుఖవ్యాధుల ప్రభావంవల్ల మూత్ర విసర్జన కష్టతరమవటం దాని ప్రభావంవలననే పిల్లలు కలుగక పోవటం జరిగింది. ఇప్పటికైనా, మీరు—మీ భార్య ఇద్దరూ రక్త పరీక్ష చేయించుకొని ఆ ఫలితాల దృష్ట్యా ఏదైనా ! రోగలక్షణాలు మిగిలి ఉంటే వాటికి క్రమపద్ధతిలో పి. ఎ. ఎం. అనే ఇంజెక్షన్లు వైద్యుల పర్యవేక్షణలో వారు చెప్పినంతవరకు వేయించుకొంటే పిల్లలు కలిగే అవకాశం ఉంది.

వి. ఎస్. పి. — తెనాలి

నా వయస్సు 18 సంవత్సరాలు. వివాహమై 3 సంవత్సరాలు అయింది. మాది మేనరికం. బుతుక్రమ సమయాల్లో విపరీతంగా కడుపు నెప్పి వస్తూఉంటే ఇక్కడ చిన్న ఆపరేషన్ చేశారు. నెప్పి తగ్గింది కాని తెలుపు అవటం తగ్గలేదు. నీరసం ఎక్కువగా ఉన్నది. నాకు పై విషయాల దృష్ట్యా పిల్లలు కలిగే అవకాశం ఉందా ?

మేనరికం, బుతుక్రమ సమయాలలో నెప్పి, తెలుపు అవటం, మొదలయిన వాటికీ పిల్లలు కలుగక పోవటానికీ పెద్దగా సంబంధంలేదనే చెప్పాలి. మీ శరీరంలోని నీరసం అనే బలహీనం గాని, మీ వారిలోని స్పెర్మ్‌ల సంఖ్య తగ్గి ఉండటంవలనగానీ, లేక మీ గర్భసంచి, తత్సంబంధ భాగాలలో ఉన్న మార్పులవల్లగాని పిల్లలు కలుగకపోయి ఉండవచ్చును ఏదైనా మీ ఇద్దరూ తగిన పరీక్షలన్నీ చేయించుకొని, సరిదిద్ద కలిగే లోపాలకుగాను తగిన వైద్యం చేయించుకొంటే ఫలితం పొందవచ్చు.

ఎల్. వి. ఎస్. కొత్తపల్లి

స్త్రీకి ప్రసవానంతరం బుతుక్రమం ఒకసారైనా రాకుండానే తిరిగి గర్భంధరించే అవకాశం ఉన్నదా ?

స్త్రీ పురుషుల కలయిక ఎక్కువగా అయితే ఆడపిల్లలు, తక్కువగా అయితే మగపిల్లలూ పుడతారని ఏదో పుస్తకంలో చదివాను. ఇది నిజమేనా?

మీ మొదటి ప్రశ్నకి— "ఉన్నది" అనేది నా జవాబు.

ఇక రెండవ ప్రశ్నకి— ఏ విధమైన ఆధారాలూ నిదర్శనాలూ లేకుండా ఎవరిచేతో చెప్పబడటంవలననో లేక కొందరి నమ్మకాలను మాత్రం అనుసరించిగాని ఏర్పడే ఇటువంటి శాస్త్ర సమ్మతంగాని, విషయాలను గురించి నేను ఇక్కడ నిర్ధారణంగామీకునిజమో అబద్ధమో అనేదాన్ని గురించి వ్రాయటం మంచిది కాదు. వాటికి మీ నమ్మకాలననుసరించటంలో తప్పేమీలేదని మాత్రం చెప్పగలను వాటిని మీరు నమ్మితే !


ఎస్. ఎస్. కడప

నా వయస్సు 23 సం.లు ఒక సం., క్రితం నా వివాహమయ్యింది. 3 నెలలుగా బుతుక్రమం వచ్చే సమయంలో బ్లీడింగ్ సరిగాఅవదు. ఇలా అవటానికీ శరీరరంగు నల్లబడటానికి ఏదైనా సంబంధం ఉన్నదా ?

బుతుక్రమ సమయంలో రక్తస్రావంసరిగా జరుగక పోవటానికీ, శరీర రంగు నల్లబడటానికి ఏ సంబంధమూలేదనే చెప్పాల్సి వుంది. రక్తస్రావం అధికంగా జరిగితే శరీరం పాలిపోయినట్లవటం సహజం. అయితే రక్తస్రావం కొద్దిగా మాత్రమే జరిగినప్పుడు శరీర రంగులో ఏ మార్పురాదు. నెత్తురు శరీరంలో ఎక్కువగా చేరిపోయి రంగు మారుతున్నదేమో అనే మీ ఊహ సరిఅయినదికాదని నా అభిప్రాయం.

—డా. కె. వెంకటేశ్వరరావు

Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Stree., Gandhinagar, Vijayawada-3. Editor. S. Radhakrishna


శ్రీ కాకతీయ పిక్చర్స్ (వరంగల్)
చిల్లర దేవుళ్ళు
దర్శకత్వం: టి. మాధవరావు
సంగీతం: కె.వి. మహదేవన్
కథ-మాటలు: దాశరథి రంగాచార్య
ఛాయ: జి.వి.ఆర్. యోగానంద్
కళ: చంద్ర
డిస్ట్రిబ్యూటర్స్: తారకరామ శ్రీతారకరామ నవభారత్